

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 103 • పేజీలు:12+16 • వెల: రూ.5 | మంగళవారం • 13-3-2018 | www.manamnews.com | /manamnews





ఉదయం 10 గంటలు: అసెంబ్లీ సమావేశం

10.05: గవర్నర్ నరసింహన్ రాక

10.10: కాంగ్రెస్ సభ్యుల నిరసన

10.15: హెడ్‌ఫోన్ విసిరిన కోమటిరెడ్డి

10.32: ముగిసిన గవర్నర్ ప్రసంగం

11.00: ఆసుపత్రికి స్వామిగౌడ్ తరలింపు


సరోజిని దేవి ఆసుపత్రిలో కంటికి కట్టుతో మండలి చైర్మన్ స్వామిగౌడ్

రణరంగం

తెలంగాణ అసెంబ్లీ.. తొలిరోజే రచ్చరచ్చ

తీవ్రస్థాయిలో కాంగ్రెస్ సభ్యుల నిరసన.. ప్లకార్డులు ప్రదర్శిస్తూ గట్టిగా నినాదాలు

పోడియం వైపు దూసుకొచ్చే ప్రయత్నం.. కాగితాలు చించేసి గాల్లోకి విసిరివేత

గవర్నర్‌వైపు హెడ్‌ఫోన్స్ విసిరిన కోమటిరెడ్డి.. అవి తగిలి స్వామిగౌడ్ కంటికి గాయం

రుజువు చేస్తే రాజీనామా: కోమటిరెడ్డి.. ఘటనపై కాంగ్రెస్ సభ్యుల అనుమానం

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజే.. రణరంగాని తలపించింది. సభకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్.. ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం ఆరంభించిన కొద్దిసేపటికే కాంగ్రెస్ సభ్యులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేయడం మొదలుపెట్టారు. కాగితాలు చించేసి గాల్లోకి విసిరేశారు. పరిస్థితి చేయిదాటుతోందని గమనించిన మార్షల్స్.. ఒక్కసారిగా సభలోకి దూసుకొచ్చి, స్పీకర్ పోడియం ముందు రక్షణ వలయంలా నిలబడి ఎవరినీ వెల్ వరకు కూడా రానివ్వలేదు. అంతలో ఒక్కసారిగా ఆవేశానికి లోనైన కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన హెడ్‌ఫోన్స్ తీసి గవర్నర్ వైపు విసరగా... అది గురి తప్పి ఆయన పక్కనే కూర్చున్న శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ కంటికి తాకింది. దాంతో ఆయనను నగరంలోని సరోజిని దేవి కంటి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటన అధికార టీఆర్ఎస్... ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్రస్థాయి మాటల యుద్ధానికి దారితీసింది.

6లో..



వీధిరౌడీల్లా..

- గూండాల్లా వ్యవహరించారు
- మాది 'భగత్‌సింగ్' పోరాటం
- వాళ్లది ఉగ్రవాదుల్లాంటి దాడి
- కాంగ్రెస్‌పై హరీశ్‌రావు ధ్వజం
- ఎన్ని గంటలైనా సభ నడుపుతాం
- దాడి ఎందుకని సూటి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి):

చట్టాలను చేయాల్సిన సభ్యులై ఉండి సభలో కాంగ్రెస్ నేతలు వీధి రౌడీలు, గూండాల్లా ప్రవర్తిం చారని మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో ఏదడిగినా **మిగతా 6లో..**



నిరసనలు మామూలే

హామీలు అమలు కానందువల్లే.. ప్రభుత్వమే రెచ్చగొట్టేలా చేసింది

పార్లమెంటులో మీరూ చేశారుగా.. ఇక్కడ మేం వెల్‌లోకి వెళ్లకూడదా

మార్షల్స్ మోహరింపు అన్యాయం.. సీఎల్పీ నేత జానారెడ్డి మండిపాటు

హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి):



అసెంబ్లీలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలపటం సర్వ సాధారణమేనని శాసనసభలో సీఎల్పీ నేత కె. జానారెడ్డి అన్నారు. జరిగిన ఘటనపై సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నాలుగేండ్లలో అమలు కాకపోవడం వల్లే కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారన్నారు. మార్షల్స్‌ను పెద్ద ఎత్తున మోహరించడంతో పాటు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తంచేస్తున్న వారిని రెచ్చగొట్టేలా ప్రభుత్వమే వ్యవహరించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ సభ్యులకు మార్షల్స్ అడ్డుపడి తోసివేయడంతోనే ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. ఈక్రమంలోనే కొందరు పేపర్లు చించి విసిరేశారని చెప్పారు. పార్లమెంట్‌లో టీఆర్ఎస్ సభ్యులతో పాటు పలు పార్టీలకు చెందిన వారు వెల్‌లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్నారని, ఇక్కడేమో తమను వెల్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం విచారకరమని అన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా పెద్ద ఎత్తున మార్షల్స్‌ను మోహరించటం అన్యాయమన్నారు. ప్రజా సమస్యలను విస్మరించటంతో పాటు ప్రాధాన్యం గల అంశాలు లేకపోవటం వల్లే గవర్నర్ **మిగతా 6లో..**

ఇదీలోకం!



మోదీ, చంద్రబాబు మంచి దర్శకులా సార్..!

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి మ.1.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ.12.28 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా.4.55-6.41; దుర్ముహూర్తం: ఉ.8.52-9.40, మ.2.25-3.12; రాహుకాలం: మ.3.24-4.53; అమృతఘడియలు: తె.5.20-7.08;



బంగారు తెలంగాణ లక్ష్యం

- అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి
- అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి
- సాగుకు అత్యంత ప్రాధాన్యం
- దేశానికే తెలంగాణ ఆదర్శం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగంలో గవర్నర్ నరసింహన్

హైదరబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి):

ప్రభుత్వం మూడున్నరేళ్లుగా చేపట్టిన క్రియాశీలక విధానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి సాధిస్తున్నదని గవర్నర్ నరసింహన్ చెప్పారు. బంగారు తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయని **మిగతా 6లో..**

రాలుతున్న మొగ్గలు

రోజుకు 26 మంది విద్యార్థుల ఆత్మహత్య

2007-16 మధ్య 75వేల మంది బలవన్మరణం

పరీక్షలలో ఫెయిల్ కావడమే ప్రధాన కారణం


రోజురోజుకూ విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి

మహారాష్ట్రలోనే పిల్లల ఆత్మహత్యలు అత్యధికం

తర్వాత స్థానాల్లో పశ్చిమబెంగాల్, తమిళనాడు

లోక్‌సభలో కేంద్రమంత్రి హెచ్ఆర్ అహిర్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 12:



హాయిగా ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వ యసు వారిది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన పిల్లలు **మిగతా 6లో..**



కూలి.. కాలిపోయింది!

నేపాల్‌లో కుప్పకూలిన బంగ్లాదేశ్ విమానం

వెంటనే విస్తరించిన మంటలు.. పొగలు

- 50 మందికి పైగా ప్రయాణికుల దుర్మరణం
- విమానంలో సిబ్బంది సహా మొత్తం 71 మంది
- త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేత

ఖాట్మాండు, మార్చి 12:

మరికొద్ది క్షణాల్లో విమానం ల్యాండ్ కావాల్సి ఉంది. ఇక అంతా గమ్యం చేరుకున్నామనే అనుకున్నారు.. అంతలో ఏమైందో తెలియదు ఒక్కసారిగా విమానం కుప్పకూలింది. అందులో ఉన్న దాదాపు 50 మందికి పైగా మరణించారు. ఈ ఘోర దుర్ఘటన నేపాల్ రాజధాని ఖాట్మాండులోని త్రిభువన్ అంతర్జాతీయ **మిగతా 6లో..**




కోటా ఇవ్వాల్సిందే

కొనసాగిన టీఆర్ఎస్ ఎంపీల నిరసన

హైదరాబాద్, మార్చి 12: గత ఏడాది తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రిజర్వేషన్ల పెంపుదల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్‌చేస్తూ టీఆర్ఎస్ ఎంపీలు దేశ రాజధాని ఢిల్లీలో పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. సోమవారం కూడా పార్లమెంట్ ద్వారా వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. కోటాను పెంచాలని, అందుకు అనుగుణంగా రాజ్యాంగంలోని 16(4) అధికరణానికి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, జితేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, బీబీ పాటిల్, జీ నగేశ్, తదితరులు పాల్గొన్నారు. ఉభయ సభల్లోనూ ఎంపీలు మరోసారి గళమెత్తారు. కోటాపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. రిజర్వేషన్లపై హక్కులు రాష్ట్రాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.


హైదరాబాద్‌లో సోమవారం రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా సుఖేందర్ రెడ్డిని అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కౌలు రైతులకు 'పెట్టుబడి' ఇవ్వండి

- **రాష్ట్ర కౌలురైతుల సంఘం డిమాండ్**

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): పెట్టుబడి పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వివిఎస్ ప్రసాద్ శాస్త్రి డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు, మహిళా రైతుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడి పథకాన్ని కౌలు రైతులకిచ్చే విషయమై అందరి అభిప్రాయాలను సేకరించాలన్నారు. భూయజమానులకే ప్రభుత్వ పోత్సాహకాలను పరిమితం చేయకుండా సాగుదారులందరికీ అందజేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, తమ్మెర విశ్వేశ్వరరావు, కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాల్లో భాషా పండితులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే

- **లేకపోతే భాషా శాస్త్రాలు అంతరిస్తాయి: హైకోర్టు ఆగ్రహం**

హైదరాబాద్, మార్చి 12 (మనం లీగల్ ప్రతినిధి): భాషా పండితుల కోర్సులు చేసే వారికి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే అందరూ వృత్తి విద్యా కోర్సుల పట్ల మొగ్గు చూపితే భాషా శాస్త్రాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో తెలుగు, ఉర్దూ, అరబిక్, సంస్కృతం ఇతర భాషా అధ్యాపకుల్ని లా, హిందీ బోధనలకు బదిలీ చేయడాన్ని సయ్యద్ రహ్మతుల్లా, ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారణ జరిపింది. భాషా శాస్త్రాల్లో విద్యా సంవత్సరాల వారీగా ఎంతమంది చొప్పున విద్యార్థులు చేరినదీ, మంజూరైన పోస్టుల వివరాలు అందజేయాలని బెంచ్ ఈ రెండు యూనివర్సిటీలను ఆదేశించింది. విద్యార్హతకు సంబంధం లేకుండా ఇతర శాఖలకు అయిన బదిలీలు వంటి వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

15న ఎడ్‌సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఎడ్‌సెట్-2018 నోటిఫికేషన్ మార్చి 15న విడుదల చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుముతో మే 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని సమాచారం. మే 31, జూన్1న ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 11న ఫలితాలు విడుదల చేస్తామని ఉన్నతవిద్యామండలి అధికారులు వెల్లడించారు.

సభలో హైలైట్స్..

- గవర్నర్ ప్రసంగం 5 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమయ్యిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.
- గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో మొదలెట్టారు. తర్వాత ఆంగ్లంలో చదివారు.ప్రపంచ తెలుగు మహాసభల గురించి ప్రసంగించేటప్పుడు తెలుగులోనే ప్రసంగం చదివారు.
- గవర్నర్‌పైకి చించిన కాగితాలు, హెడ్‌సెట్స్ విసురుతున్న సమయంలో ఆయన కొంత ఆందోళనగా కనిపించారు.
- గవర్నర్ ప్రసంగిస్తున్నంత సేపు ముఖ్యమంత్రి కేసీఆర్ తలెత్తకుండా బడ్జెట్ కాపీలను చదుతుండటం గమనార్హం.
- గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్ సభ్యుల ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు.
- కాంగ్రెస్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డీకే అరుణ, గీతారెడ్డి, పద్మావతి, కోమటిరెడ్డి బ్రదర్స్‌తో పాటు పలువురు నిరసన తెలిపారు.
- మంత్రులు హరీశ్‌రావు, కడియం బడ్జెట్ ప్రసంగాన్ని చదువుతూ మధ్యమధ్యలో కాంగ్రెస్ సభ్యుల నిరసనను చూస్తున్నారు.
- గవర్నర్ ప్రసంగం మధ్యలో బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.
- గవర్నర్ ప్రసంగాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి గవర్నర్‌పైకి విసిరారు. హెడ్‌ఫోన్స్‌ను ఆయనపై విసిరారు.
- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు వెల్‌లోకి వస్తున్న కాంగ్రెస్ సభ్యులను అడ్డుకునే క్రమంలో ప్రతిపక్ష నేత జానారెడ్డి కడుపుకు బల్ల ఒత్తుకుపోయిందిని ఆ పార్టీ నేతలు చెప్పారు.
- ప్రతిపక్ష నేత జానారెడ్డి కార్యాలయం వద్ద మార్షల్స్ రిహార్సల్స్ చేయటం పట్ల పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విస్మయం ప్రకటించారు.
- టీఆర్ఎస్ ఎమ్మెల్యే అసెంబ్లీ బయట నిలుచుని ఉండగా గన్‌మెన్ పార్టీ కండువాను పట్టుకోవటం గమనార్హం.
- తాను సీఎం బంధువనంటూ ఓ మహిళ టీఆర్ఎస్ నేతలను పరిచయం చేసుకుంటూ కనిపించింది. దీనిపై పలువురు చర్చించుకున్నారు.
- కాంగ్రెస్ సభ్యులకన్నా దాదాపు మూడు రెట్ల సంఖ్యలో మార్షల్స్ మోహరించినట్టుగా ప్రతిపక్షాలు ఆరోపించాయి.

ఆహార శుద్ధి పరిశ్రమలతో రైతులకు లబ్ధి


- **వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి**

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): ఆహార శుద్ధి పరిశ్రమలకు అనువైన ఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, తద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి తెలిపారు. ఎగుమతికి అనువైన ఉత్పత్తుల పెంపకం చేపట్టాలని ఆహార శుద్ధి పరిశ్రమలు కోరుతున్నాయని, ఈ విషయంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కోరామని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు ఆదాయం పెంచాలని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ చేసిన ఆదేశాల మేరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యాన, మత్స్యశాఖ శాస్త్రవేత్తలు, ఆహార శుద్ధి సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో పార్థసారథి సోమవారం సచివాలంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారశుద్ధి పరిశ్రమల ప్రతినిధులు కోరిన విధంగా వారికి వ్యవసాయ ఉత్పత్తులను అందించడానికి తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

లక్ష్యం 'అబూజ్‌మడ్'

మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్

- దండకారణ్యంలో బలగాల మొహరింపు
- తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో గ్రేహౌండ్స్ కూంబింగ్


పెద్దపల్లి క్రైమ్, మార్చి 12(మనం న్యూస్): దండకారణ్యంలో మరోమారు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. మావోయిస్టు అగ్రనేతలు అబూజ్‌మడ్‌లో ఉన్నారన్న సమాచారంతో ఛత్తీస్‌గఢ్- తెలంగాణ- ఒడిస్సా సాయుధ బలగాలు ఆ ప్రాంతంలో మొహరించాయి. ఏవోబీ, దంతెవాడ, దక్షిణ బస్తర్ దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ అనంతరం మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లోని అజాజ్‌మడ్‌ను స్థావరంగా మార్చుకున్నారని కేంద్ర నిఘా వర్గాలు గుర్తించాయి. ఆపరేషన్ సమాధాన్(గ్రీన్‌హంట్) పేరుతో కేంద్రబలగాలు, నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా ఇటీవల భారీ ఎన్‌కౌంటర్లు నిర్వహించారు. ఇవి మావోయిస్టులను కోలుకోలేని దెబ్బతీశాయి. మావోయిస్టులు తమ పరిధిలోని ప్రాంతంలోకి రాగానే సాయుధబలగాలు మూకుమ్మడిగా దాడి చేసి శత్రువును మట్టుబెడతాయి. గ్రీన్‌హంట్‌లో ఇదే ప్రధానంశం. ఈనెల 2న తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతం, బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీసు స్టేషన్ పరిదిలోని పూజారికాంకర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టు అగ్రనేతలు అబూజ్‌మడ్‌లో స్థావరంలో తలదాచుకున్నట్లు భద్రత బలగాలకు తెలిసింది. దీంతో అబూజ్‌మడ్‌ను బలగాలు చుట్టుముడుతున్నాయి. ఆకురాలే ఈ కాలం దాడి చేయడానికి చాలా అనుకూలమని బలగాలు భావిస్తున్నాయి. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోఉన్న అబూజ్‌మడ్ చేరుకోవాలంటే బలగాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 70కిమీ ప్రయాణించి కుంట గ్రామానికి చేరుకోవాలి. అక్కడి నుంచి దోర్నపాల్, ఎర్రబోరు, చింతగుహ, చింతల్‌నార్, తొండమహల్, మెట్టబేడ, సుకుమా, కుతుల్‌హిల్‌లు దాటి వెళితే అబూజ్‌మడ్ వస్తుంది . కుంట నుంచి అబూజ్‌మడ్ వరకు ఉన్నదంతా దట్టమైన అటవీ ప్రాంతం.1980 నుంచి 90 వరకు నక్సలై ట్లకు(ప్రస్తుత మావోయిస్టులు) రామగిరి ఖిల్లా స్థావరంగా ఉండేది. ఇది పెద్దపల్లి జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న రాఘవాపూర్ నుంచి కమాన్‌పూర్ మండలం మచ్చుపేట వరకు సుమారు 20కిమీ వరకు ఉంటుంది. అప్పట్లో ఇది నక్సలైట్లకు సురక్షిత ప్రాంతంగా ఉండేది.1988లో జరిగిన కోవర్టు ఆపరేషన్‌లో కరీంనగర్ జిల్లా కార్యదర్శి విజయ్ మరణించిన తర్వాత నక్సలై ట్లు నల్లమలకు మకాం మార్చారు. 2004లో జరిగిన చర్చల వరకు అక్కడే ఉన్నారు. చర్చల సమయంలో ఏపీ పోలీసులు నక్సల్ స్థావరాల సమాచారాన్ని సేకరించారు. అందుకే,చర్చలు విఫలమైన తర్వాత జరిగిన ఎన్‌కౌంటర్లలో నక్సల్స్ భారీగా నష్టపోయారు. దీంతో మావోయిస్టులు ఏవోబీని షెల్టర్ జోన్‌గా చేసుకున్నారు. బలిమెల రిజర్వాయర్‌లో 2008లో మావోయిస్టులు జరిపిన దాడిలో 34మంది గ్రేహౌండ్స్ సిబ్బంది చనిపోయారు. ఈప్రాంతంలో మావోయిస్టులపై దాడిచేసేందుకు భద్రతాబలగాలకు ఎనిమిదేళ్లు పట్టింది. 2016 జూన్ 29న బలిమెల రిజర్వాయర్‌కు 35కిమీల దూరంలోని మల్కన్‌గిరి జిల్లా జంత్రిలో జరుగుతున్న మావోయిస్టుల ప్లీనరీ సమావేశంపై గ్రేహౌండ్స్ దళాలు దాడి చేసి 34మందిని హతమార్చాయి. ప్లీనరీ కోసం రెండంచెల భద్రత వలయాన్ని మావోయిస్టులు ఏర్పాటు చేసుకోగా, గ్రేహౌండ్స్ దళాలు పలు వ్యూహాలు పన్ని ఒడిస్సా పోలీసులతో కలిసి దాడి చేశారు. వైఎస్ హయాంలో చర్చల తర్వాత అప్పటివరకు షెల్టర్‌జోన్‌గా ఉన్న నల్లమల్లలో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మాధవ్ అలియాస్ బుర్ర చిన్నన్నతో సహా చాలామంది మావోయిస్టులు చనిపోయారు. అప్పటి నుంచి తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గిపోయాయి. నిర్బంధం ఎక్కువవడంతో మావోయిస్టులు,ఇతర రాష్ట్రాలకు కార్యకలాపాలు విస్తరించారు. ఏవోబీ పరిధిలోని మల్కన్‌గిరి జిల్లా జంత్రి ప్లీనరీపై 2016లో జరిగిన దాడితో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌కు అక్కడి నుంచి అబూజ్‌మడ్‌కు మకాం మార్చారు. అంతేకాక గెరిల్లా యుద్ధ తంత్రాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గిపోయాయని అనుకుంటున్న సమయంలో తిరిగి రాష్ట్ర సరిహద్దులో మావోయిస్టుల కదలిక అధికమయ్యింది. మావోయిస్టులు ఈ ప్రాంతంపై తిరిగి పట్టు సాధించకముందే అడ్డుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. అబూజ్‌మడ్‌లో ఉన్న అగ్రశ్రేణి నాయకత్వాన్ని మట్టుబెడితే నేపాల్ నుంచి కర్ణాటక వరకు మావోయిస్టులు ప్రకటించిన రెడ్‌కారిడార్‌లోఉన్న దక్షిణ బస్తర్, బీజాపూర్, సుకుమా, దంతేవాడ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో వారి కార్యకలాపాలు తగ్గుతాయని ఇంటెలిజెన్స్ వర్గాల భావన. అందుకోసం మూడు రాష్ట్రాల సాయుధబలగాలు అబూజ్‌మడ్‌ను దిగ్బంధించే పనిలో ఉన్నాయి. ఇక్కడి భౌగోళిక పరిస్థితులు ఈ ప్రాంతాన్ని మావోయిస్టులకు పెట్టని కోటలా చేశాయి. దీంతో అనువైన సమయం కోసం బలగాలు కాచుకోని ఉన్నాయి, భద్రత బలగాలకు అత్యాధునిక ఆయుధాలను ఆయా ప్రభుత్వాలు అందజేశాయి. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ప్రభుత్వంపై యుద్ధం చేస్తోన్న మావోయిస్టుల ఏరివేతకు బలగాలు సన్నద్ధమవుతున్నాయి. మావోయిస్టులపై దాడి చేయాలంటే రెడ్ కారిడార్‌లోని గిరిజనుల సహకారం భద్రత బలగాలకు అవసరం. కానీ సాయుధ బలగాలకు గిరిజనుల సహకారం లభించడం అసాధ్యమనే చెప్పాలి.

వరంగల్ నిట్‌లో విద్యార్థుల ఘర్షణ

వరంగల్, మార్చి 12 (మనం న్యూస్): వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో వసంతోత్సవం ముగింపు వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వేడుకలు జరుగుతున్న సమయంలో విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇది కాస్తా గొడవకు దారి తీసింది. దీంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. కత్తులతో పొడుకున్నారు. దీంతో ఒక విద్యార్థి కత్తిపోట్లకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిట్‌లో భారీగా పోలీసులను మోహరించారు. దీంతో నిట్‌లో డీజే ప్రోగ్రాంను అధికారులు అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ గొడవలో జయప్రీత్‌సింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలకు సంబంధించి ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

ఇంటర్ విద్యార్థి దారుణ హత్య

- **వేట కొడవళ్లతో వెంటాడి చంపిన దుండగులు**
- **కూకట్‌పల్లిలో పట్టపగలే దారుణం**



హైదరాబాద్/కూకట్‌పల్లి, మార్చి 12 (మనం న్యూస్): పాతకక్షలతో ఇంటర్ విద్యార్థిని దారుణంగా హత్య చేశారు. వేటకొడవల్లతో వెంటాడి అతి కిరాతకంగా హతమార్చారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన హైదరాబాద్ కూకట్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఏసీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కూకట్‌పల్లి మూసాపేట్‌లో నివసిస్తూ పాల వ్యాపారం చేసే ఎలగలరాజు, రాణిల నాలుగోల కుమారుడు సుధీర్ కూకట్‌పల్లి ప్రతిభ కళాశాలలో ఇంటర్ సిఈసి ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం కూకట్‌పల్లి శ్రీచైతన్య కళాశాలలో పరీక్ష వ్రాయడానికి స్నేహితులు మేఘనాథ్, సాయిలతో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటి నుండి పరీక్ష కేంద్రానికి వెళ్తుండగా సాగర్ హోటల్ సమీపంలో సుధీర్‌ను హతమార్చడానికి పన్నాగం పన్నిన నలుగురు యువకులు సుధీర్‌పై దాడికి పాల్పడ్డారు. తప్పించుకునే ప్రయత్నంలో సుధీర్ ద్విచక్రవాహనాన్ని వదిలి ఓ ప్రైవేట్ పాఠశాల వాహనం ఎక్కే ప్రయత్నం చేయగా దుండగులు తెచ్చుకున్న వేట కొడవళ్లతో వెంటబడి సుధీర్ తలపై, చేతులపై కత్తులతో నరికి హత్యచేశారు. హతుని స్నేహితుడు సాయి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట్‌లో నివసించే నవీన్, కృష్ణ, మహేశ్, తేజలు హత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సభలో.. చమక్కులు..

లైన్ లైన్.. ముందు నేనొచ్చా

- **అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద నవ్వుల పూయించిన నేతలు**

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): ' అన్నా.. ఎంత సేపు మాట్లాడతారు', 'లైన్ లైన్.. ముందు నేనొచ్చా', 'అన్నా.. ఇంక చాలు రావే' అసెంబ్లీ మీడియాపాయింట్ సోమవారం పలువురు నేతలు అన్న మాటలవి. ఏదో సొంత పార్టీ నేతలతో ఇలా చనువుగా మాట్లాడారనుకుంటే పొరపాటే. అసెంబ్లీ హాల్‌లో ఒకరిపై ఒకరు ఘాటగా విమర్శలు చేసుకున్న అధికార, విపక్ష నేతలు సభ బయట తమ మాటలతో నవ్వులు పూయించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద టీడీపీ ఎమ్మెల్యేలు ఆర్.కృష్ణయ్య, సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతున్నారు. వాళ్ల తర్వాత మాట్లేందుకు క్యూలో ఉన్న సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఉన్నారు. రాజయ్య వెనక ఉన్న టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొండా సురేఖ 'అన్నా! మీరు ఎంతసేపు మాట్లాడుతారంటూ' పలకరించారు. 'మాది చిన్న పార్టీనే కదమ్మా తొందరగానే పూర్తిచేస్తా' అని రాజయ్య బదులిచ్చారు. అబ్బో మీ పార్టీ చిన్నదేగాని గంటలు గంటలు ఉపన్యాసాలు ఇస్తారంటూ సురేఖ అనడంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారిగా నవ్వారు. అటు వెనకాలే వస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనను సమీపించగానే 'లైన్ లైన్.. మీ కంటే ముందు నేనొచ్చాను' అంటూ సురేఖ అన్నారు. అలాగే ముందు మీరే మాట్లాడంటూ ఉత్తమ్ ఆమెకు బదులిచ్చారు. సున్నం రాజయ్య మాట్లాడుతుండగా.. 'అన్నా ఎంతసేపు.. ఇక చాలు రావే' అన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నప్పటికీ రాజయ్య తన ప్రసంగాన్ని కొనసాగించారు. అనంతరం రాజయ్యను కలిసిన ఉత్తమ్ తమ రాజ్యసభ అభ్యర్థికి మద్దతివ్వాలని కోరారు. పార్టీ నిర్ణయం మేరకు మద్దతిచ్చేదిలేనిది తెలుపుతామని రాజయ్య బదులిచ్చారు. తాము మద్దతు కోరుతున్నట్టు పార్టీ అధిష్టానానికి తన మాటగా చెప్పాలని రాజయ్యను ఉత్తమ్ కోరారు.

హరీశ్ అన్న డైరెక్షనే కదా ?

అసెంబ్లీ హాల్ నుంచి టీఆర్ఎస్ఎల్పీ వైపు వస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఎదురుపడ్డారు. 'మేడం చైర్మన్‌సాబ్ ఇప్పటిదాకా మంచిగనే ఉన్నడుగా, ఇలా ఇలా నడుస్తూ(చైర్మన్ స్వామిగౌడ్ నడకను అనుకరిస్తూ) నా ముందు నుంచే వెళ్లారు. ఇంతలో కన్నుకు ఎలా గాయమైంది మరి' అంటూ సునీతను సంపత్‌కుమార్ అడిగారు. అయితే ఎలా నడిచారో మళ్లీ ఒకసారి చూపించండని సునీత నవ్వుతూ బదులిచ్చారు. హరీశ్ అన్న(మంత్రి హరీశ్‌రావు) డైరెక్షన్‌లోనే చైర్మన్ ఇలా చేస్తున్నారుగా అంటూ సంపత్‌కుమార్ వ్యాఖ్యానించగా, అదేం లేదంటూ సునీత అక్కడి నుంచి నవ్వుతూ వెళ్లిపోయారు.


శాసన మండలి చైర్మన్‌ను పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

అరిగిపోయిన రికార్డులా గవర్నర్ ప్రసంగం


- **అన్నీ అవాస్తవాలే: బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి**
- **అబద్ధాలు వినలేకే వాకౌట్ చేశాం: లక్ష్మణ్**



హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి): అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగంపై బీజేపీ నేతలు విమర్శలు చేశారు. గవర్నర్ ప్రసంగిస్తుండగా పలువురు బీజేపీ నేతలు సభలో ఆందోళన చేశారు. అంతేకాక బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రాంచంద్రరెడ్డి నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం బీజేపీ నేత, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా అరిగిపోయినా రికార్డులా అదే ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌తో చెప్పించిందన్నారు. 50 మంది పోలీసుల భద్రత మధ్య గవర్నర్ ప్రసంగించాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందన్నారు. రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్యలు గవర్నర్ ప్రసంగంలో లేవన్నారు. సీఎం సచివాలయానికి ఎందుకు రారో చెప్పలేదన్నారు. గవర్నర్ ప్రసంగంలో మొదటి నుంచి చివరి వరకు పచ్చి అబద్ధాలు ఉన్నాయని, అన్నిరంగాల్లో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని కిషన్‌రెడ్డి అన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ అవాస్తవాలు చెబుతున్న గవర్నర్ ప్రసంగాన్ని వినలేక, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే వాకౌట్ చేశామని వివరించారు. టీఆర్ఎస్ ఎన్ని గిమ్మిక్కులు చేసిన లాభం లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అవాస్తవ గణాంకలతో గవర్నర్‌తో ప్రసంగం చదివించిందని, ఎమ్మెల్సీ రాంచంద్రరావు మాట్లాడుతూ ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమే అన్నారు.

ప్రభుత్వం ఆడుతున్న నాటకం

- **సభలో ప్రతిపక్షం లేకుండా చేయాలని కుట్ర**
- **ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి**



హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): బడ్జెట్ సమావేశాలకు అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం నిరాశ, అసహనానికి గురిచేసే విధంగా ఉందని విమర్శించారు. గవర్నర్ ప్రసంగంలో ప్రాధాన్యత అంశాలైన ప్రజా సమస్యలను పక్కన పెట్టారన్నారు. సభలో ప్రతిపక్ష సభ్యులు లేకుండా చేయాలని కుట్రలో భాగంగానే ముందస్తుగా పెద్ద ఎత్తున మార్షల్స్‌ను ప్రభుత్వం మోహరించిందన్నారు. టీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలోనే కుట్రకు ప్రణాళికలు వేశారన్నారు. సభలో ఉద్రిక్తతకు సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలన్నా టరు. ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో నిరసనలు తెలపడం తప్పా అని వారు ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగం తర్వాత స్పీకర్, సీఎంతో పాటు మండలి చైర్మన్ హుందాగా వెళ్లారన్నారు. కానీ చైర్మన్‌కు ఏదో జరిగిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నాటకం ఆడుతున్నారన్నారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్ అంటే తమకు గౌరవం ఉందన్నారు. సీఎం అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటలకే విశ్వసనీయత లేని దుస్థితి ఏర్పడిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర విషయమై కేంద్రానిదే బాధ్యత అంటూ కేసీఆర్ పేర్కొనడం విచారకరమన్నారు. కేంద్రం గిట్టుబాటు ధర ఇవ్వకపోతే రాష్ట్రాలు బోనస్ ఇస్తుంటాయని టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విషయాన్ని విస్మరించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులు, సబ్‌ప్లాన్ అమలుపై అసెంబ్లీలో కేసీఆర్ ఇచ్చిన మాటలకే దిక్కులేకుండా పోయిందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్ల విషయంలో కేంద్రంతో పనిలేకుండా రాష్ట్రమే అమలు చేసే అవకాశమున్నా కుంటి సాకులు చెబుతూ గిరిజనులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని వారు హెచ్చరించారు.





గన్‌పార్కు వద్ద నివాళులు అర్పిస్తున్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు... పాదయాత్రగా అసెంబ్లీకి వస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు



ఎన్టీఆర్ ఘాట్ వద్ద టీడీపీ ఎమ్మెల్యేల నివాళులు



అసెంబ్లీకి బైక్‌పై వస్తున్న సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య



కాంగ్రెస్ నాయకుల దాడి

అమానుషం

- **టీఆర్ఎస్ ఎమ్మెల్యేల ధ్వజం**

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటూ కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ, జీవన్‌రెడ్డి, ఒడితెల సతీశ్ ఖండించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కొండా సురేఖ మాట్లాడారు. మొగుడ్ని కొట్టి మొర్రో మొర్రో అని మొత్తుకున్నట్టుగా కాంగ్రెస్ నాయకుల తీరు ఉందని అన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అసత్యాల పుట్ట అనడం బాధాకరమన్నారు. సభ నుంచి సస్పెండ్ కావడం కోసం కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డారని సురేఖ అన్నారు. మండలి చైర్మన్ కంటికి గాయమయ్యిందని, ఈ రోజును బ్లాక్ డేగా గుర్తించాలన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, షబ్బీర్ అలీ వంటి నేతలు దగ్గరుండి దాడి చేయించడం బాధాకరమన్నారు. గతంలో కూడా సభల్లో నిరసనలు జరిగాయని, అయితే కాంగ్రెస్ నాయకులు మైక్‌లతో దాడి చేయడం దురదృష్టకరమన్నారు. దాడి చేసిన వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒడితెల సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల దాడి ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా ఉందన్నారు.

చట్టసభను అవమానించారు: పల్లా

అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు మద్యం తాగి అసెంబ్లీకి రావడం దురదృష్టకరమన్నారు. గవర్నర్‌ను గాయపరిచే దురుద్దేశంతోనే మైక్ విసిరారన్నారు. అసహనంతోనే కాంగ్రెస్ నేతలు ఇలా ప్రవర్తించారన్నారు. మండలి చైర్మన్‌ను గాయపరిచిన వారిని సస్పెండ్ చేయాలన్నారు. కాంగ్రెస్ నేతల దాడిని ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ దాడిని బలహీనవర్గాలపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీది దుర్మార్గపు రాజకీయమని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. చైర్మన్‌పై దాడిని ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ ప్రసంగంలో హామీల అమలు గురించి లేదనడం కాంగ్రెస్ పార్టీకి సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ టీఆర్ఎస్ పార్టీది కాదని, తెలంగాణ రాష్ట్రానిదన్నారు. కాంగ్రెస్ తీరు అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందన్నారు.



రుజువు చేస్తే రాజీనామా

- **క్షమాపణ కూడా చెబుతా**
- **స్వామిగౌడ్‌కు గాయం కాలేదు**
- **మార్షల్స్ మమ్మల్ని తోసివేశారు**
- **నా కాలికి తీవ్ర గాయమైంది**
- **సర్కారుకు పోయే కాలమొచ్చింది**
- **మండిపడ్డ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



మీడియాకు తన కాలికి గాయాన్ని చూపుతున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి): సభలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై ప్రభుత్వం కుట్ర పూర్వకంగా మార్షల్స్‌ను ఉసిగొల్పారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం చిత్తు కాగితంలా ఉందని పేర్కొంటూ నిరసన తెలుపుతున్న తమను మార్షల్స్ అడ్డుకోవటం అన్యాయ మన్నారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు గాయమైందని రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేయటంతో పాటు క్షమాపణ చెప్తానని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. గాయమై నట్టుగా సీసీ పుటేజీ చూపించా లని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం సమయం లో కాగితాలు విసరటం వంటివి సాధారణ విషయమన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో టీఆర్ఎస్‌కు చెందిన హారీశ్‌రావు ఇదే గవర్నర్‌పై దాడికి యత్నించిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు విస్మరించారన్నారు. స్పీకర్‌పై పుస్తకాలను విసిరిన విషయాన్ని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మర్చిపోతున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో రైతుల ఆత్మహత్యలు, గిట్టుబాటు ధర లేని విషయంలో నిరసన తెలుపుతున్న తమను అమానుషంగా మార్షల్స్ తోసి వేశారని తెలిపారు. దీంతో తన కాలికి తీవ్ర గాయమైందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి చేతికి గాయం అయ్యేలా మార్షల్స్ వ్యవహరించారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి పోయే కాలమొచ్చిందన్నారు. సెంబ్లీలో కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని రోపించారు. వచ్చే ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం టీఆర్ఎస్‌కు ఓట్లు వేయదని, చివరకు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి టీఆర్ఎస్‌కు ఓటు వేయరన్నారు. కాగా, గవర్నర్ ప్రసంగం ఊహాజనితంగా ఉందని మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గవర్నర్ ప్రసంగం ఆసాంతం ఆశలపల్లకిగా మారిందన్నారు. తాగు, సాగు నీరు విషయాన్ని విస్మరించారన్నారు. విద్య, వైద్య విషయంలో జరుగుతున్న దోపిడీపై ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. రాజకీయ హత్యలను ప్రభుత్వమే చేయిస్తుండటం విచారకర మన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తోందని అన్నారు.

ఒక్క కుటుంబమే బంగారు మయం: డీకే అరుణ

పోరాడి సాధించుకున్న తెలంగాణ నాలుగేండ్లలో అభివృద్ధి చెందింది పెద్దగా ఏమీలేదని, ఒక కుటుంబం మాత్రం బంగారు మయంగా మారిందంటూ కేసీఆర్ కుటుంబంపై పరోక్షంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణ ఆరోపించారు. అభివృద్ధి అంతా కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. అబద్ధాల ప్రసంగంతో టీఆర్ఎస్ ప్రభుత్వం దిగజారుడుతనానికి పాల్పడిందన్నారు. టీఆర్ఎస్ ప్రతిపక్షంగా ఉన్న సమయంలో గవర్నర్ ప్రసంగం సమయంలో, అసెంబ్లీ సమావేశాల్లో వ్యవహరించిన తీరును మర్చిపోవటం విచారకరమన్నారు.

మీడియా పాయింట్

స్వామిగౌడ్‌పై కాదు.. బీసీలపై దాడి

- **క్షమాపణ చెప్పకపోతే ఊరుకోం**
- **కాంగ్రెస్‌కు బీసీ ఎమ్మెల్యేల హెచ్చరిక**



హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు గూండాల్లాగా వ్యవహరించారని ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై మైక్ విసిరి దాడి చేయడాన్ని యావత్ బీసీలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్వామిగౌడ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చైర్మన్‌పై దాడి చేసిన వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డికి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్ని జిల్లాల్లో బీసీలను సంఘటితం చేసి ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీలు మండలి చైర్మన్‌గా, అసెంబ్లీ స్పీకర్‌గా ఉండడం చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఇటువంటి దాడులకు పాల్పడుతోందని గంగుల కమలాకర్ దుయ్యబట్టారు. దేశంలో ఇలాంటి దాడులకు పాల్పడాలని ఎవరైనా భావించినా.. వారు భయపడేలా కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

బీసీలను బిచ్చగాళ్లను చేశారు: ఆర్ కృష్ణయ్య

- **వర్గీకరణపై స్పష్టతేది?: సండ్ర**



హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం బీసీలను బిచ్చగాళ్లను చేసిందని, బీసీల అభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాల గురించి గవర్నర్ ప్రసంగంలో పేర్కొనకపోవడం దారుణమని బీసీ సంఘం నేత, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, వాటి భర్తీపై గవర్నర్ ప్రసంగంలో పొందుపర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరుగుతుంటే.. శాంతిభద్రతల సమస్యే లేదని గవర్నర్ ప్రసంగంలో పేర్కొనడం సరికాదన్నారు. గవర్నర్‌కు భద్రత సక్రమంగా ఉంటే రాష్ట్రమంతా అలానే ఉందని భ్రమపడుతున్నారన్నారు. రైతులకు భరోసా కల్పించే విధంగా గవర్నర్ ప్రసంగం లేదని మరో టీటీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. టీఆర్ఎస్ పార్టీ రాసిచ్చింది చదవడం తప్ప వాస్తవ పరిస్థితులు ఈ ప్రసంగంలో ప్రతిబింబించలేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ వైఖరిని ప్రసంగంలో పొందుపర్చకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు.

వాస్తవ విరుద్ధం

- **సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య**



హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): గవర్నర్ ప్రసంగం మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా ఉందని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం, పరిశ్రమలు ముఖ్యమైన అంశాలని, ప్రసంగంలో వాటి ప్రస్తావనే లేకపోవడం సరికాదన్నారు. గ్రామీణ, పేద ప్రజల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ప్రసంగంలో ఏమీ లేదన్నారు. గిరిజనులకు, కౌలు రైతులకు పెట్టుబడి పథకాన్ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు సాయం, గిట్టుబాటు ధర కోసం స్వామినాథన్ కమిషన్ సిఫారసులు, తదితర అంశాలపై స్పష్టతనివ్వలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వ తీరుతో బాధపడుతున్నారని చెప్పారు. మొత్తంగా గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు పూర్తి విరుద్ధంగా ఉందని అన్నారు.

కాంగ్రెస్ గుండాయిజం సహించం


- **మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి): అసెంబ్లీలో కాంగ్రెస్ నేతల గుండాయిజాన్ని సహించేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టసభలపై ఏమాత్రం గౌరవం లేకుండా దౌర్జన్యంగా వ్యవహరిస్తున్న తీరుపట్ల కాంగ్రెస్ నాయకులు సిగ్గుపడాలని తలసాని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తలసాని.. గవర్నర్ నరసింహన్, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌లపై కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దాడి చేయడం చాలా దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యంపై నమ్మకముంటే మరోసారి ఇలాంటి చిల్లర వ్యవహారాలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ నేతలు గుండాయిజం మానకపోతే, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కోమటిరెడ్డిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఓ వైపు కేసీఆర్ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల నేతలకు చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తూ, కులవృత్తులు అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటుంటే, మరోవైపు కాంగ్రెస్ నాయకులు బడుగుబలహీన వర్గాలపై అక్కసు వెల్లగక్కుతున్నారని ఆయన పేర్కొన్నారు.

బీసీల జోలికొస్తే పాతరేస్తాం

- **మంత్రి జోగురామన్న వార్నింగ్**



హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి జరిగిన నేపథ్యంలో మంత్రి జోగురామన్న కాంగ్రెస్ నేతలను తీవ్రంగా హెచ్చరించారు. మరోసారి బీసీ వర్గాల జోలికి వస్తే కాంగ్రెస్ నేతలను ప్రజాక్షేత్రంలో పాతరేస్తామని మంత్రి జోగురామన్న హెచ్చరించారు. స్వామిగౌడ్‌పై జరిగిన హత్యాయత్నాన్ని ఖండిస్తున్నానని ఆయన చెప్పారు. నిరసన తెలియజేయడానికి కారణమేంటని ఆయన ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో శాసనమండలి చైర్మన్‌గా, శాసనసభ స్పీకర్‌గా బీసీ బిడ్డలు ఉండటాన్ని జీర్ణించుకోలేకే కాంగ్రెస్ ఈ విధంగా చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి బీసీ వర్గాలపై చిన్నచూపు ఉందని, సభలో కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరు పట్ల బీసీ ప్రజలు బాధపడుతున్నారని ఆయన అన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఇద్దరు బీసీ వ్యక్తులను రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేయడమే కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధనా అని ఆయన ప్రశ్నించారు. బీసీ వర్గాల ప్రజల మనసులను గాయపరచడమే కోమటిరెడ్డి ఉద్దేశమా అని జోగురామన్న నిలదీశారు. కేసీఆర్ నాయకత్వంలోనే బీసీలకు స్వాతంత్ర్యం వచ్చిందని ఆయన చెప్పారు. పదవులను అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి ఆరోపించారు. జేఏసీ చైర్మన్‌గా స్వామిగౌడ్ ఉన్న సమయంలోనూ కాంగ్రెస్ నేతలు ఒకసారి హత్యాయత్నానికి ప్రయత్నించారని, ఇప్పుడు మరోసారి ఆయనపై అదే విధంగా దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన అన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అర్థంపర్థం లేకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. బీసీల ఉన్నతిని ఓర్వలేకనే కాంగ్రెస్ ఇలాంటి చర్యకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రౌడీ, గూండాల పార్టీ అని, గూండాయిజం సంస్కృతి కాంగ్రెస్ పార్టీలోనే ఉందని మంత్రి జోగురామన్న తీవ్రంగా విమర్శించారు.

గవర్నర్ ప్రసంగం అబద్ధాలమయం

- **టీఆర్ఎస్‌కు ఇదే చివరి బడ్జెట్**
- **60 ఏండ్లలో రూ.69 వేల కోట్లు అప్పు**
- **నాలుగేండ్లలో రూ.40వేల కోట్ల అప్పు**
- **ఇదేనా మీ పాలన : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



మీడియా పాయింట్‌లో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం అబద్ధాల మయంగా ఉందని విమర్శించారు. ఆ ప్రసంగం చిత్తు కాగితంతో సమానంగా మారిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ప్రాధాన్యతాంశాలను పక్కన పెట్టి, అసత్యాలతో కూడిన ప్రసంగాన్ని గవర్నర్‌చే చదివించిందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య, ముస్లిం, గిరిజన రిజర్వేషన్లు, రైతుల ఆత్మహత్యలు, గిట్టుబాటు ధర వంటి అంశాలు గవర్నర్ ప్రసంగంలో లేవన్నారు. 35 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశారన్నారు. కనీసం 35 మందికి బ్యాంకుల నుంచి పాస్‌బుక్‌లు రాలేదన్నారు. నాలుగేండ్ల కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రాష్ట్రంలో గణనీయంగా తగ్గిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు105 లక్షల టన్నుల ఉత్పత్తి ఉందని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వరుసగా 75లక్షల టన్నులు, 49 లక్షల టన్నులు, 101 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారని ఆరోపించారు. 60 ఏండ్లలో రూ.69వేల కోట్లు అప్పులుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేండ్లలో రూ.40వేల కోట్ల అప్పు చేసిందన్నారు. భవిష్యత్తు తరాలపై ఆర్థిక భారం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చంపేసి అంబేద్కర్ పేరును ప్రభుత్వం తొలగించినా గవర్నర్ స్పందించకపోవటం విచారకరమన్నారు. కొత్తగా విద్యుత్ ప్రాజెక్టులు లేవని, కాంగ్రెస్ హయంలో ఏర్పాటు చేసిన వాటికే ప్రారంభోత్సవాలు చేస్తూ , తాము చేసినట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. విద్యార్థులు, యువత పోరాటాలతోనే అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఉద్యోగాల కల్పనతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుల ఆత్మహత్యలు టీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టవన్నారు. మొదటి రెండు గవర్నర్ ప్రసంగాల్లో ఐటీఐఆర్ ద్వారా రూ. 2.50 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నామని, 50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులు కాలరాసే విధంగా గవర్నర్ సమక్షంలోనే ప్రభుత్వం వ్యవహరించడం విచారకరమన్నారు. పార్లమెంటు సాక్షిగా పోడియం వద్ద నిరసన తెలిపే హక్కున్నా, తెలంగాణ అసెంబ్లీలో మాత్రం నిరంకుశత్వం తాండవిస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపకుండా ముందస్తుగా వేసుకున్న ప్రణాళికలో భాగంగానే ప్రభుత్వం కాంగ్రెస్ సభ్యులపై దాడి చేసేలా వ్యవహరించిందని ఆరోపించారు. మార్షల్స్ తీరుతో తమపార్టీ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాలికి తీవ్ర గాయమైందని, మరికొందరు సభ్యులకు కాలికి, చేతి వేళ్లకు గాయాలయ్యాయని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

స్వామిగౌడ్‌పై దాడి హేయం

- ఈ సంస్కృతి మంచిది కాదు
- దాడిపై స్పీకర్ తీవ్ర అసంతృప్తి
- శాశ్వతంగా సస్పెండ్ చేయాలి
- ఎంఐఎం అక్బరుద్దీన్ డిమాండ్
- ఈ నెల 27 వరకు సభ నిర్వహణ

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై స్పీకర్ మధుసూదనచారి అధ్యక్షతన సోమవారం బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభలో స్వామిగౌడ్‌పై జరిగిన దాడిపై స్పీకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో సభ్యులు సంయమనం పాటించాల్సింది పోయి ఇలా ప్రవర్తించడం హేయమని స్పీకర్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌తో పాటు పలువురు నేతలు ఈ దాడిని ఖండించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే జానారెడ్డి మాట్లాడుతూ.. ఈ పరిణామం విచారకరమని చెప్పారు. భట్టి విక్రమార్క మాత్రం దీనిని దాడిగా పరిగణించకూడదని.. నిరసన కింద చూడాలని వ్యాఖ్యానించారు. గవర్నర్‌పై దాడి చేయడానికి ప్రయత్నించడం విచారకరమని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చెప్పారు. దాడికి పాల్పడిన వ్యక్తులను శాశ్వతంగా సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దాడిని మంత్రి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్ నేతలు గూండాల్లా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రశ్నించడం చేతకాక ఇలా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వంపై మాటల రూపంలో దాడులు చేయాలని హరీష్ సూచించారు. అప్పట్లో తాము రాష్ట్రం కోసం చేసిన ఆందోళన వేరని, ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు చేస్తుంది వేరని ఆయన చెప్పారు. తమది భగత్‌సింగ్ చేసిన పోరాటం వంటిదని, కాంగ్రెస్ సభ్యులది ఉగ్రవాదులు చేసే పోరాటం లాంటిదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇదిలా ఉంటే, బీఏసీ సమావేశంలో స్పీకర్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాసనసభ సమావేశాలను ఈ నెల 27 వరకూ నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మార్చి 15న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నెల 25వ తేదీన(ఆదివారం) కూడా సభను నిర్వహించాలని బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16,17,18,26 తేదీలు మినహా ఈ నెల 27వరకూ అన్ని పనిదినాల్లో సమావేశాలు జరుగుతాయని స్పీకర్ మధుసూదనాచారి స్పష్టం చేశారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, మార్చి 13

'మహా' ముట్టడి!

మహారాష్ట్రలో రైతుల మహా ధర్నా విజయవంతమైంది. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం మహారాష్ట్ర అసెంబ్లీని సోమవారం ముట్టడి చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సారథ్యంలో భారీ నిరసన ర్యాలీ ఐదు రోజుల క్రితం నాసిక్ నుంచి ముంబయి దాకా జరిగింది. వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, అటవీ భూములను గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు బదిలీ చేయాలని, గిట్టుబాటు ధరల కల్పన, కరెంట్ బిల్లు మాఫీ, రైతులకు నష్ట పరిహారం పెంచాలని, స్వామినాథన్ సిఫారసుల అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లపై దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన ఈ ధర్నాలో సుమారు 40 వేలమంది రైతులు తమ నిరసనను వ్యక్తం చేశారు. మార్చి 6న నాసిక్‌లో ప్రారంభమైన ఈ మహా రైతు పాదయాత్ర 180 కిలోమీటర్ల దూరంలోని అజాద్ మైదానానికి చేరుకుంది. ఈ రైతు నిరసన మహారాష్ట్ర రైతులకు పరిమితమైనది కాదు, దేశవ్యాప్తంగా రైతు దుస్థితికి, అసంతృప్తికి, ఆగ్రహానికి అద్దం పడుతుంది. రైతుల ఈ ధర్మాగ్రహ ప్రదర్శనకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రధానమైన డిమాండ్లన్నిటినీ అంగీకరించక తప్పలేదు. ఎన్నికల సీజన్ కావడంతో రైతులపై అణచివేత చర్యలకు పాల్పడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేసింది. దానికి తోడు ప్రభుత్వ భాగస్వామ్య పక్షం శివసేన నేత ఏకనాథ్ షిండే, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, రాజ్‌థాకరే నేతృత్వంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేనలు కూడా రైతు ముట్టడికి మద్దతు ఇవ్వడంతో ఆ ఉద్యమానికి మరింత బలం చేకూరింది. 12 మంది రైతు నాయకులతో ఏర్పడిన కమిటీకి, మంత్రివర్గ కమిటీకి రైతాంగ సమస్యల పరిష్కారంపై చర్చలు సానుకూలంగా జరగడంతో మహారాష్ట్ర అసెంబ్లీ ముట్టడి ఉపద్రవం తప్పినట్టు ప్రభుత్వవర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి.

పంటలకు గిట్టుబాటు ధరల కోసం రైతాంగం నిరసన ప్రదర్శనలు చేయడం నేడు ప్రత్యేక లక్షణంగా మారింది. అక్టోబర్, నవంబర్ మాసా లలో పప్పు దినుసులు, నూనె గింజల మార్కెట్ ధర పడిపోవడంతో మధ్య, పశ్చిమ రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర అసంతృప్తి కట్టలు తెంచుకుంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వగైరా ఆర్థిక చర్యల కారణంగా వ్యాపారులు తగినంత పంటను నిల్వ చేసుకోక పోవడం వంటి ఇతరత్రా కారణాలు, ప్రపంచ మార్కెట్లో సోయా, మొక్కజొన్న ధర తగ్గడం వగైరా మిశ్రమ కారణాల వల్ల వాటి మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువకు దిగజారడంతో లాటర్, కల్బురగి రైతాంగం రోడ్లపై నిరసన ప్రదర్శనలకు దిగారు. పంటకు గిట్టుబాటు ధర అడిగినందుకు మధ్యప్రదేశ్‌లోని మందసోర్ రైతులపై కాల్పులు జరగడంతో ప్రాణాలు పోగొట్టుకున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు కూతవేటు దూరంలో నిందార్‌లో గృహ నిర్మాణ ప్రాజెక్టుకోసం ప్రభుత్వం చేసిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, గాంధీ జయంతి రోజున రైతులు ప్రారంభించిన 'భూ సమాధి సత్యాగ్రహం' దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. తమిళనాడు ఉభయ రాష్ట్రాలే కాదు, ఉత్తర భారతంలోనూ ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ రైతులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

భూతాపం పెరుగుతుండడంతో భూగోళంపై అనూహ్య రీతిలో ఆకస్మిక వాతావరణ మార్పులు సంభవిస్తుండడం రుతుపవనాలు దారితప్పడంతో దేశంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏకకాలంలో నెలకొని పంట నష్టాలు సంభవిస్తున్నాయి. వరుస పంట నష్టాలనైనా భరించగలిగిన రైతాంగం అంతకంటే ముఖ్యంగా పెరుగుతున్న ఉత్పాదక ఖర్చుల దెబ్బకు విలవిల్లాడుతూ, గిట్టుబాటు ధరలేక అప్పుల విషవలయంలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం భరించలేని స్థాయికి చేరుకుంది. ఉత్పాదక ఖర్చులు, పంటల ధరలు రైతాంగానికి వ్యతిరేకంగానూ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయి. 'హరిత విప్లవం' ప్రయోగం ప్రారంభంలో దేశంలో తిండి గింజలు కొరత తీర్చినప్పటికీ, ఆ తర్వాత క్రమంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు వంటి ఖర్చులు పెరిగిపోయి, గిట్టుబాటు ధరలు లేకపోవడమే కాకుండా, భూసారం దెబ్బతిని వ్యవసాయ దిగుబడులు గణనీయంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయరంగ సంక్షోభానికి పరిష్కారంగా రెండవ హరిత విప్లవం తీసుకురావాలని పాలకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విధానంతో దేశం పునరుద్ధరించడానికి వీలులేని ఆర్థిక, పర్యావరణ, సామాజిక సంక్షోభాల్లోకి కూరుకుపోయే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు.

సంక్షోభంలోకి కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని పునర్జీవింపచేయడానికి బదులుగా, ఆ రంగంపై ఆధారపడుతున్న ప్రజలను ఇతర రంగాలలో అనుబంధ, నైపుణ్యరహిత కార్మికులుగా మళ్లే విధంగా ప్రభుత్వాలు వలసలను ప్రోత్సహిస్తున్నాయి. పేదరిక నిర్మూలనంటే పేదలను నిర్మూలించినట్లుగా, వ్యవసాయ రంగ పరిష్కారానికి వ్యవసాయదారుల జనాభాను పారిశ్రామిక రంగ అనుబంధ నైపుణ్యరహిత చౌక శ్రమశక్తిగా మార్చే ప్రభుత్వ విధానాల వల్ల రైతాంగ ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయి. అందులో భాగంగా వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పేరు మీద వ్యవసాయోగ్యమైన భూమిని ప్రభుత్వం కారుచౌకగా సేకరించి పారిశ్రామిక వర్గాలకు ధారాదత్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో పంట భూములను బలవంతంగా తీసుకోవద్దని రైతాంగం ఈ ధర్నా సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు. రుణాలను అందించడం, గిట్టుబాటు ధరల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన ప్రణాళికల్ని అమలులోకి తీసుకురావాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా వ్యవసాయ మౌలిక సదుపాయాలు, ఉత్పాదకాల కోసం ప్రణాళికాబద్ధంగా తగు పరిమాణంలో ప్రభుత్వం మదుపులు పెట్టకపోతే... మద్దతు ధరలు, ధర పరిహార చెల్లింపులు, రుణ పరిమాణాన్ని పెంచడం వంటి చర్యలు రైతు కన్నీటిని తుడవలేవు. నర్మదా నదీ పరివాహ ప్రాంతం, తూర్పు, పడమటి కనుమల ప్రాంతాల్లో మరాఠీ, కన్నడ, తెలుగు భాషలు మాట్లాడే డెక్కన్ ప్రాంత రైతాంగం 1875-77 మధ్యకాలంలో 'దక్కన్ ఉపద్రవం' పేరుతో బ్రిటీష్ వ్యాపారస్తులు, వారి అండదండలతో దారుణాలకు ఒడిగట్టిన స్థానిక వడ్డీవ్యాపారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల వ్యవసాయ, పారిశ్రామిక విధానాల కారణంగా దక్కన్ ప్రాంతంలో అలనాటి ఆత్మహనన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దడంలో ప్రభుత్వాలు విఫలమైతే మరో 'దక్కన్ ఉపద్రవాన్ని' పాలకులు ఎదుర్కొనడం ఖాయం.

లవ్ అండ్ డైవర్స్!



వాళ్ళది
లవ్ మ్యారేజ్
అరేంజ్డ్ డైవర్స్!

మన కోసం విడిపోయినా
వాళ్ళ కోసం కలిసే ఉంటారట!

చాతుర్యమంటే వాళ్ళదే
కలసున్నా విడిపోయినా వాళ్ళకే లబ్ధి!


ఇరువురు విడాకు పత్రాలు మార్చుకుంటున్నా
కలసున్న కాలం మధుర స్మృతుల నెమరు వేతనే!

ప్రయోజనాలు ఒకనాటికి తీరేవా
పెన వేసుకున్న బంధాలు ఒక పట్టున తెగేవా?!

ఎత్తుగడలతో మొదలైన 'పొత్తు'నాటకం
గొప్ప టెంపోతో కొనసాగుతూ
మరో సస్పెన్స్‌కు తెర తీసింది!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి

కవిత



మంచిమాట



'శత్రువులను ఎల్లప్పడూ క్షమించు. వారిపై కోపాన్ని చూపించకు'

- ఆస్కార్ వైల్డ్

పట్టణ సంస్కరణలకు పెద్దపీట



సమీర్ శర్మ, ఐ.ఎ.ఎస్

సమాలోచన

భూమికి టైటిల్ పెట్టడమనేది పట్టణ ప్రాంతా లలో మరో ఆందోళనకర అంశం. 2001లో మెకిన్సే అధ్యయన నివేదిక ప్రకారం, దేశంలో ఒక అంచనా ప్రకారం 90 శాతానికి పైగా భూములకు సరైన పట్టాలు లేవు. భూమి యాజమాన్య హక్కులు ఎవరికి చెందుతాయో తెలియదు. సరైన పట్టాలు లేకపోవడం వల్ల జీడీపీలో 1.3 శాతం మేరకు నష్టం వాటిల్లుతోంది.

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మునిసిపల్ సంస్కరణల కోసం ఓ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. అటల్ పునరుజ్జీవన, పట్టణ పునర్నిర్మాణ కార్యక్రమం (అమృత్) కింద 2015-17 సంవత్సరాలలో 500 నగరాలలో కొన్ని మౌలిక సంస్కరణలను చేపట్టడం జరిగింది. ఉదాహరణకు 14 రాష్ట్రాలలోని 104 నగరాలలో 90 శాతానికి పైగా యూజర్ చార్జీలను వసూలు చేశాయి. 21 రాష్ట్రాలు మునిసిపల్ కేడర్‌లను ఏర్పాటు చేశాయి. 256 నగరాలు ఆన్‌లైన్ పౌర సేవలను అందజేయడం ప్రారంభించాయి. 21రాష్ట్రాలు రాష్ట్ర ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేశాయి. 363 నగరాలు క్రెడిట్ రేటింగ్‌ను పూర్తి చేశాయి. ఇక తదుపరి స్థాయికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. తదుపరి స్థాయి సంస్కరణలు మూడు అంచెలుగా కొనసాగుతాయి :


మొదటి అంచె :

దీని ప్రధానోద్దేశం, ప్రస్తుతం అమలులో ఉన్న కీలక ఆర్థిక, సేవా వితరణ సంస్కర ణలను వేగవంతం చేయడం. మొత్తం మూడు రకాల సంస్కరణలున్నాయి. 1) ఓ పురపాలక సంఘం పనితీరు గ్రాంటు కోరిన సంవత్సరానికి రెండేళ్ల ముందు నుంచి నగరం ఆడిట్ చేసిన అకౌంట్లను ఓ ఏడాదికి సమర్పించాల్సి ఉంటుంది. ఆడిట్ అకౌంటులో చూపించిన మాదిరిగానే నగరం తన సొంత రెవెన్యూలలో పెరుగుదలను చూపించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తమ సొంత రెవెన్యూ వ్యయాల నుంచి పట్టణ స్థానిక సంస్థలు 70 శాతానికి పైగా ఆదాయాన్ని చూపించాల్సి ఉంటుంది. నీటి సరఫరా, ఆదాయేతర నీటి వినియోగం తగ్గింపు, వ్యర్థాల శుద్ధి ప్రక్రియ వంటి వాటికి సంబంధించి నగరాలు అంచనాలు తయారు చేసి, వాటిని ముద్రించాల్సి ఉంటుంది. వీటిని ప్రతి ఏటా ముద్రించాల్సి ఉంటుంది. ఈ షరతులను గనుక నెరవేరిస్తే నగరాలకు పద్నాలుగవ ఆర్థిక సంఘం నుంచి పనితీరు గ్రాంట్ (5 ఏళ్లకు రూ. 18,000 కోట్లు) మంజూరవుతుంది.

రెండవ అంచె:

ఇందులో ఐదు పరివర్తన సంస్క రణలుంటాయి. 1) విలువను రాబట్టుకోగల ఆర్థిక విధానాన్ని రూపొందించి అమలు చేయడం 2) ప్రతి పట్టణ స్థానిక సంస్థా క్రెడిట్ రేటింగ్, ప్రతి నగరమూ పెట్టుబడి పెట్టగల స్తోమతను నిర్ధారించుకుని మునిసిపల్ బాండ్లను జారీ చేయడం 3)మునిసిపల్ కేడర్‌లను నియమించి వారిని వృత్తిపరంగా నిష్ణాతుల్ని చేయడం, వృత్తి నైపుణ్యం గల ఉద్యోగాలలో అటువంటి వారిని నియమించడం 4) ట్రస్ట్ అండ్ వెరిఫై మోడల్‌ను అమలు చేయడం 5) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయంతో భూమి పట్టాల చట్టాన్ని తయారు చేసి అమలు చేయడం.

గతంలో మునిసిపల్ అనుమతులు జారీ చేసే విధానాన్నే ఇప్పుడు వెరిఫై అండ్ ట్రస్ట్ విధానంగా మార్చారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడంలో నగరాలు మొదటగా అనుమతులు మంజూరు చేసి ఆ తర్వాత పరిశీలించి నిర్ధారించు కుంటాయి. ఈ పద్ధతినే ఇప్పుడు వెరిఫై అండ్ ట్రస్ట్ విధానమంటున్నారు. తనిఖీల వల్ల బాగా ఆలస్యాలు జరగడంతో పాటు, ఖర్చులు పెరగడం, అద్దెలు అడగడానికి అవకాశాలు పెరగడం జరుగుతోంది. అయితే ఈ వెరిఫై అండ్ ట్రస్ట్ విధానంలో మొదటే అనుమతి



మంజూరు చేసి ఆ తర్వాత నిర్ధారించుకుంటాయి. పౌరులు సాధారణంగా సరైన సమాచారమే ఇస్తారని, అందువల్ల వారి మీద నమ్మకం ఉంచి అనుమతులు మంజూరు చేయాలన్నదే ఇందులోని ఉద్దేశం. దరఖాస్తులను అవసర పత్రాలతో ఆన్‌లైన్‌లోనే సమర్పిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లోనే పరిశీలిస్తారు. అవి పూర్తిగా ఉంటే, వాటికి అనుమతి మంజూరు చేస్తారు.

భూమికి టైటిల్ పెట్టడమనేది పట్టణ ప్రాంతాలలో మరో ఆందోళనకర అంశం. 2001లో మెకిన్సే అధ్యయన నివేదిక ప్రకారం, దేశంలో ఒక అంచనా ప్రకారం 90 శాతానికి పైగా భూములకు సరైన పట్టాలు లేవు. భూమి యాజమాన్య హక్కులు ఎవరికి చెందుతాయో తెలియదు. సరైన పట్టాలు లేకపోవడం వల్ల జీడీపీలో 1.3 శాతం మేరకు నష్టం వాటిల్లుతోంది. భారతదేశంలో భూమి యాజమాన్య హక్కులు పట్టాల ద్వారా నిర్ధారణ అవుతుంటాయి. ప్రస్తుత యజమానికి ఫలానా భూమి రావడానికి గతంలో ఎంత యజమానుల నుంచి చేతులు మారాయన్నది రకరకాల అధికార పత్రాల ద్వారా తెలుసుకోవడం సాధ్యమవుతుంది. ఇందులో కొందరు వారసత్వం ద్వారా ఈ భూమికి యజమాని అయి ఉంటారు. కొందరు బదిలీ ద్వారా యజమాని అయి ఉంటారు. మరికొందరు తమ యాజమాన్యాన్ని ఇతరత్రా నిరూపించుకుని యజమాని అయి ఉంటారు. అందువల్ల, ఈ రకరకాల యజమానుల వివరాలను తీసి పక్కన పెట్టకుండా, అందరి హక్కులను పరిగణనలోకి తీసుకోవడానికి వీలుగా ఓ సమగ్ర చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న రాష్ట్ర పౌరులకు యాజమాన్య హక్కులు కల్పించడానికి, వారికి ధ్రువీకరణ పత్రం జారీ చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వం పట్టణ భూముల (పట్టాల ధ్రువీకరణ) బిల్లు (2016)ను ప్రవేశపెట్టింది. మిగిలిన రాష్ట్రాలు కూడా ఇటువంటి బిల్లును ప్రవేశపెట్టడానికి ఇది స్ఫూర్తిదాయకమైంది. కొత్త పట్టణ సంస్కరణలకు కూడా ఇదే బీజం వేసింది.

ఇక రాష్ట్రాలు, నగరాలు బ్లాక్‌చైన్ వంటి లీప్‌ఫ్రాగ్ టెక్నాలజీని వినియోగంలోకి తీసుకు రావడానికి ప్రోత్సహించడం జరిగింది. బ్లాక్‌చైన్ అంటే వివిధ లావాదేవీలకు (ఇక్కడ స్థిరాస్తులకు) డిజిటల్ లెడ్జర్‌ను రూపొందించడం. దీని వల్ల డిజిటల్ పరంగా సమాచారాన్ని పంపిణీ చేయడానికి ఆస్కారం కలుగుతుంది. అంటే పట్టాలకు, యాజమాన్య హక్కులకు, ఇతర లావాదేవీలకు సంబంధించిందన్న మాట. డేటాబేస్‌ను ఏ ఒక్క ప్రదేశంలోనో నిక్షిప్తం చేయకుండా వివిధ శాఖలన్నిటిలో ఈ సమాచారం నిక్షిప్తం అయ్యేటట్టు, దీనికి ఓ కేంద్ర బిందువు ఉండేటట్టు ఇందులో ఏర్పాటు చేస్తారు. ఆస్తికి సంబంధించి జరిగిన ప్రతి లావాదేవీనీ, ఆస్తికి సంబంధించిన ప్రతి కార్యకలాపాన్నీ ప్రతి శాఖ లెడ్జర్‌లోనూ భద్రపరుస్తారు. దీన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ కూడా చేస్తుంటారు. ఆ విధంగా సమాచార పంపకం జరుగుతుంది. ఈ ఆస్తికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రతి ఒక్కరూ చూడడానికి వీలవుతుంది. అయితే, వీటిని తారుమారు చేయడానికి ఎవరికీ అవకాశం ఉండదు. పైగా ప్రతి లావాదేవీకి సంబంధించిన సమయాన్నీ ఇందులో పొందుపరుస్తారు. అందువల్ల మోసం చేయడానికి అవకాశం ఉండదు. వీటికి నోటరీ వంటి సేవలను కూడా కలుపుతారు. నిజానికి ఇది కూడా ఒక విధంగా ఎంక్రబెన్స్ సర్టిఫికేట్ లాంటిదే. ఈ సర్టిఫికేట్‌ను రాష్ట్ర ప్రభుత్వాల రిజిస్ట్రేషన్ విభాగాలు జారీ చేస్తుంటాయన్న విషయం తెలిసిందే.

మూడవ అంచె :

మూడు స్తంభాల మీద అతి వేగంగా ఈ పరివర్తన సంస్కరణలను నిలబెట్టడం మీద దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అవి : పరిపాలన, ప్రణాళిక, ఆర్థికం. 1) వికేంద్రీకరణను మరింత విస్తృతం చేసి, పట్టణ స్థానిక సంస్థలను నిధుల మంజూరులోనూ, పనితీరులోనూ, విధి నిర్వహణలోనూ మరింత పటిష్ఠం చేయడమే వీటన్నిటి ప్రధానోద్దేశం. 2) స్వయం సమృద్ధికి, తన కాళ్ల మీద తాను నిలబడడానికి వీలుగా సొంత వనరులను సృష్టించడం, 3) పట్టణ ప్రణాళికలో మార్పులకు వెసులుబాటు కల్పించడం ముఖ్యంగా నగరాల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, సామాజిక ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా ప్రధాన ప్రణాళికలను సమన్వయ పరచడం జరుగుతోంది.

అంతేకాదు, కింది స్థాయి వరకు జవాబుదారీని పెంచడం కూడా దీని ముఖ్యోద్దేశం. అంటే పథకాల అమలులో, నిర్వహణలో స్థానిక వార్డు కమిటీలు జవాబుదారీతనంతో వ్యవహరించేటట్టు చేయడానికి యంత్రాంగం రూపొందుతుందన్న మాట. ఇక ఈ విషయంలో రాష్ట్రాలు, నగరాలు పోటీ పడుతుం టాయి. వాటి పురోగతిని బట్టి ప్రోత్సాహకాలు ఇవ్వ డం జరుగుతుంటుంది. ఏ నగరానికి ఆ నగరం, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సంస్కరణలు చేపట్టడానికి వెసులుబాటు కల్పించారు. అవి తమకు వీలైన విధంగా సంస్కరణలను రూపొందించుకోవచ్చు. ఎటువంటి సంస్కరణలు చేపట్టాలన్నది రాష్ట్రాలకే వదిలేయడం జరిగింది.

మొత్తం మీద, పట్టణ సంస్కరణలను ఏ విధంగా రూపొందించారంటే మొదటి అంచెలో పరిశీలనకు, నిర్ధారణకు అవకాశం కల్పించారు. మూడవ అంచెలో రాష్ట్రాలు, నగరాలు తమకు కావాల్సిన సంస్కరణలు తాము చేపట్టడానికి అవకాశం కల్పించారు. రెండవ అంచెలో రాష్ట్రాలు, నగరాలు తమ ప్రాధాన్యాలను, ప్రాధమ్యాలను పరివర్తనీయ సంస్కరణల వైపు మళ్లించడానికి అవకాశమిచ్చారు.

(రచయిత కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖలో అదనపు కార్యదర్శి)

మేరు దర్జీల మొర వినరా!

తెలంగాణ రాష్ట్రంలో పలు బీసీ కులాలవారు కులవృత్తులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కుమ్మరి, కమ్మరి, కంసాలి, మేదరి, వడ్రంగి, చాకలి, మంగలి, ఇలా ఎందరో తరతరాలుగా వస్తున్న కులవృత్తులతో జీవనం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో కార్పొరేట్ సంస్థలు కులవృత్తుల పనులను హస్తగతం చేసుకుంటుండడం వలన అనేక కులవృత్తులు కనుమరుగవుతున్నాయి. ఇదే కోవలో కుట్టు పనులు టైలరింగ్ వృత్తిగల దర్జీలు (మేరు)కులస్తులు చేసే స్త్రీ, పురుషుల, పిల్లల దుస్తుల కుట్టుపనులు కార్పొరేట్ సంస్థల రెడిమేడ్ దుస్తుల ఫ్యాక్టరీలు, ఫోరూంలు వెలవడంతో



దర్జీలకు చేతినిండా పని లేకుండా పోయింది. పిల్లల నుంచి సీనియర్‌సిటిజన్ల వరకు చవకగా దొరికే రెడిమేడ్ దుస్తులపై మక్కువచూపుతున్నారు. దీంతో కుట్టుపనుల అవకాశాలు మృగ్యమవ్వడంతో అనివార్యంగా బతుకుతెరువు కోసం అదే రెడిమేడ్ ఫ్యాక్టరీల్లో, రెడిమేడ్ వస్త్రాల దుకాణాల్లో రోజు కూలీలుగా మారుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు వలసబాట పడుతున్నారు. పట్టణాలకు నగరాలకు చేరుతున్నారు. పలువురు అరబ్ కంట్రీలకు వెళ్తూ కుటుంబాలకు సాయపడ్తూ జీవనం వెళ్ళదీస్తున్నారు.

ఇక ఎటూ పోలేక ఉన్న ఊరిలోనే ఉంటూ కుల వృత్తి చేసుకుంటున్న దర్జీమేరు కులస్తుల పాలిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద అన్ని వర్గాల వారికి టైలరింగ్ శిక్షణ ఉచితంగా ఇప్పించడం వంటి ఉపాధి శిక్షణా కార్యక్రమాలు శాపంగా మారాయి. దీంతో అన్ని వర్గాల వారు ఈ టైలరింగ్ వృత్తిలో ప్రవేశించి కుట్టు దుకాణాలు, ఇంటింటా కుట్టుమిషన్లు పెట్టుకొని కుట్టుపనులు చేసుకుంటుండడం వలని దర్జీలకు దర్జాగా బతికే పరిస్థితులు కరువైపోతున్నాయి.

2004లో అప్పటి బీసీ కమిషన్ జనాభా ప్రాతిపదికన వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ పెంచి అమలు చేయాలని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినా ఆచరించలేదు. మేరు (దర్జీ) వారిని వెనుకబడిన తరగతి బీసీ-డి గ్రూపులోనే ఉంచడంతో ఆర్థికంగా సామాజికంగా విద్యా ఉద్యోగాల పరంగా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నారు. వీరికి అవసరమైన నిధులు, ఆర్థిక సహాయాలు అందించడానికి మేరు సమాఖ్యను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో అరకొర బడ్జెట్ కేటాయింపులు చేసింది. దీంతో అవసరమైన ఆర్థిక సహాయం అందక వీరు ఇప్పటికి ఎదుగు బొదుగు లేకుండా ఉన్నారు.

తెలంగాణ ఏర్పడితేనన్న తమ బతుకులు బాగుపడతాయేమోనన్న తలంపుతో తెలంగాణ ఉద్యమంలో మేరు దర్జీ కులస్తులు కుట్టుమిషన్లతో ఊరేగింపులు నిరాహార దీక్షలు, అన్ని రకాల ఉద్యమాల్లో పాల్గొన్నారు. 109 మంది మేరు కులస్తులు ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసి అమరులయ్యారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 19 ఆగస్టు 2014న నిర్వహించిన చారిత్రాత్మక ఇంటింటి సర్వేలో తమ ఆర్థిక ఇబ్బందులను, సమస్యలను మేరు కులస్తులు వివరించారు. తమవాస్తవ జీవన స్థితిగతులు, రిజర్వేషన్ అమలులో లోపాలు ప్రభుత్వం సరిదిద్దుతుందనే ఆశతో ఇటీవల బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎన్.రాములుకు టీబీసీ ఐకాస ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. బలహీన వర్గాల మొహాలు వెలిగినప్పుడే, వారి కళ్ళలో ఆనందం వెల్లివిరిసినప్పుడే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందుకు సార్థకత ఉంటుందని తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ సమావేశంలో సీఎం కేసీఆర్ గుండె లోతుల్లో నుంచి మాట్లాడిన మాటలే తెలంగాణలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాలకు ఆశలు రేపుతున్నాయి.

తమకులాన్ని బీసీ-డీ గ్రూపులో నుంచి తొలగించి బీసీ-ఏ గ్రూప్‌లో చేర్చాలని మేరు కులస్తులకు చెందిన మేరు సమాఖ్య ద్వారా ప్రభుత్వం కుల జనాభా ప్రాతిపదికన ప్రతి ఆర్థిక సంవత్సరంలో సరిపడా బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వం నిర్వహించే కుట్టుపనుల కాంట్రాక్టు పనులు, ఉద్యోగులకు, హాస్టల్ విద్యార్థులకు, యూనిఫాంలు, ఇతర కుట్టు పనులు, కార్పొరేట్, సంస్థలకు ఇవ్వకుండా కేవలం మేరు కులస్తులకే కాంట్రాక్టు అప్పగించాలని, వృద్ధులకు వితంతువులకు, పింఛన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, యువతీ యువకులకు స్వయం ఉపాధి రుణాలు, మంజూరు చేయాలని, ఇండ్లు లేని తెలుపురేషన్ కార్డుదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని, దర్జీలకు మేరు రాజకీయాల్లో రాణింపునకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. ఇవన్నీ ప్రభుత్వం కల్పించినప్పుడే వీరు దర్జాగా బతుకుతూ బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములవుతారు.

హరి అశోక్‌కుమార్
టీబీసీ ఐకాస రాష్ట్ర అధ్యక్షులు

అనవసర ప్రసంగాలు

మన లేఖలు

మార్చి ఎనిమిదిన మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాయి. రాజకీయ నేతలు, ప్రభుత్వాధికారులు మహిళల అభ్యున్నతికి పాటుపడతామని హామీలు గుప్పిం చారు. ఇది ప్రతి ఏటా జరుగుతున్న తంతే. దేశ జనాభాలో ఇంచుమించు సగం ఉన్న మహిళలకు ప్రభుత్వాలు వాస్తవంలో ఒరగబెడుతున్నదేమీ లేదు. చట్టసభల్లో వారికి రిజర్వేషన్లు కల్పించడం మొదలు, బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చేయి వరకూ అన్ని రంగాల్లో మహిళలకు అన్యాయమే ఎదురవుతోంది. 'మహిళా సాధికారత' వంటి తియ్యటి పదాలను ప్రయోగిస్తూ ప్రసంగాలు చేస్తున్న పాలకులు ఇప్పటికైనా పాలకులు తమ మాటలకు, చేతలకు మధ్య ఉన్న అగాధాన్ని గుర్తించాలి.

- జి. అశోక్, జగిత్యాల జిల్లా

రోడ్డు ప్రమాదాలపై నియంత్రణ కరువు

నిత్యం రోడ్డు ప్రమాదాలు అనేక ప్రాణాలని బలిగొంటున్నాయి. వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం, వాటికనుగుణంగా రోడ్లు లేకపోవడం, వేగంపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం వల్ల ఈ అనర్థాలు జరుగుతున్నాయి. రోడ్ల నిర్వహణ, వాహనాల నియంత్రణలపై ఆయా ప్రభుత్వ శాఖలు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మూలమలుపులు, కల్వర్టుల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడం మూలాన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న వారిని శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చిరిపోతుల శ్రీనివాస్
జయశంకర్ భూపాలపల్లి జిల్లా

మనం
కుటుంబం
మంగళవారం, 13 మార్చి 2018
www.manamnews.com

ఉదయం ఏడుగంటలు కూడా కాకముందే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటే.. అమ్మో మార్చ్ నెల్లోనే ఇలా ఉంటే ఏప్రిల్, మేలో ఎలారా దేవుడా అని ఆలోచిస్తున్నారా? తప్పదు మనం అన్ని సీజన్లనూ ఆస్వాదించడం నేర్చుకునే వరకూ ఇలాంటి ఆలోచనలు మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. ఏ సీజన్‌లో ఎలా ఉండాలో, ఏం తినాలో, ఏం చేయాలో అవి మాత్రమే చేస్తూ పోయామనుకొండి అప్పుడు ఆయా సీజన్ల కష్టాలు తట్టుకోవడం ఈజీ అవుతుంది. అందుకే మీరు వడగాలులు గురించి దిగులు పడి ప్రయోజనం లేదని గుర్తించి, కాస్త జాగ్రత్తగా ఈ సమ్మర్‌ను గడిపితే సరిపోతుంది. ఇందుకు ఏం చేయాలి అంటే పెద్దగా టెన్షన్ పడాల్సిన అవసరం లేదు, కాసింత అవగాహనతో మెలిగితే ఈ ఎండా కాలం కూల్‌గా గడిచిపోతుంది.



చల్లని వేసవి



దినచర్యను త్వరగా మొదలుపెట్టడం

సమ్మర్‌లో త్వరగా నిద్రలేవడం చాలా ముఖ్యమైన అంశంగా ప్రాధాన్యతనిచ్చేలా చూసుకొండి. సూర్యోదయానికంటే ముందే నిద్రలేచి, చకచకా మీ పనులన్నీ చేసేసుకుంటే పొద్దు పెరిగే సమయానికల్లా నీడపట్టున హాయిగా విశ్రాంతి తీసుకోవడం, ఎండ తగ్గాక మళ్లీ రొటీన్ పనులు పూర్తయ్యేలా చూసుకుంటే మీరు ఎక్కువగా అలసిపోకుండా, ఎండ వడనుంచి కాపాడుకునే ఛాన్స్ ఉంటుంది. అలా కాకుండా పొద్దెక్కాక లేచి.. అప్పుడు వేడి గాలులు తట్టుకోలేక నానా తిప్పలు పడి ఉసూరుమనకుండా ఉండేలా ప్లాన్ చేసుకొండి. ఇందుకు రాత్రిళ్లు కూడా త్వరగా ఇంటికి చేరుకుని ఎర్లీగా డిన్నర్ చేసి, విశ్రమిస్తే మీ శరీరం వేసవి అలసటనుంచి త్వరగా బయటపడి, సేద తీరుతుంది.



ఎండలో వెళ్తున్నారా?

ఆఫీస్,కాలేజ్ లేదా ఇతరత్రా పనులపై బయటికి వెళ్లేవారు మంచి కాళ్ల జోడు, కళ్ల జోడు ధరించడం అత్యవసరం, దీనికి తోడు గొడుగును తీసుకెళ్లడం ఈ రెండున్నర నెలలు మరవద్దు, ఉన్నట్టుండి క్యూములో నింబస్ మేఘాలు వర్షించడంతో తడిసిపోతే కూడా జ్వరం రావచ్చు, మధ్యాహ్నం ఎండ తీవ్రతనుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే సన్‌స్క్రీన్ వంటివాటికంటే మెరుగైన సాధనం గొడుగే. టూవీలర్‌లో వెళ్లేవారు హెల్మెట్, గ్లౌజులు తప్పనిసరిగా ధరించాలి. దీంతో ట్యానింగ్‌కు కూడా తక్కువ ఛాన్స్ ఉంటుంది కనుక మీ చర్మంలో తేమ సురక్షితంగా ఉంటుంది. వీలైతే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌నే ఆశ్రయిస్తే హాయిగా గమ్యస్థానం చేరుకోవచ్చు. టూ వీలర్ కంటే బస్సు లేదా రైలు ప్రయాణం చేయడం ఉత్తమం. చర్మంపై ప్రత్యక్షంగా ఎండ పడి (అల్ట్రా వైలెట్ రేస్) అతినీలలోహిత కిరణాలతో సన్ బర్న్ వంటివి రాకూడదంటే సన్ స్క్రీన్ రాసేసుకుంటే సరిపోదు.. చేతులు, మెడ, ముఖం,తలపై ఎండ పడకుండా కేర్ తీసుకోవాలి. వైద్యులు చెప్పే ఈ సూచనలు తూ.చ. తప్పకుండా పాటించారో సమ్మర్ ఇట్టే హాయిగా గడిచిపోతుంది.

సీజనల్ పళ్లు, కూరగాయలు

ఎండకాలం వచ్చే పుచ్చకాయలు మొదలు ఖర్బూజా, మామిడి , వంకాయ, మునక్కాయ, కొబ్బరి కాయలు, చింత చిగురు, తాటి ముంజలు వంటి సీజనల్ పళ్లు, కూరగాయలన్నీ తప్పకుండా సేవించండి. దీంతో మీకు ఇమ్యూనిటీ పెరిగి, సమ్మర్‌ను కూల్‌గా డీల్ చేసే తత్వం మీ శరీరానికి అలవడేలా చేస్తుంది. ఇక నిల్వ ఉన్న ఆహారం తినకుండా అప్పటికప్పుడు వండుకుని తినడంతో ఎండా కాలంలో వంటలు త్వరగా చెడిపోతాయన్న బెడద ఉండదు. భోజనంలో పెరుగు లేదా మజ్జిగతోపాటు మజ్జిగ పులుసు, పచ్చి పులుసు వంటివి ఉండేలా మెనూ రెడీ చేసుకోండి. ఆమ్ రస్ లేదా మామిడి పళ్లు కూడా ఎండకాలంలో తినడంతో నీరసాన్ని అధిగమించే ఛాన్స్ ఉంటుంది.

నీరు, నీరు, నీరు



బయటినుంచి రాగానే చల్లటి నీటితో ముఖం కడగండి, లేదా స్నానం చేయండి. మిగతా రోజుల్లో కంటే రెండు లీటర్ల నీరు సమ్మర్‌లో రోజూ ఎక్కువ తాగండి. కుండలో నీళ్లు తాగితే దాహం తీరుతుంది, అదే ఫ్రిజ్ నీరు అయితే ఎంత తాగినా దాహం తీరకపోగా, గొంతు నొప్పికి దారితీసే ప్రమాదముంది. ఇక వేసవి పోయేవరకూ రెండు పూటలా స్నానం చేస్తే అదే మీ చర్మానికి శ్రీరామరక్షలా పనిచేస్తుంది. ఇక ఇంటినుంచి కాలు బయట పెట్టారో నీళ్ల బాటిల్ లేకుండా మాత్రం కదలకండి. మిట్టమధ్యాహ్నం బయటినుంచి ఇంట్లోకి రాగానే కాసిన్ని నీళ్ల అందులోకి ఉప్పు, చక్కెర చిటికెడు కలిపి తాగితే మీకు కళ్లు తిరగకుండా ఉంటుంది. కొబ్బరి నీళ్లు, నీళ్ల మజ్జిగ వంటివి ఇంట్లో నిలువ ఉండేలా చూసుకొండి. ఇక నిమ్మకాయ రసంలోకి కాసింత చక్కెర, ఉప్పు వేసుకుని సేవిస్తే అది దివ్యౌషధంలా ఈ వేసవిలో మీకు సహకరిస్తుంది. చెమట ఎక్కువగా వచ్చే శరీర తత్వం ఉన్నవారు రోజూ ఇలాంటి పానీయాలు సేవిస్తే అలసటనుంచి ఈజీగా బయటపడవచ్చు.

- శ్రావణ్ కుమార్, హైదరాబాద్

చిన్నారులు జాగ్రత్త


చెమటను తట్టుకోలేక చిన్నారులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అందుకే చిన్నారులతోపాటు ఇంటిల్లిపాది అందరూ వదులుగా ఉన్న వస్త్రాలే ధరించండి, స్కిన్ టైట్‌తో స్కిన్ అలర్జీలు తప్పవు, పైపెచ్చు ముతక వస్త్రాలైన కాటన్ వంటివి వేసుకోవడంతో మీరు బయటికి వెళ్లినా చర్మం కమిలిపోకుండా, అతిగా శరీర దుర్గంధం రాకుండా ఉంటుంది. మీ పిల్లలకు స్విమ్మింగ్ వంటివి నేర్పేందుకు సమ్మర్‌లో టైం కేటాయించండి, దీంతో వారు బాగా సమ్మర్‌ను ఎంజాయ్ చేయడమేకాదు, శారీరకంగా కూడా ఎదిగే అవకాశాన్ని స్విమ్మింగ్ కల్పిస్తుంది. చిన్నారులను రెండు లేదా మూడు పూటలా స్నానం చేయించండి, వీరి చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కనుక దద్దర్లు వంటివి రాకుండా ఉండేలా ఇది తోడ్పడుతుంది. చెమటకాయలు వంటివి పారద్రోలాలంటే కూడా స్నానం మంచి ఆయుధంలా పనిచేస్తుంది. పళ్ల రసాలు, నీరు గంటకోమారు తాగిస్తూ పిల్లల్లో డీహైడ్రేషన్ రాకుండా జాగ్రత్తలు తీసుకోండి. పిల్లలకు ఖర్జూరం, బాదం, పిస్తా, చెర్రీస్, జీడిపప్పు, కిస్‌మిస్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్‌ను కూడా ఎక్కువగా ఇవ్వండి, ఇది శారీరక బలాన్ని పెంచుతుంది. అన్ని వయసుల వారు రొటీన్‌లో భాగంగా వేసవిలో వీటిని తినడంతో నీరసం దరిచేరకుండా ఉంటుంది.



ఈ-కోలీతో పారాహుషార్

సమ్మర్ రాగానే ఈ-కొలి బ్యాక్టీరియా వీరవిహారం చేసే సీజన్ కనుక బయట ఆహార పదార్థాలు తినాల్సివస్తే వేడిగా మాత్రమే తినండి. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై అమ్మే పానీ పూరీ, చాట్, సోడాలు, తినుబండారాల్లో ఇది విపరీతంగా పెరుగుతుంది కనుక ఇలాంటి చోట్ల తినే సమయంలో ముందూ వెనుకా చూసి తినడం అతిముఖ్యమైన అంశం. వీలైతే ఈ వేసవిలో బయటి ఆహారానికి గుడ్‌బై చెప్పండి. ముఖ్యంగా హోటళ్లలో తినే నాన్‌వెజ్‌తో మరిన్ని ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి, అందుకే వేసవిలో బయట నాన్‌వెజ్ తినేముందు హైజీనిటీపై ఓ కన్నేయండి. తినే ఆహారం కూడా మిగతా రోజుల్లోలా ఎక్కువగా లాగించేయకుండా మితంగానే తినండి. ఎక్కువ నీరు తాగుతూ, తక్కువ ఘన పదార్థాలు తినడంతోపాటు ఈజీగా జీర్ణమయ్యే పదార్థాలను ఎంచుకోండి. మసాలాలు, కారం, నూనె ఎక్కువగా ఉన్నవాటికి ఈ రెండున్నర నెలలు కాస్త దూరంగా ఉండేలా నోటి చపలత్వానికి తాళం వేయండి. తాజా పళ్లు, కూరగాయలతోపాటు డ్రై ఫ్రూట్స్, నట్స్ ఎక్కువగా తింటూ, కీరా దోసకాయ వంటి నీరు అధికంగా ఉన్న కూరగాయలకే ప్రాధాన్యతనిస్తే మీ చర్మం నిగనిగలాడుతూ ఉంటుంది.

సెల్యూట్: ముంబైకర్లు



మహారాష్ట్రలో రైతు ఉద్యమానికి ఉడతాభక్తిగా ముంబైకర్లు చేసిన సాయం, సేవ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఉద్యమాల రూపు రేఖలను మార్చివేసేలా సాగిన ఈ రైతు ఉద్యమంలో ముంబై మహానగర ప్రజలు పోషించిన పాత్ర నభూతో నభవిష్యసి. 200 కిలోమీటర్లపాటు పాదయాత్ర చేస్తూ వచ్చిన అన్నదాతలకు అడుగడుగునా పూల వర్షంతో ఘనస్వాగతం పలకడం, వారికి అవసరమైన తాగునీరు, ఆహారాన్ని అందిస్తూ రైతన్నలకు ఆద్యంతం అండగా నిలిచిన మరాఠీ ప్రజలు సరికొత్త ఉద్యమానికి ప్రాణం పోశారు.







నీరు, ఖర్జూరం, బిస్కెట్లు

ఈనెల 6న నాసిక్‌లో ప్రారంభమైన కిసాన్ లాంగ్ మార్చ్, 30,000 మంది రైతులతో ఆదివారం అర్ధరాత్రి, సోమవారం తెల్లవారు జామున ముంబై నగరం చేరుకునే సమయానికి కళ్లు కాయలుకాచేలా వేచి చూస్తున్న ముంబైకర్లు, పాదయాత్రగా వచ్చిన రైతులను చూడగానే వారికి అవసరమైన కనీస సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కేవలం ఎన్జీఓలే కాదు సామాన్యులు సైతం ఎవరికి తోచింది వారు చేస్తూ పోవడంతో రైతు ఉద్యమానికి కావలసినంత నైతిక మద్దతు, అండదండలు లభించాయి. రైతులంతా ఆజాద్ మైదానం చేరుకునే సమయానికి మంచినీరు, నట్స్, డ్రైఫ్రూట్స్, బిస్కెట్స్, చిరుతిండి, పళ్లు ఇలా ఒక్కటేమిటి ముంబైకర్లు రైతులకు అడుగడుగునా సపోర్ట్ చేసిన తీరు, నెటిజన్లు మనకు కళ్లకు కట్టినట్టు ఫొటోలు, వీడియోల్లో తమ సయోధ్యను చూపుతూ, సర్కారు మెడలు వంచేలా చేసింది.





మహిళా రైతులు కూడా

సిటిజెన్ జర్నలిస్టులుగా నెటిజన్లు పాదయాత్రలో పాల్గొన్న మహిళా రైతులు, మహిళా రైతు కూలీల ఫొటోలను పోస్ట్ చేసి, ఉద్యమంలో వీరు పోషించిన పాత్రను చూపారు. పాదయాత్రలో పాల్గొన్న కొందరు మహిళల కాళ్లకు ఒక చెప్పు ఉంటే ఇంకో చెప్పు లేదు, మరికొందరు భగ్గుమంటున్న ఎండను లెక్కచేయకుండా అలాగే పాదయాత్రను పూర్తి చేయడం, బొబ్బులు ఎక్కిన కాళ్లను చూపుతున్న బ్లాగర్స్ ఫొటోలు ముంబైకర్లలోని ఉద్యమస్ఫూర్తిని ప్రపంచానికి చాటింది. ఫేస్‌బుక్, ట్విట్టర్‌తోపాటు సోషల్ మీడియాను ముంబై నగర వాసులు పాదయాత్రకు సంబంధించిన హైలైట్స్‌తో నింపేసారు. తమ సంఘీభావాన్ని మనసా వాచా కర్మణా చాటుకున్న ముంబైకర్లు మరాఠా రైతులకు బాసటగా నిలిచిన తీరు యావత్ దేశాన్ని అబ్బురపరుస్తోంది.

అమ్చీ ముంబై-లాల్ సలాం

వయసు, జాతి, కుల, మతాలకు అతీతంగా సాగిన పాదయాత్రను అదే స్ఫూర్తితో ముంబై మహానగరం స్వాగతం పలికిన తీరు అద్భుతం అనిపించింది. తమ బ్రతుకులు గడవడమే దుర్భరం అనే స్థితుల్లో ఉండే ముంబైలోని మధ్యతరగతి ప్రజలు పోషించిన ఈ పాత్ర గతంలో ఎన్నడూ ఆవిష్కృతం కాలేదు. రైతుల పాదయాత్ర సాగిన దారుల్లో సామాన్యులంతా కాపు కాసి మరీ అందించిన సాయం నేను సైతంలా సాగింది. ఐఐటీ ముంబై స్టూడెంట్స్ మొదలు విద్యార్థులంతా పూల రెక్కల వానతో రైతులకు 'లాల్ సలాం' చేశారు. బోర్డ్ ఎగ్జామ్స్ జరుగుతున్న





కారణంగా విద్యార్థులెవ్వరికీ అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు నిశ్శబ్దంగా అర్ధరాత్రి పాదయాత్రగా చేరి, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా, నినాదాల హోరుతో స్టడీ అవర్స్ దెబ్బతినకుండా వేలాది మంది రైతులు చేసిన ఈ యాత్ర విద్యార్థి సంఘాలను కదిలించింది. మొత్తానికి మరోమారు..'రాత్ కో బారాబజే దిన్ నికల్తాహై.. అమ్చీ ముంబై'.. అనే పలుకులకు ఇటు రైతులు అటు ముంబైకర్లు నిజం చేసి చూపారు. 'దిస్ ఈజ్ ద ట్రూ స్పిరిట్ ఆఫ్ ముంబై' అని మరోమారు ప్రశంసలతో ముంబైకర్లను ప్రజలు వేనోళ్ల పొగిడేలా చేసిన సందర్భమిది. రైతుల సమస్యలను అర్థం చేసుకుని సహకరించిన ముంబైకర్లలో డబ్బావాలాలతోపాటు ధరావీలోని కడుపేదవారు ఉండడం విశేషం.





వీధిరౌడీల్లా..



(మొదటిపేజీ తరువాయి)

చెప్పేందుకు, సభను ఎన్నిరోజులైనా నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అయినా.. సభలో కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగం సమయంలో మైకులు,హెడ్‌ఫోన్లు విసిరారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైనది శాసనసభ, గవర్నర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ సభ్యులు దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శించే హక్కు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు ఉందని, మాటల రూపంలో దాడి, విమర్శలు చేసే అవకాశం ఉందని అన్నారు. ఇన్నేళ్ల కాంగ్రెస్ అనుభవం భౌతికంగా దాడి చేయడమే నేర్పిందా? అని ప్రశ్నించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యాన్ని పెంచడానికా? తుంచడానికా? అని జానారెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అసహనంతో ఉన్నారని, అందుకే ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని అన్నారు. ''ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మేం గొడవ చేసింది నిజమే. అప్పట్లో తెలంగాణ వాణిని శాసనసభలో వినిపించే అవకాశం లేదు. తెలంగాణ మాట, భాష, గోస వినే అవకాశం లేదు. అందుకే మేం అలా చేశాం. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటంలో భాగంగా సభలో మేము ప్రవర్తించాం. అప్పటి, ఇప్పటి పరిస్థితులకు చాలా తేడా ఉంది. తెలంగాణ శాసన సభలో మాట్లాడే అవకాశం ప్రస్తుత సభ్యులకు ఉంది. మాది భగత్‌సింగ్ లాంటి పోరాటం. కాంగ్రెస్ వాళ్లది ఉగ్రవాదుల వంటి పోరాటం'' అని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మధ్య దేశభక్తికి, దేశద్రోహానికి ఉన్న తేడా ఉందన్నారు. ''గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు యత్నించినపుడు మార్షల్స్ రక్షణ కవచంలా నిల్చున్నారు. మాటల రూపంలో దాడి చేయాలి? మాటల రూపంలో ప్రశ్నించాలి? కాంగ్రెస్ చేసిన చర్యలను ప్రజాస్వామ్య వాదులు హర్షిస్తారా..?'' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లకు సభలో ఉండే ఉద్దేశం లేదని, వాళ్లు ఏదైనా చేయొచ్చని ముందే సీఎం కేసీఆర్ హెచ్చరించారని, వాళ్లు అలాగే చేశారని అన్నారు. గవర్నర్ టార్గెట్‌గా హెడ్‌ఫోన్ విసిరినా.. దురదృష్టవశాత్తు అది మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిందన్నారు. హెడ్‌సెట్‌ను సంపత్‌కుమార్‌తో కలిసి తానే విసిరానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చెప్పిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు.

రణరంగం

హైదరాబాద్, మార్చి 12 (మనం ప్రతినిధి):

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల మొదటి రోజే నిరసనలతో హోరెత్తింది. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన కొద్ది సేపటికే కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలపడం ప్రారంభించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రైతుల ఆత్మహత్యల గురించి ప్రస్తావించలేదని, ఎన్నికల హామీలను విస్మరించారని, పంటలకు గిట్టుబాటు ధర రావడంలేదని నినాదాలు చేస్తూ పోడియం వైపు దూసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అప్పటికే అసెంబ్లీలో పెద్ద సంఖ్యలో మోహరించిన మార్షల్స్.. కాంగ్రెస్ సభ్యులను వారి సీట్లు దాటి ముందుకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో సభ్యులు మార్షల్స్‌ను నెట్టుకుంటూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు.

ఈ క్రమంలోనే కాంగ్రెస్ సభ్యులు గవర్నర్ ప్రసంగపాఠాన్ని చించి గాల్లోకి ఎగరేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ సభ్యులు, మార్షల్స్ మధ్య తోపులాట జరుగుతుండటంతో కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు జానారెడ్డి వెనక్కి వచ్చి మరో సీట్లో కూర్చుకున్నారు. సభ్యులు విసురుతున్న కాగితాల ముక్కలు గవర్నర్‌పై పడకుండా మార్షల్స్ పలుమార్లు అడ్డుకున్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన చేతిలో ఉన్న హెడ్ ఫోన్స్‌ను గవర్నర్ వైపు విసిరారు. అది మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలిందని టీఆర్ఎస్ సభ్యులు ఆరోపించారు. కంటికి దెబ్బ తగలడంతో స్వామిగౌడ్‌ను సరోజినిదేవీ కంటి ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మార్షల్స్ తోపులాటలో తన కాలికి గాయమైందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మరో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేతికి సైతం గాయమైంది.

కాంగ్రెస్ అనుమానాలు

కోమటిరెడ్డి హెడ్‌ఫోన్ విసిరిన కాసేపటి వరకు స్వామిగౌడ్ మామూలుగానే ఉన్నారని.. ఆయన అసెంబ్లీ నుంచి బయటకు వచ్చిన తర్వాత వీల్‌చైర్‌లో ఆసుపత్రికి తరలించారని కాంగ్రెస్ పార్టీ అనుమానం వ్యక్తం చేసింది. ప్రభుత్వం కావాలనే ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఈ విధంగా చేసిందని సీఎల్పీ నాయకుడు జానారెడ్డి విమర్శించారు. సభలో ఎన్నడూలేని విధంగా అంతమంది మర్షల్స్‌ను మోహరించి అడ్డుకోవాల్సిన అవసరం ఏంటని కాంగ్రెస్ సభ్యులు ప్రశ్నించారు.





నిరసనలు మామూలే

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగాన్ని కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారన్నారు. ఆవేదన, ఆవేశంతో సభ్యులు కాగితాలు, హెడ్‌ఫోన్స్ విసిరి ఉండవచ్చని చెప్పారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగిన దాఖలాలున్నాయన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఏదో జరిగిందని రాద్ధాంతం చేయాలని చూడటం విచారకరమన్నారు. ఉద్రిక్తతలకు కారణం ప్రభుత్వం వ్యవహరించిన తీరేనన్నారు. మార్షల్స్ సభ్యులను తోసేస్తున్న సమయంలో టేబుల్ తన ఉదర భాగానికి ఒత్తుకుపోవటంతో ఇబ్బంది కలిగిందని జానారెడ్డి చెప్పారు. దీంతో తాను వెనుకకు వచ్చానని, కానీ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రం ఎవరో సభ్యులు మద్యం తాగి వచ్చి తూలి పడుతుంటే తాను వెనక్కి వెళ్లానని అనడం విచారకరమన్నారు. మద్యం తాగి అసెంబ్లీకి వచ్చారని పల్లా పేర్కొనటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.
ఆయన మాటలు సభతో పాటు సభ్యులను కించపర్చేలా ఉన్నాయన్నారు. మద్యం తాగి వచ్చారనే విషయమై స్పీకర్ ఆలోచించాలన్నారు. మద్యం తాగి వచ్చారనే విషయంలో ఆ సభ్యుడికి ఎలా తెలుసో చెప్పాలని పల్లానుద్దేశించి ఆయన ప్రశ్నించారు.



మా నాన్న సీఎం కాదు



ఒక్కో మెట్టూ ఎక్కుతూ రావాలి
ఆ సహనం.. ఓపిక రెండూ ఉన్నాయి
స్థానికంగా అందుబాటులో ఉండాలి
అందుకే ఇక్కడ ఇంటికి శంకుస్థాపన
నా స్టాండ్ ఏంటో 14 తర్వాత చెబుతా
పార్టీకి 12 మంది అధికార ప్రతినిధులు
జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి, మార్చి 12 (మనం ప్రతినిధి):

''ఒక రోజు ఆలస్యమైనా సరే.. స్పష్టమైన విధానాలతో ప్రజలకు చేరువ కావాలన్నదే జనసేన లక్ష్యం. మా నాన్న సీఎం కాదు.. నేను ఒక్కో మెట్టూ ఎక్కుతూ రావాలి. అది చాలా కష్టం. ప్రజల కోసం ఆ కష్టాన్ని ఎదుర్కొనే సహనం, ఓపిక రెండూ నాకున్నాయి'' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఉవ్వెత్తున ఎగిసి పడటమే కాదు.. ఆలోచనలతో ముందుకువెళ్లే నాయకత్వం కూడా పార్టీకి అవసరమని, అందుకే పార్టీ నిర్మాణం ఆలస్యమవుతోందని ఆయన చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో సోమవారం ఉదయం సొంతింటి నిర్మాణానికి ఆయన సతీసమేతంగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలంటే స్థానికంగా ఉండాలని, అందుకే మంగళగిరిలో ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇంటితో పాటు పార్టీ కార్యాలయం నిర్మించే ఆలోచనలోనూ ఉన్నామని తెలిపారు. సమస్యలు చెప్పుకోడానికి ప్రజలు హైదారాబాద్ వరకు రావటం కష్టంగా ఉంటోందని, తనకు కూడా అక్కడి నుంచి రావటానికి ఇబ్బందిగా ఉందని.. అందుకే వారికి అందుబాటులో ఉండేందుకు ఇక్కడ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ''మంగళగిరిలో మా నాన్న కానిస్టేబుల్‌గా పనిచేశారు. ఈ ప్రాంతంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేయటం సంతోషంగా ఉంది'' అని పవన్ వ్యాఖ్యానించారు.

14 తర్వాత స్టాండ్ చెబుతా

ఈ నెల 14 తర్వాత తన స్టాండ్ చెబుతానని, హోదా విషయం గురించి స్పష్టత ఇస్తానని జనసేనాని తెలిపారు. తాను ఎవర్నీ వెనకేసుకు రానని, అలాగని ఎవరితోనూ శతృత్వం లేదని, ప్రజాసమస్యలు పట్టించుకోనివారు ఎంతటివారైనా సరే తీవ్రంగా స్పందిస్తానని తేల్చిచెప్పారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేసే వారే జనసైన్యమన్నారు. చాలామంది ప్రజలు జనసేనలోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. తన ఆస్తులన్నీ ఇన్‌కంట్యాక్స్ అధికారులకు తెలుసన్నారు. ''నా ఆస్తులు ఎవరినీ దోచేసి సంపాదించినవి కావు.. నేను కష్టపడి సంపాదించుకున్నా. ప్రజలిచ్చిన ఆస్తులవి. కొన్నిసార్లు పోగొట్టుకున్నా. మళ్లీ తిరిగి సంపాదించుకున్నా. అవరమైతే ఆస్తులు ప్రకటిస్తా. నాకు చాలా స్పష్టత ఉంది. నా అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకోను. సమస్యల నుంచి పారిపోను. జనసేన వెనుక టీడీపీ ఉందంటే... మరి వైసీపీని మోదీ వెనుక ఉండి నడిపిస్తున్నారా? అని నేనలా అంటే వారికెలా ఉంటుంది'' అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటివరకు 40 వేల మంది వరకు పార్టీలోకి తీసుకున్నామని, 12 మందిని పార్టీ అధికార ప్రతినిధులుగా నియమించామని పవన్ పేర్కొన్నారు.

బంగారు తెలంగాణ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. సోమవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమ్మిళితమైన సుస్థిరమైన ఆర్థిక వృద్ధి ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతమని చెప్పారు. సమాజంలో ఇప్పటి వరకు నిర్లక్ష్యం చేయబడిన, అణచివేతకు గురైన వర్గాలకు వృద్ధి ఫలాలు కచ్చితంగా అందాలన్నారు. మూడున్నర సంవత్సరాలుగా సవాళ్లను అధిగమిస్తూ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించింది. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపుతుందని గుర్తించినట్లు గవర్నర్ చెప్పారు. నూతన రాష్ట్రమైన తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని, రాష్ట్రం చేపట్టిన అనేక కార్యక్రమాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందయన్నారు.

తెలంగాణ ఏర్పడిన తరువాత 2014-17 మధ్య రాష్ట్ర జీఎస్‌డిపి 8.6 శాతం సగటు వార్షిక పెరుగుదల చేరుకుందని , ఇది 7.5 శాతం జాతీయ సగటు కంటే అత్యధికమని పేర్కొన్నారు. 2016-17 సంవత్సరం దేశ తలసరి ఆదాయం లక్షా మూడు వేలు ఉంటే , తెలంగాణ తలసరి ఆదాయం లక్షా 54 వేలుగా అంచనా వేయడమైంది. వ్యవసాయ రంగ పునరుద్ధరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. 35.3 లక్షల మంది రైతులకు ప్రయోజన కలిగేలా లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేశామన్నారు. సూక్ష్మ సేద్యం, గ్రీన్ హౌజ్‌లు, పాలీ హౌజ్‌ల వంటి వాటి వల్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో 101 లక్షల 29 వేల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగిందని గవర్నర్ వివరించారు. 2018 జనవరి 1 నుంచి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



గొల్ల, కురుమ కులాలకు 75 శాతం సబ్సిడీతో 50 లక్షల 10 వేల గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం స్వయం సమృద్ధిని సాధించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలోని 10823 గ్రామాల్లో 1507 బృందాలతో భూ రికార్డుల తాజా పరిచే కార్యక్రమాన్ని వంద రోజుల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్త పట్టదారు పాస్ పుస్తకాలను త్వరలోనే రైతులకు పంపిణీ చేస్తామని, భూ రికార్డుల పూర్తి సమాచారం కోసం త్వరలోనే ధరణి వెబ్‌సైట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సాగునీటి రంగం గోదావరి, కృష్ణా నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. 23 భారీ సాగునీటి ప్రాజెక్టులను 13 మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్‌లను చేపట్టిందని, వీటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 16 లక్షల 64 వేల ఎకరాల కొత్త సాగునీటి వసతి కల్పించి, 8 లక్షల 97 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరిగిందని చెప్పారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందన్నారు. పాలమూరు ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్ట్, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకాలకు అనేక అడ్డంకులు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, కావాల్సిన అనుమతులు పొందినట్లు తెలిపారు. మిషన్ కాకతీయ కార్యక్రమం కింద చెరువుల పునరుద్ధరణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రామీణ, పట్టణ కుటుంబాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ పనులు 95 శాతం పూర్తయినట్లు గవర్నర్ తెలిపారు. 5,500 గ్రామీణ జనావాసాలకు, 13 పట్టణ స్థానిక సంస్థలకు దీని ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు. విద్యుత్ రంగంలో 12, 931 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ పనులు వివిధదశల్లో ఉన్నాయి. సమీప భవిష్యత్‌లో రాష్ట్రం మిగులు రాష్ట్రంగా ఉంటుందన్నారు. పరిశ్రమలు టీఎస్- ఐపాస్ కింద సింగిల్ విండో ద్వారా పరిశ్రమలకు 15 రోజులలోపు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. సరళీకృత పారిశ్రామిక విధానం వల్ల దేశంలోనే తెలంగాణ అంత్యంత పారిశ్రామిక పెట్టుబడుల గమ్యస్థానంగా ఉందన్నారు. రాష్ట్రం సులభతర వాణిజ్య నిర్వహణలో మొదటి స్థానంలో ఉందన్నారు. టీఎస్-పాస్ ద్వారా 6206 పారిశ్రామిక యూనిట్ల ఆమోదంతో 4లక్షల 47 వేల మందికి ఉపాధి కల్పించేలా లక్షా 18 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. నేతన్నకు చేయూత పథకం కింద పొదుపు నిధిలో రాష్ట్ర ప్రభుత్వం వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచినట్లు తెలిపారు. చేనేత రంగానికి ఊతం ఇచ్చేందుకు వరంగల్ వద్ద సమగ్ర మెగా జౌళి పార్కును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఐటీలో దూసుకుపోతున్నాం..

హైదరాబాద్ నగరంలో అనేక బహుళ జాతి కంపెనీలు కార్యకలాపాలు నడుస్తున్నాయి. 15వందలకు పైగా ఐటి, ఐటిఇఎస్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. నాలుగు లక్షల 30 వేల మంది నిపుణులు పని చేస్తున్నారు. ఏడు లక్షల మందికి పైగా పరోక్ష ఉపాధి లభిస్తున్నది. 2016-17 సంవత్సరంలో సాఫ్ట్‌వేర్, ఐటి ఉత్పత్తుల ఎగుమతులు మొత్తం విలువ 85 వేల 470 కోట్లు. ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు 10 ఐటి విధనాలను ప్రభుత్వం ఆవిష్కరించింది. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు వీలుగా టీ హబ్ 2ను కూడా ప్రారంభించడం జరిగింది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లనూ ఐటి ఇంక్యుబేషన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండల, జిల్లా కేంద్రాలను అనుసంధానిస్తూ 1970 కిలోమీటర్ల పొడవైన రోడ్లను, 4665 కి.మీ. పొడవైన ప్రధాన జిల్లా రోడ్లను, రాష్ట్ర రహదారులను విస్తరించడం జరిగింది. రాష్ట్రంలో అడవులను 33 శాతానికి పెంచేందుకు హరితహారం కార్యక్రమంలో 34 కోట్ల మొక్కలను నాటామని, వీటిలో 30 కోట్ల మొక్కలకు జియో ట్యాగింగ్ వర్తింపు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ కిట్ మూలంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల వాటా 33 శాతం నుంచి 49 శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఈ కిట్‌లో రెండు వేలవిలువైన వస్తువులు అందిస్తున్నారు. గర్బిణుల కోస 250 వాహనాలతో 102 సర్వీసులను ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం పేరుతో కొత్త చట్టాన్ని చేశామని, కేటాయించిన నిధులు ఖర్చు చేయకుంటే, వాటిని వచ్చే ఆర్థిక సంవత్సరానికి బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన తరగతుల వారి కోసం మహాత్మ జ్యోతిభాపూలే బీసీ ఓవర్‌సిస్ స్కాలర్ షిప్, కల్యాణలక్ష్మి, రజకులకు, ఇతరులకు ధోబీ ఘాట్లు నిర్మించామని, వారి సంక్షేమానికి వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. 41 లక్షల 78 లక్షల మందికి ఆసరా ఫించన్లు ఇస్తున్నామని పేర్కొన్నరు. పోలీసు వ్యవస్థను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

కూలి.. కాలిపోయింది!

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయం సమీపంలో చోటుచేసుకుంది. 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో ఢాకా నుంచి నేపాల్ వస్తున్న యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం అక్కడి వరకు వచ్చిన తర్వాత ఫెన్సింగ్‌ను ఢీకొని కూలిపోయిందని ఖాట్మాండు విమానాశ్రయం జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ ఛెత్రి చెప్పారు. ఇప్పటివరకు 50 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కాలుతున్న విమాన శకలాల నుంచి కొంతమందిని రక్షించి.. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మరో తొమ్మిది మంది ఏమయ్యారో ఇంకా తెలియడంలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇంకా వివరాలు అందాల్సి ఉందని సైన్యం అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రమాదం కారణంగా విమానాశ్రయాన్ని మూసేసి.. విమానాలన్నింటినీ వేరే చోటకు దారి మళ్లించారు. విమానం నుంచి పొగ వస్తున్నట్లు టీవీలలో కనిపించింది. నేపాల్‌లో చాలావరకు పర్వతప్రాంతాలు ఉండటంతో విమాన ప్రయాణాలకు అది అత్యంత ప్రమాదకరంగా ఉంటుంది. అక్కడి స్థానిక ఎయిర్‌స్ట్రిప్‌లలో చిన్న విమానాలు తరచు ప్రమాదాలకు గురవుతాయి. 1992లో కూడా ఇలాగే ఖాట్మాండులో బ్యాంకాక్ నుంచి వస్తున్న థాయ్ ఎయిర్‌వేస్ విమానం ఒకటి ల్యాండ్ అవ్వబోతూ కూలిపోవడంతో అందులో ఉన్నవారంతా మరణించారు.

రాలుతున్న మొగ్గలు

(మొదటిపేజీ తరువాయి)

వాళ్లు. కానీ ఒకరితో ఒకరు పోటీపడుతూ ర్యాంకుల ఒత్తిడిలో పడి మార్కులు సాధించగలమో లేదోనన్న భయంతో వణికిపోతున్నారు. మెదళ్లు కాస్తా ప్రెషర్‌కుక్కర్ల కంటే దారుణంగా తయారవడంతో దాన్ని తట్టుకోలేక.. బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. గతంలో కంటే ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. 2007 సంవత్సరంలో రోజుకు 17 మంది చొప్పున చిన్నారులు ఆత్మహత్యలకు పాల్పడితే.. 2016 నాటికి అది మరింత ఘోరంగా తయారై.. ఏకంగా రోజుకు 26 మంది తనువు చాలించారు.

సంవత్సరం	విద్యార్థుల ఆత్మహత్యలు
2007	6248
2008	6060
2009	6761
2010	7379
2011	7696
2012	6564
2013	8423
2014	8068
2015	8934
2016	9474

2007 నుంచి 2016 వరకు ఏకంగా 75 వేల మంది దేశవ్యాప్తంగా ఇలా ఆత్మహత్యలు చేసుకున్నారని లోక్‌సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోం శాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ ఆహిర్ తెలిపారు. ఈ లెక్కలను ఆయన జాతీయ నేర రికార్డుల బ్యూరో లెక్కల ఆధారంగా అందించారు. 2016 సంవత్సరంలో దేశం మొత్తమ్మీద అత్యధికంగా మహారాష్ట్రలో 1350 మంది పిల్లలు ఆత్మహత్య చేసుకోగా, ఆ తర్వాతి స్థానాలలో వరుసగా పశ్చిమబెంగాల్ (1147), తమిళనాడు (981) ఉన్నాయి.

పరీక్షలలో ఫెయిలైనందుకు 2,413 మంది ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం మరణాల్లో ఇదే 25% కారణం అవుతోంది. 2007 నుంచి 2016 వరకు మరణించినవారిలో 23 వేల మంది ఇదే కారణం పేర్కొన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసువారి ఆత్మహత్యల రేటు చాలా ఎక్కువగా ఉన్న దేశాలలో భారతదేశం కూడా ఒకటని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. పరీక్షలలో ఫెయిలైనా, చదువులో వెనకబడినా పిల్లల మీద విపరీతంగా ఒత్తిడి పెరిగిపోతోందని, అందుకే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎన్‌ఫోల్డ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ సహ వ్యవస్థాపకురాలు షైబ్యా సల్దాన్హా చెప్పారు.



ఇరాన్‌లో కూలిన టర్కీ విమానం


17 మంది దుర్మరణం..

- మృతుల్లో టర్కీ బిజినెస్ టైకూన్ కూతురు

టెహ్రాన్, మార్చి 12: టర్కీకి చెందిన ప్రైవేటు జెట్ విమానం ఒకటి కూలిపోవడంతో 11 మంది మృత్యువాతపడ్డారు. షార్జా నుంచి ఇస్తాంబుల్ వెళ్తూ ఇరాన్ భూభాగంలోని పర్వతాల్లో విమానం ఆదివారం రాత్రి కుప్పకూలిపోయింది. విమానంలో 11 మంది ప్రయాణిస్తున్నారు. విమానం పర్వతాన్ని ఢీకొనడంతో మంటల్లో పేలిపోయిందని దేశ అత్యవసర సేవల విభాగం వెల్లడించినట్లు ఇరాన్ అధికారిక టీవీ ఛానల్ తెలిపింది. ఘటనా స్థలానికి చేరుకునేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. ఆ విమానం టర్కీకి చెందిన బిజినెస్ టైకూన్ బసరన్ హోల్డింగ్‌ది. టర్కీ దేశంలో మొత్తంలో ఆయనకు నిర్మాణం, ఫుడ్, ఎనర్జీ, ఫైనాన్స్‌కి చెందిన వ్యాపారాలు ఉన్నాయి. వీటన్నింటికీ బసరన్ కుమార్తె మీనా బసరన్(28) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, నెల రోజుల్లో వివాహం జరగనుంది. తన స్నేహితులతో కలిసి బ్యాచిలర్ పార్టీ చేసుకునేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

విమానాన్ని కూల్చేయాలన్న పుతిన్!

- 2014లో ఒలింపిక్స్ లక్ష్యంగా దూసుకొచ్చిన విమానం
- అందులో బాంబు ఉందని హెచ్చరికలు
- ఆ వెంటనే కూల్చేయాలని ఆదేశాలిచ్చిన రష్యా అధ్యక్షుడు



మాస్కో, మార్చి 12: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ ఓ సంచలన విషయాన్ని తాజాగా బయటపెట్టారు. 2014 సోచి వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి ముందు ఓ ప్రయాణికుల విమానాన్ని కూల్చేయాల్సిందిగా ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఒలింపిక్స్‌ను లక్ష్యంగా చేసుకొని ఆ విమానం ఓ బాంబును మోసుకొస్తున్నదన్న సమాచారంతో ఈ ఆదేశాలిచ్చినట్లు పుతిన్ ఓ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఉక్రెయిన్ నుంచి టర్కీ వెళ్తున్న ఆ విమానం హైజాక్‌కు గురైందని, అది సోచివైపు దూసుకొస్తున్నదని తనకు సమాచారం అందినట్లు పుతిన్ చెప్పారు. దీంతో వెంటనే దానిని కూల్చేయాల్సిందిగా తాను ఆదేశించినట్లు తెలిపారు. కానీ అది తప్పుడు సమాచారం అని తర్వాత తెలిసిందని, ఆ విమానాన్ని కూల్చలేదని ఆయన స్పష్టంచేశారు. టర్కీకి చెందిన పెగాసస్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737-800 ట్కఫ్లైట్‌లో 110 మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో ఒకరి దగ్గర బాంబు ఉన్నదని, అతడు విమానాన్ని సోచికి మళ్లించాల్సిందిగా డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఇలాంటి ఎమర్జెన్సీ సమయాల్లో విమానాన్ని కూల్చడమే మంచిదని భద్రతాధికారులు తనతో చెప్పినట్లు పుతిన్ వెల్లడించారు. కొద్ది నిమిషాల తర్వాత అదంతా తప్పుడు సమాచారం అని తనకు మరో కాల్ వచ్చినట్లు పుతిన్ చెప్పారు. ఆ తర్వాత కాసేపటికే పుతిన్ సోచిలోని ఒలింపిక్స్ వేదిక దగ్గరకు వెళ్లారు.

ఆ 11 విమానాలు నడపొద్దు

- ఇండిగో, గో ఎయిర్‌కు డీజీసీఏ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 12: ప్రాట్ అండ్ వైటనీ(పీడబ్ల్యూ) ఇంజన్లతో ఉన్న ఏ-320 న్యూఇంజన్ ఆప్షన్(ఎన్ఈవో) విమానాలను తక్షణమే నిలిపివేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) విమానయాన సంస్థలు ఇండిగో, గో ఎయిర్‌ను ఆదేశించింది. పీడబ్ల్యూ ఇంజన్లు ఉన్న ఏ-320 విమానాలు ఇండిగో వద్ద ఎనిమిది ఉండగా, గోఎయిర్ వద్ద మూడు ఉన్నాయి. అంతేకాక ఈ ఇంజన్లను రిఫిట్ చేయవద్దని డీజీసీఏ ఆదేశించింది. ఇండిగో సంస్థకు చెందిన ఓ ఏ-320 విమానం సోమవారం అహ్మదాబాద్ నుంచి లక్నవ్ బయలుదేరింది. ఇంజన్‌లో సాంకేతిక సమస్య వల్ల కొద్ది సేపటికే తిరిగి అహ్మదాబాద్‌కు వచ్చి ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోరింది. ఆ సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా ఉన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే డీజీసీఏ ఈ రెండు సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఇండిగో, గోఎయిర్ వద్ద ఉన్న 11 ఏ-320 విమానాల్లోనే ప్రత్యేకంగా ఈ తరహా పీడబ్ల్యూ ఇంజన్లు ఉన్నాయి. ఈ ఇంజన్ల వినియోగించవద్దని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఈ సంస్థలు వాటిని వినియోగిస్తున్నాయి. పీడబ్ల్యూ1100జీ గేరేడ్ టర్బో ఫ్యాన్ ఇంజన్లతో నడిచే ఏ 320 విమానాల్లో రెండు ఇంజన్లు అకస్మాత్తుగా ఆగిపోయే ప్రమాదం ఉందని యూరోపియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ గత నెలలో ఓ నివేదిక ద్వారా హెచ్చరించింది. ఎయిర్ ఇండియాతో పాటు విస్తారా వద్ద కూడా ఏ-320 విమానాలు ఉన్నాయి. కాకపోతే ఇవి సీఎఫ్ఎం ఇంజన్ల సాయంతో పనిచేస్తున్నాయి. పీడబ్ల్యూ ఇంజన్లలో ఎదురవుతున్న సమస్యలు సీఎఫ్ఎంలో ఉండడం లేదు.

ముగ్గురు ఉగ్రవాదులు హతం

- మట్టుబెట్టిన భారత సైన్యం
- హకురా ప్రాంతంలో ఎన్‌కౌంటర్



శ్రీనగర్, మార్చి 12: జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో భారత సైన్యం ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. అనంత్‌నాగ్ జిల్లాలోని హకురా ప్రాంతంలో భారత సైన్యం ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఆదివారం అర్థరాత్రి 'యాంటీ మిలిటన్సీ ఆపరేషన్' నిర్వహించింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఈషా ఫాజ్లీ(శ్రీనగర్), సయ్యద్ ఒవైస్(అనంత్‌నాగ్)తో పాటు మరో ఉగ్రవాదిని మట్టుబెట్టినట్లు భారత సైన్యాధికారులు తెలిపారు. ఉగ్రవాద శిబిరం నుంచి ఏకే 47 రైఫిల్స్, పిస్టల్స్, హ్యాండ్ గ్రెనైడ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనలో భారత సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని ఆయన తెలిపారు. చనిపోయిన వారిలో ఓ ఉగ్రవాది సౌరా వద్ద కొద్దిరోజుల క్రితం కానిస్టేబుల్‌ను కాల్చి చంపినట్లు అధికారి వెల్లడించారు. ఇదిలా ఉంటే, ఉగ్రవాదుల ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశం ఉండటంతో సైన్యం అప్రమత్తమైంది. అనంత్‌నాగ్ సమీపంలోని పాఠశాలలు, కళాశాలలకు భద్రతను కట్టుదిట్టం చేసింది. కశ్మీర్ యూనివర్సిటీ క్లాసులను ఒకరోజు పాటు రద్దు చేసింది. పరీక్షలను కూడా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. సైనికులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పహారా కాస్తున్నారు.

రైతన్నల 'మహా' విజయం

దిగివచ్చిన ఫడణవీస్ సర్కారు

- రైతుల రుణ మాఫీ, మద్దతు ధర.. అన్ని డిమాండ్లు నెరవేర్చేందుకు హామీ
- అన్నదాతల ర్యాలీలో ప్రభుత్వం వెల్లడి
- అసెంబ్లీలోనూ ప్రకటన చేసిన సీఎం
- శాసనసభ ముట్టడి విరమించిన రైతులు
- ఇది రైతన్నల సంఘటిత విజయం: ఏఐకేఎస్



ముంబై, మార్చి 12: మహారాష్ట్ర రైతన్నలు మహా విజయం సాధించారు. కరువుతో తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలంటూ 35 వేల మంది రైతులు 180 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్రకు ప్రభుత్వం దిగివచ్చింది. రైతన్నల డిమాండ్లు అన్నింటినీ నెరవేరుస్తామని ఆజాద్ మైదాన్ వేదికగా ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్ సోమవారం ప్రకటించారు. ముంబై చేరుకున్న రైతు సంఘాల ప్రతినిధులతో అంతకుముందు ప్రభుత్వం చర్చలు జరిపింది. అనంతరం మంత్రి ప్రకటన చేశారు. ఈ మేరకు రాతపూర్వకంగా ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. సర్కారు ప్రకటనతో రైతన్నలు సంతోషంతో మునిగిపోయారు. ఆనందంతో ఇంటిబాట పట్టారు. భారత దేశ చరిత్రలోనే ఇంత పెద్ద ఉద్యమం ప్రశాంతంగా ముగియడం పట్ల రాజకీయ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. అసెంబ్లీలోనూ సీఎం ఫడణవీస్ ఒక ప్రకటన చేస్తూ.. రైతుల సమస్యలపై తాము సానుకూలంగా ఉన్నామని ప్రకటించారు కూడా. కాగా, రైతులు తమ తమ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా నాసిక్ వరకు ప్రత్యేక రైలును నడుపుతున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటన చేయడం రైతన్నల సంఘటిత విజయానికి నిదర్శనమని ఏఐకేఎస్ అభిప్రాయపడింది. కరువు దెబ్బకు కుదేలైన తమను ఆదుకోవాలంటూ మహారాష్ట్ర రైతన్నలు చేపట్టిన మహాపాదయాత్ర సోమవారం ముంబై చేరుకుంది. వామపక్ష అనుబంధ ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో దాదాపు 35 వేల మంది రైతులు.. 180 కిలోమీటర్ల మేర.. సర్రున కాలుతున్న ఎండలో పాదయాత్ర నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది రైతులు ఇందులో పాల్గొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని, మద్దతు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలు చేయాలని తదితర డిమాండ్లతో రైతులు పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే.



మద్దతునిచ్చిన బాలీవుడ్ నటులు..

మహా యాత్ర చేపట్టిన రైతులకు బాలీవుడ్ సంఘీభావం తెలిపింది. బోర్డు పరీక్షలు జరుగుతున్న విద్యార్థులకు అంతరాయం కలుగకుండా అర్ధరాత్రి సైతం అడుగులో అడుగేస్తూ ఆజాద్ మైదానం చేరుకోవడం తమలో స్ఫూర్తి నింపిందని బాలీవుడ్ నటులు పేర్కొన్నారు. రైతుల స్ఫూర్తికి సలాం అంటూ రితేశ్ దేశ్‌ముఖ్, దియా మీర్జా, ఒనీర్, ప్రకాశ్‌రాజ్, మాధవన్, పూరీ జగన్నాథ్, సిద్ధార్థ బసు, శ్రుతి సేథ్, ప్రితీష్ నంది వంటి సెలబ్రిటీలు రైతులకు సంఘీభావం ప్రకటించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలగొద్దని..

దాదాపు 180 కిలోమీటర్లు సాగిన యాత్రలో ఎక్కడా విధ్వంసానికి అవకాశంఇవ్వకుండా క్రమశిక్షణ పాటించిన రైతులు ముంబై నగరానికి వచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ ప్రతిపాదనకు స్పందించిన తీరు కూడా అద్భుతం. ఆదివారం అర్ధరాత్రి సోమయ్య మైదానానికి చేరకున్న రైతులు సోమవారం ఉదయం పది గంటల ప్రాంతంలో విధాన భవన్‌ను ముట్టడించాల్సి ఉంది. అలా చేస్తే ఎక్కడికక్కడే ట్రాఫిక్ స్తంభించిపోయి టెంత్, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, అందుకుని ఆజాద్ మైదాన్‌కు వెళ్లాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. సోమయ్య మైదాన్ నుంచి ఆజాద్ మైదాన్‌కు మధ్య దూరం 18 కిలోమీటర్లు. దాంతో రైతులు అర్ధారాత్రి హుటాహుటిన ఆజాద్ మైదానానికి వెళ్లారు.

'దండి' సత్యాగ్రహం ప్రారంభంరోజే..!

దండి సత్యాగ్రహం.. మహాత్మాగాంధీ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభించిన మహోద్యమం. విస్తారంగా ఉప్పుపైనా పన్ను విధించడాన్ని నిరసిస్తూ.. 1930, మార్చి 12న గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి 80 మంత్రి సత్యాగ్రహులతో 390 కిలోమీటర్ల దూరంలోని 'దండి యాత్ర' ప్రారంభించారు. 24 రోజుల పాటు ఈ యాత్రను కొనసాగించారు. ఉప్పుపై పన్నును ఎత్తేసే వరకు ఈ ఉద్యమం కొనసాగింది. అయితే.. మహారాష్ట్ర రైతులు 180 కిలోమీటర్ల మేర పాదయాత్రగా మార్చి 12నే ముంబైకి చేరుకోవడం విశేషం.

సేమ్ సీన్!

పార్లమెంటులో ఆరో రోజూ రభస

- ఉభయ సభల్లో ఎంపీల ఆందోళన
- ప్రత్యేక హోదా కోసం టీడీపీ డిమాండ్
- పలు అంశాలపై వివిధ పార్టీల నిరసన
- గందరగోళం మధ్యే ఆర్థిక నేరగాళ్ల బిల్లు



న్యూఢిల్లీ, మార్చి 12: పార్లమెంటులో వరుసగా ఆరోరోజు సోమవారం ఆందోళనలు, నినాదాలతో హోరెత్తింది. ఉభయ సభల్లో పలు అంశాలపై వివిధ పార్టీలు నిరసన తెలపడంతో గందరగోళం నెలకొంది. సభ్యుల నినాదాలతో సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగింది. సభ్యులు శాంతించకపోవడంతో ఉభయ సభలను పలు మార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రత్యేక హోదా కోసం టీడీపీ ఎంపీలు, పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్, కావేరి నీటి సమస్యపై అన్నాడీఎంకే, ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్ ఆపాలని ఆప్ ఎంపీలు ఆందోళన బాటపట్టారు. సభ్యుల ఆందోళన మధ్యే కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా.. ఆర్థిక నేరాలకు పాల్పడి దేశం విడిచి పారిపోయిన నేరగాళ్లపై చర్యలకు బిల్లు-2018ను ప్రవేశపెట్టారు. దీనిప్రకారం బ్యాంకులకు రుణాలు ఎగవేసిన, పరారీలో ఉన్న వారి ఆస్తులన్నింటీ స్వాధీనం చేసుకుని, బకాయిలు వసూలు చేయవచ్చు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రుణం తీసుకుని, 12700 కోట్ల రూపాయలను ఎగవేసి వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే. అలాగే లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా బ్యాంకులకు దాదాపు 9 వేల కోట్ల రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయాడు. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును రూపొందించింది. 100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలు ఎగవేసి, విదేశాలకు పారిపోయిన వారిపై ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. అలాగే చిట్ ఫండ్స్ సవరణ బిల్లు-2018ను కూడా కేంద్రం ప్రవేశపెట్టింది. కాగా ఈ నెల 5న పార్లమెంటు బడ్జెట్ రెండో విడత సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఎంపీల నిరసనతో కార్యక్రమాలకు అంతరాయం కలుగుతున్న సంగతి తెలిసిందే. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమయ్యాక టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి తమ డిమాండ్లపై నినాదాలు చేయడంతో.. స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం సభ ప్రారంభమయ్యాక సభ్యులు ఆందోళనను కొనసాగించారు. నిరసనల మధ్యే శుక్లా రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభలోనే ఇదే పరిస్థితి నెలకొంది. మొదట మధ్యాహ్నం రెండు గంటలకు సభ వాయిదా పడింది. తర్వాత కూడా సభ్యులు ఆందోళన కొనసాగించడంతో మంగళవారానికి వాయిదా పడింది. ప్రత్యేక హోదా టీడీపీ, వైసీపీ.. కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటుకు అన్నాడీఎంకే.. ఆయా డిమాండ్లపై కాంగ్రెస్, టీఎంసీ, ఆప్ సభ్యులు నిరసనకు దిగారు. సభ్యులు వెనక్కి వెళ్లి వారి సీట్లలో కూర్చుకోవాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు సూచించినా, సభ్యులు శాంతించలేదు.

ఉత్తరప్రదేశ్‌లో భారీ సౌర విద్యుత్ ప్లాంట్

- జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మెక్రాన్



లఖ్‌నవ్, మార్చి 12: ఉత్తరప్రదేశ్‌లో అతిపెద్దదైన 75 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ సోమవారం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మీర్జాపూర్ జిల్లా వింధ్య పర్వతాల్లో దాదార్ కలాన్ గ్రామ సమీపంలో ఈ ప్లాంటును నిర్మించారు. ఫ్రాన్స్‌కు చెందిన ఇంజీ కంపెనీ సహకారంతో 500 కోట్ల రూపాయల వ్యయంతో దీన్ని నిర్మించారు. 380 ఎకరాల పరిధిలో 1,18,600 సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ నెలకు 1.30 కోట్ల యూనిట్ల చొప్పున ఏడాదికి 15.6 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ప్రారంభోత్సవంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ రామ్ నాయక్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) సదస్సులో మోదీ, మెక్రాన్ పాల్గొన్న సంగతి తెలిసిందే. ప్రపంచంలో సౌర విప్లవం రావాలని, సమ్మతమైన నిధులతో సౌర సాంకేతికత అందరికీ అందుబాటులోకి రావడానికి కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. దీనివల్ల తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని, పర్యవరణానికి హాని ఉండదని అన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 2022 నాటికి 175 గిగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని మోదీ వివరించారు. అంతర్జాతీయ సౌర కూటమి పథకంలో భాగంగా యూపీలో సౌర విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించారు. నాలుగు రోజుల పర్యటన కోసం ఫ్రాన్స్ అధ్యక్షుడు భారత్‌కు వచ్చిన సంగతి తెలిసిందే.



తమిళనాడు అడవుల్లో కార్చిచ్చు

- మంటల్లో చిక్కుకుని 9మంది మృతి
- 27మందిని కాపాడిన రెస్క్యూ టీం
- విచారణకు తమిళనాడు సీఎం ఆదేశం
- ఘటనపై కమల్‌హాసన్ దిగ్భ్రాంతి

చెన్నై, మార్చి 12: ఆహ్లాదాన్ని పంచే అడవి తల్లి గుండె భగ్గున మండింది. తమిళనాడులోని తేని జిల్లా కురంగణి అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రేగింది. చెన్నై ట్రెక్కింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పర్వతారోహణకు వెళ్లిన 36మంది ఈ మంటల్లో చిక్కుకున్నారు. వారిలో 9మంది ప్రాణాలు కోల్పోయినట్లు తేని జిల్లా కలెక్టర్ పల్లవి బల్దేవ్ వెల్లడించారు. ఘటనా స్థలిలో కొందరు, ఆసుపత్రిలో కాలిన గాయాలతో బాధపడుతూ మరికొందరూ చనిపోయారు. ట్రెక్కింగ్‌కు వెళ్లిన 36మందిలో ఐటీ ఉద్యోగినులు, కళాశాల విద్యార్థినులు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. 27మందిని రెస్క్యూ టీం కాపాడగలిగారు. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఘటన గురించి తెలిసిన వెంటనే అటవీ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. కేంద్ర రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశాలతో ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన నాలుగు హెలికాప్టర్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టారు. ఘటన రాత్రి సమయంలో జరగడంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం కలిగింది. గాయపడిన వారిని మదురైకి తరలించి చికిత్సనందిస్తున్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకూ ఈ అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌ను కేరళ ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధించింది. కురంగణి పర్వతాల్లో తరచుగా మంటలంటుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి విచారణకు ఆదేశించారు. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడటంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ప్రత్యేక చొరవ తీసుకుంది. గరుడ్ కమాండో ఫోర్స్‌కు చెందిన 16కమాండోస్, నాలుగు హెలికాప్టర్ల ద్వారా బాధితులను కాపాడే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని చెన్నై ట్రెక్కింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 24మంది మహిళలు, ఈరోడ్, తిరుప్పూర్ నుంచి 12మంది పర్వతారోహణకు వెళ్లినట్లు తేని జిల్లా కలెక్టర్ పల్లవి తెలిపారు.

బీజేపీలో చేరిన ఎస్పీ నేత నరేశ్ అగర్వాల్

రాజ్యసభ సీటు దక్కకపోవడమే కారణం

జయాబచ్చన్‌కు కేటాయించడంపై ఆగ్రహం

డ్యాన్స్‌లు చేసే ఆమెకు సీటిచ్చారని వ్యాఖ్య



లఖ్‌నవ్, మార్చి 12: సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ నరేష్ అగర్వాల్ భారతీయ జనతా పార్టీలో చేరారు. రైల్వే మంత్రి పీయూష్ గోషల్ సమక్షంలో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరపున సీటు దక్కే అవకాశం లేకపోవడంతో ఆయన పార్టీని వీడినట్లు తెలిసింది. సమాజ్‌వాదీ పార్టీ జయాబచ్చన్‌కు రాజ్యసభ సీటును కేటాయించింది. సమాజ్‌వాదీ పార్టీకి 47మంది ఎమ్మెల్యేల బలముంది. ఈ నేపథ్యంలో ఒక్క ఎంపీని మాత్రమే రాజ్యసభకు పంపేందుకు వీలుంది. అయితే సమాజ్‌వాదీ పార్టీ తీరును నరేశ్ అగర్వాల్ తీవ్రంగా తప్పుబట్టారు. జయాబచ్చన్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. సినిమాల్లో డ్యాన్స్‌లు చేసిన వ్యక్తి కోసం తనకు రాజ్యసభ టికెట్‌ను ఇచ్చేందుకు పార్టీ నిరాకరించిందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం తనను తీవ్రంగా బాధించిందని ఆయన చెప్పారు. ఎస్పీ తరపున ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తన కొడుకు నితిన్ కూడా తనతో పాటు బీజేపీలో చేరుతున్నట్లు నరేష్ అగర్వాల్ తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకే ఓటేస్తాడని కూడా ఆయన స్పష్టం చేశారు. తమపై నమ్మకాన్ని ఉంచినందుకు ప్రధాని మోదీకి, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షాకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నరేష్ అగర్వాల్ చెప్పారు. ఇదిలా ఉంటే, నరేష్ అగర్వాల్ బీజేపీలో చేరబోతున్నట్లు గత జనవరిలోనే ప్రచారం జరిగింది. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో అప్పట్లో నరేష్ అగర్వాల్ భేటీ అయ్యారు. అయితే ఆ తర్వాత అవన్నీ వదంతులేనని ఆయన కొట్టిపారేశారు.

జ్యుడీషియల్ కస్టడీకి కార్తీ

- ఈనెల 24 వరకు కస్టడీలోనే



న్యూఢిల్లీ, మార్చి 12: కేంద్ర ఆర్థికశాఖ మాజీమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని కోర్టు ఈనెల 24 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసును త్వరగా విచారించాలన్న కార్తీ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఇక కార్తీని తాము విచారించాల్సిన అవసరం లేదని సీబీఐ చెప్పడంతో ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ సీబీఐ ప్రత్యేక జడ్జి సునీల్ రాణా ఉత్తర్వులు ఇచ్చారు. తీహార్ జైల్లో తనకు ప్రత్యేక సెల్, రక్షణ కావాలని కార్తీ కోరగా.. జైలు మాన్యువల్ ప్రకారమే అన్నీ ఉంటాయని కోర్టు స్పష్టం చేసింది. షెడ్యూలు ప్రకారమే ఈనెల 15న కార్తీ బెయిల్ పిటిషన్ మీద విచారణ ఉంటుంది. తాను ఇంటి నుంచి భోజనం తెప్పించుకుంటానని కోరగా, అందుకు కోర్టు అంగీకరించలేదు. ఈ కేసు విచారణ జరిగినంతసేపు కార్తీ తండ్రి చిదంబరం కూడా కోర్టుహాల్లోనే ఉన్నారు. ప్రస్తుతం జైల్లోనే ఉన్న ఐఎన్ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్ ఇంద్రాణి ముఖర్జియా వాంగ్మూలం ఆధారంగానే కార్తీని లండన్ నుంచి రాగానే చెన్నై విమానాశ్రయంలోనే అరెస్టు చేశారు. కాగా.. ఈడీ కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న కార్తీ సీఏ భాస్కరరామన్.. ఐఎన్ఎక్స్ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయకుండా చూడాలని కోరుతూ ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆరు నెలల్లో పూర్తిచేయండి

- 2జీ కేసు విచారణపై సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 12: దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన 2జీ స్పెక్ట్రం కేటాయింపు కేసులు, దానికి సంబంధించిన ఇతర కేసులలో విచారణను ఆరు నెలల్లోగా పూర్తిచేయాలని సీబీఐ, ఈడీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. 2జీ కేసుతో పాటు.. దానికి అనుబంధంగా ఉన్న ఎయిర్‌సెల్-మాక్సిస్ ఒప్పందం కేసు తదితరాలకు సంబంధించి ఒక స్థాయీ నివేదికను సమర్పించాల్సిందిగా జస్టిస్ అరుణ్ మిశ్రా, నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు సుదీర్ఘ కాలం తీసుకుంటోందని, ఇలాంటి సున్నితమైన వ్యవహారాల్లో ప్రజలను చీకట్లో ఎక్కువకాలం ఉంచడం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 2014లో నియమించిన న్యాయవాది ఆనంద్ గ్రోవర్‌ను ఆ బాధ్యతల నుంచి విముక్తుడిని చేసింది.

ఉగాది నుంచి నాగార్జున, నాని సినిమా రెగ్యులర్ షూటింగ్



నాగార్జున, నాని హీరోలుగా వైజయంతి మూవీస్ పతాకంపై టి.శ్రీరామ్‌ఆదిత్య దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 18 ఉగాది రోజు నుంచి జరుగుతుంది. ఈ సందర్భంగా సి.అశ్వనీదత్ మాట్లాడుతూ ''మా వైజయంతి బేనర్‌లో మణిశర్మ చేసిన సినిమాలన్నీ మ్యూజికల్‌గా పెద్ద హిట్స్ అయ్యాయి. ఈ సినిమాని కూడా మ్యూజికల్‌గా బిగ్గెస్ట్ హిట్ చెయ్యాలని ఫుల్‌గా కాన్‌సన్‌ట్రేట్ చేస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఈ సినిమాలోని సాంగ్స్‌ని మణిశర్మ కంపోజ్ చేస్తున్నారు. మూడు పాటలకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ అక్కడ జరుగుతున్నాయి. మార్చి 18 ఉగాది రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం'' అన్నారు. దర్శకుడు టి.శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ ''ఎంటర్‌టైనింగ్ వేలో సాగే డిఫరెంట్ సబ్జెక్ట్ ఇది. నాగార్జునగారు, నాని వంటి హీరోలతో వైజయంతి బేనర్‌లో ఈ మల్టీస్టారర్ చెయ్యడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు.

'హాస్యనటబ్రహ్మ' బిరుదు ప్రదానం



మహబూబ్‌నగర్‌లో టీఎస్ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకతీయ కళా వైభవోత్సవం నిర్వహించారు. 1100 చిత్రాలు పూర్తి చేసుకున్న హాస్యనటుడు బ్రహ్మానందంకు సంస్థ ఆధ్వర్యంలో 'హాస్యనటబ్రహ్మ' బిరుదును ప్రదానం చేశారు. బ్రహ్మానందం చేతికి మధుసూధనాచారి బంగారు కంకణం తొడిగి వీణను, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''కాకతీయ కళా వైభవం కార్యక్రమాల ద్వారా కాకతీయుల కీర్తిని విశ్వవ్యాప్తం చేయడానికి సుబ్బరామిరెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు, ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ''తెలుగువారి సత్తాని అందరికీ తెలియజేస్తాను. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ కాకతీయ కళావైభవోత్సవాన్ని నిర్వహిస్తాను. బ్రహ్మానందం నటనకు జీవం పోస్తారు. ఆయన ఓ జీనియస్ నటుడు. 1100 చిత్రాల్లో నటించి రికార్డు సృష్టించిన గొప్ప నటుడు'' అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఇంకా ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి, ప్రణాళిక విభాగం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డితోపాటు వంశీచంద్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే బాబుమోహన్, పురపాలక ఛైర్‌పర్సన్ రాధ, జయప్రద, జీవిత, రాజశేఖర్, శ్రద్ధాదాస్, అలీ, శ్రీనివాస్‌రెడ్డి, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎల్లూరి శివారెడ్డి, గోరేటి వెంకన్న, జంగిరెడ్డి, నీరజాదేవి, పద్మాలయ ఆచార్య తదితరులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

'కిరాక్ పార్టీ'కి అదే హైలైట్ అవుతుంది

– అనీల్ సుంకర



నిఖిల్ హీరోగా ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. రామబ్రహ్మం సుంకర నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ అనీల్ సుంకర మాట్లాడుతూ ''సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. మేం అనుకున్న ఔట్ పుట్ వచ్చింది. 'కిరిక్ పార్టీ'ని రీమేక్ చెయ్యడానికి కారణం.. నాకు ఎప్పటి నుండో 'శివ' లాంటి సినిమా ఉంది. 'కిరిక్ పార్టీ' దానికి దగ్గరగా అనిపించడంతో రీమేక్ చేసేందుకు రెడీ అయ్యాను. చాలా మంది ఇంజనీరింగ్ చెయ్యడానికి పల్లెటూరి నుంచి సిటీకి వస్తారు. మొదటి సంవత్సరం ఎంతో బిడియంగా కనిపించే కుర్రాళ్ళు ఫైనల్ ఇయర్‌కి వచ్చేసరికి పూర్తిగా మారిపోతారు. ఈ క్రమాన్ని గతంలో ఏ సినిమాలోనూ చూపించలేదు. అదే ఈ సినిమాకి హైలైట్ పాయింట్ అవుతుంది. ఈ సినిమాని నిఖిల్, శరణ్ కాంబినేషన్‌లో చేసేందుకు కిరిక్‌పార్టీని నిఖిల్‌కి చూపించాను. అతనితోపాటు సుధీర్‌వర్మ, చందూ మొండేటి కూడా వచ్చారు. సినిమా చూసి చాలా ఇంప్రెస్ అయ్యారు. శరణ్ వారిద్దరి దగ్గర గతంలో పనిచేయడం వల్ల ఈ సినిమాకి సంబంధించి ఎలాంటి హెల్ప్ కావాలన్నా చేస్తామని చెప్పారు. అలా సుధీర్, చందు ఈ సినిమాలో భాగమయ్యారు. కిరిక్ పార్టీ నిడివి 2 గంటల 45 నిమిషాలు. దాన్ని 2 గంటల 25 నిమిషాలకు తగ్గించాం. రన్ టైమ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ సినిమాలో నిఖిల్ తప్ప దాదాపు అందరూ కొత్తవారే. ఫ్రెష్‌నెస్ కోసం కొత్తవారిని తీసుకోవడం జరిగింది'' అన్నారు.

ఆపన్నులకు మనం సైతం చేయూత

ప్రముఖ నటుడు, సామాజిక సేవకుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న



మనం సైతం రోజు రోజుకూ తన సేవా సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటోంది. మనసున్న ఎంతో మంది మనం సైతంలో భాగమవుతున్నారు. తమకు వీలైనంత విరాళాలు అందిస్తున్నారు. మరోవైపు మనం సైతంను ఆశ్రయిస్తున్న ఆపన్నుల సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతోంది. వాటిలో అత్యవసరంలో ఉన్న వాళ్లను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందిస్తోంది మనం సైతం. అలాంటి కొంతమందికి శనివారం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వి.వి.వినాయక్, నిర్మాత సి.కళ్యాణ్, దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి, శ్రీమిత్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న డ్రైవర్ యూనియన్ రాజు, లైట్‌మెన్ కూతురు అనూజ, నటుడు ధమ్ కుమారుడు బాబు, దర్శకత్వశాఖలో పనిచేస్తున్న ఉదయ్‌కాంత్ సహా పదిమందికి చెక్‌లను అందించారు. అనంతరం కాదంబరి కిరణ్ మాట్లాడుతూ '' మనం సైతం ఇంతింతై విస్తరిస్తోంది. ఈరోజు వినాయక్‌గారు, కళ్యాణ్‌గారిలాంటి వాళ్లు మా సంస్థను దీవించడానికి వచ్చినందుకు కృతజ్ఞతలు'' అన్నారు. వి.వి. వినాయక్ మాట్లాడుతూ ''మనం సైతం కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు కాదంబరి కిరణ్‌కు కృతజ్ఞతలు. ఇదొక గొప్ప కార్యక్ర మం. మనం సైతం సేవను కిరణ్ తన జీవితంలో భాగం చేసుకున్నారు. నా సహాయ సహకారాలు మనం సైతంకు ఎప్పుడూ ఉంటాయి'' అన్నారు.

ప్రభాస్ సరసన పూజా



గత ఏడాది విడుదలైన 'దువ్వాడ జగన్నాథమ్' చిత్రం.. కథానాయిక పూజా హెగ్డే దశ, దిశను మార్చివేసింది. ఈ చిత్రం పుణ్యమా అని.. వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలను దక్కించుకుంటోంది ఈ పొడుగు కాళ్ళ సుందరి. ఇప్పటికే రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం'లో ప్రత్యేక గీతంలో నర్తించిన ఈ డీజే భామ.. తాజాగా మహేశ్, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. అలాగే ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో రూపుదిద్దుకోబోతున్న చిత్రంలోనూ ఈమే కథానాయిక. అంతేగాకుండా.. 'సాహో' తర్వాత ప్రభాస్ నటించబోయే చిత్రంలోనూ పూజా హీరోయిన్‌గా నటించనుందని ఆ మధ్య వార్తలు వినిపించాయి. తాజాగా ఈ విషయాన్ని ఓ నేషనల్ మీడియా పోర్టల్ ద్వారా కన్‌ఫర్మ్ చేసింది పూజా. 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని గోపికృష్ణ మూవీస్ నిర్మించనుంది. వేసవి నుంచి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్తుంది. ఈ చిత్రానికి 'దందా' అనే టైటిల్ పరిశీలనలో ఉంది.


వరుణ్‌కి జోడీగా...



● అదితిరావ్

'ఫిదా', 'తొలిప్రేమ' చిత్రాలతో వరస విజయాలను అందుకున్న యువ కథానాయకుడు వరుణ్ తేజ్. ప్రస్తుతం ఈ యంగ్ హీరో 'ఘాజీ' దర్శకుడు సంకల్ప్ రెడ్డితో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అంతరిక్ష నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఇద్దరు కథానాయికలకు స్థానముండగా.. వారిలో ఒకరిగా బాలీవుడ్ బ్యూటీ అదితిరావ్ హైదరీ ఎంపికయ్యిందని వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే అదితి ఎంపికపై అధికారిక సమాచారం వెలువడుతుంది. ప్రస్తుతం అదితి.. ఇంద్రగంటి మోహనకృష్ణ రూపొందిస్తున్న 'సమ్మోహనం' చిత్రంలో నాయికగా నటిస్తోంది. అలాగే మణిరత్నం రూపొందిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'నవాబ్'లోనూ ఓ హీరోయిన్‌గా నటిస్తోంది.

సీనియర్ నటులు వంకాయల ఇకలేరు



సీనియర్ సినీనటుడు వంకాయల సత్యనారాయణ (78) కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యతో కొంత కాలంగా బాధపడుతున్న ఆయన సోమవారం కన్ను మూశారు. వంకాయల సత్యనారాయణ అనేక చిత్రాల్లో క్యారెక్టర్ నటుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. పలు సీరియల్స్‌లోనూ నటించారు. తెలుగుతోపాటు తమిళం, మూడు హిందీ చిత్రాల్లో నటించారు. 'సీతామాలక్ష్మి', 'సూత్రధారులు', 'అత్తవారిల్లు', 'శ్రీనివాస కల్యాణం', 'ఊరికిచ్చిన మాట', 'శుభలేఖ', 'శ తిలయలు', 'విజేత'.. ఇలా దాదాపు 180 చిత్రాల్లో నటించారు. చివరగా గత ఏడాది విడుదలైన 'కారందోశ' సినిమాలో కన్పించారు. నటనతోపాటు 'వంకాయల జ్యూయలర్స్' పేరుతో వైజాగ్‌లో ఆయన ఓ నగల షాపును కూడా నడుపుతున్నారు. సత్యనారాయణ 1940లో విశాఖపట్నంలోని చవలవారి వీధిలో జన్మించారు.

'అనువంశికత' ఆడియో ఆవిష్కరణ



● సంతోష్‌రాజ్, నేహా దేశ్‌పాండే

సంతోష్‌రాజ్, నేహా దేశ్‌పాండే జంటగా కౌండిన్య మూవీస్ పతాకంపై రమేష్ ముక్కెర దర్శకత్వంలో తాళ్లపెల్లి దామోదర్‌గౌడ్ నిర్మిస్తోన్న చిత్రం 'అనువంశికత'. జెనిటిక్ లవ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. అశ్విత, క్రాంతి కుమార్ సమర్పకులు. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ''రక్త సంబంధీకులను పెళ్లి చేసుకుంటే వచ్చే పరిణామాలు ఎలా ఉంటాయి అనే పాయింట్‌ను ఆధారంగా చేసుకుని దర్శకుడు చక్కగా సినిమా చేశాడు. మంచి సందేశాత్మక చిత్రమిది. పాటల్లో కూడా మంచి సందేశం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది. బడ్జెట్ విషయంలో నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు'' అని అన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ''పాటలు బాగున్నాయి. సినిమా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని అన్నారు. చిత్ర నిర్మాత తాళ్లపెల్లి దామోదర్ గౌడ్ మాట్లాడుతూ ''సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. మా తొలి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు. దర్శకుడు రమేష్ ముక్కెర మాట్లాడుతూ ''సినిమా కోసం టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. నటీనటులు, సాంకేతిక నిపుణులు మంచి సహకారం అందించారు. పాటలు, సినిమా పెద్ద విజయం సాధిస్తాయి'' అని అన్నారు.

'మిఠాయి' మొదటి షెడ్యూల్ పూర్తి



● శ్వేతావర్మ

రెడ్ యాంట్స్ పతాకంపై కమల్ కమరాజు, రవివర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి శ్వేతావర్మ, భూషణ్ కళ్యాణ్, అజయ్ ఘోష్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న డార్క్ కామెడీ చిత్రం 'మిఠాయి'. ప్రశాంత్‌కుమార్ దర్శక నిర్మాణంలో సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాతో పరిచయమవుతున్న అర్ష పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. దర్శక నిర్మాత ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ''వికారాబాద్‌లో వేసిన స్పెషల్ సెట్‌లో లిబరేషన్ సాంగ్‌ను చిత్రీకరించాం. దీంతో ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యింది. ఈ నెల 17న సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. 'పెళ్ళిచూపులు' ఫేమ్ వివేక్ సాగర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం విశేషం. డార్క్ కామెడీ జోనర్‌లో విభిన్నమైన క్యారెక్టర్స్ నడుమ సాగే సినిమా ఇది. త్వరలోనే సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలను తెలియజేస్తాం'' అన్నారు.


'ఊళ్లో పెళ్లికి..' పాటల సందడి



రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో జె.బి.క్రియేషన్స్ పతాకంపై శ్రీమతి భాగ్యలక్ష్మి నిర్మించిన సినిమా 'ఊ.పె.కు.హ'. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి అనేది కాప్షన్. సాక్షి చౌదరి కథానాయిక. 'నిధి' ప్రసాద్ దర్శకుడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో సోమవారం హైదరాబాద్‌లో విడుదలైంది. బిగ్ సీడీని జెమిని కిరణ్ విడుదల చేశారు. ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ ''అనూప్ రూబెన్స్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అందుకు అనూప్‌కి థాంక్స్. తర్వలోనే విడుదల తేదిని ప్రకటిస్తాం'' అన్నారు. అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ ''ఇంతకు ముందు నిధి ప్రసాద్‌గారు వర్క్‌చేసిన సినిమాకు నేను కీ బోర్డ్ ప్లేయర్‌గా పనిచేశాను. ఆయన అడగ్గానే మ్యూజిక్ అందించాను. ఈ సినిమా హిట్ అయ్యి నిధి ప్రసాద్‌గారు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. జెమిని కిరణ్ మాట్లాడుతూ ''సినిమా యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ''సాధారణంగా చిన్న సినిమా, పెద్ద సినిమా అని అంటుంటారు. నా సినిమాను చిన్న సినిమా అన్న ప్రతిసారి పెద్ద వసూళ్లను సాధించాయి. నిధి ప్రసాద్ చక్కగా సినిమా తీశాడు. భాగ్యలక్ష్మి, విక్రమ్ సినిమాను చక్కగా నిర్మించారు. తప్పకుండా సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. సాక్షి చౌదరి మాట్లాడుతూ ''అనూప్ చాలా మంచి మ్యూజిక్ అందించారు. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది'' అన్నారు.

సస్పెండ్ చేసినా వెనుకాడొద్దు

పోరాటం ఉధృతం చేయండి.. లక్ష్యం నెరవేరేదాకా నిరసన



- ఎంపీలదే పూర్తి బాధ్యత
- వైసీపీ బండారం బయటపెట్టండి
- వాళ్ల ముసుగు తొలగించాలి
- మోదీ మీద నమ్మకం ఉంటే... అవిశ్వాస తీర్మానం ఎందుకు?
- వైసీపీకి చంద్రబాబు సూటి ప్రశ్న
- టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్

అమరావతి, మార్చి 12 (మనం ప్రతినిధి): పార్లమెంటులో పోరాటం ఉధృతం చేయాలని, సస్పెండ్ చేసినా వెనుకాడొద్దని టీడీపీ ఎంపీలకు టీడీజీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ''ప్రత్యేక హోదాపై తెలుగుదేశం వైఖరి స్పష్టంగా ఉంది. రాష్ట్ర హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రజల మనోభావాలను కాపాడండి. లక్ష్యం నెరవేరేదాకా పార్లమెంటులో పోరాటం, నిరసనలు కొనసాగించాలి. కేంద్రం విభజన చట్టం హామీలు పూర్తిగా అమలు చేయాలి. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. రాష్ట్ర సమస్యల పరిష్కారమే మనకు ముఖ్యం'' అని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. రెండు రోజుల విరామం అనంతరం సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా చంద్రబాబు.. టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఉభయ సభల్లో ప్రస్తావించాలని కేంద్ర మాజీ మంత్రులు అశోక్ గజపతిరాజు, వై.ఎస్.చౌదరిని కోరారు. రాజీనామాలపై సభలో ప్రకటన చేస్తున్న సమయంలోనే రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి, నాలుగేళ్లలో పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు కాకపోవడం, అప్పటి ప్రధాని హామీలు నెరవేర్చక పోవడాన్ని ప్రస్తావించాలని సూచించారు. ''నిన్నటిదాకా స్పెషల్ అసిస్టెన్స్ మెజర్ అన్నారు. ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) అంటున్నారు. కేంద్రానికి ఎందుకీ డొంక తిరుగుడు?'' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. నిధుల మంజూరుకు సులభ మార్గం ఉండగా.. క్లిష్టమార్గాలు ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించారు.

రాజీనామాలే.. ఆందోళనకు పరాకాష్ట

''పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను తొలిరోజు నుంచి స్తంభింప చేస్తున్నాం. అయినా ఫలితం లేకపోవడంతోనే కేంద్రం నుంచి వైదొలిగాం. మంత్రి పదవులకు రాజీనామాలు చేయడమే మన ఆందోళనలకు పరాకాష్ట. ఇంకా కేంద్రం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం మినహా ప్రత్యామ్నాయం లేదు. దశలవారీగా పోరాటం ఉధృతం చేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం, ప్రత్యేక హోదా సాధనే మన లక్ష్యం. ఇది చాలా కీలక సమయం. మీరంతా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎంపీలపైనే పూర్తి బాధ్యత ఉంది'' అని చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

వైసీపీవి ద్వంద వైఖరి విధానాలు

వైసీపీ ద్వంద వైఖరి విధానాల బండారాన్ని బయట పెట్టి, ప్రజల్లో వాళ్లు వేసుకున్న ముసుగు తొలగించాలని చంద్రబాబు ఎంపీలకు సూచించారు. ఇండియా టుడే టీవీ ఛానల్‌లో వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా చంద్రబాబు ప్రస్తావించారు. 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తారన్న విశ్వాసం ప్రధాని నరేంద్రమోదీపై ఉంది' అని విజయసాయిరెడ్డి డిబేట్‌లో పేర్కొనడాన్ని గుర్తు చేశారు. నరేంద్ర మోదీపై వైసీపీకి అంత విశ్వాసం ఉన్నప్పుడు.. ఇంకా అవిశ్వాసం ఎందుకు..? రాజీనామాలు ఎందుకు..? అని ముఖ్యమంత్రి చంద్రబాబు.. వైసీపీని సూటిగా ప్రశ్నించారు. ''ఒకవైపు కేంద్రంపై విశ్వాసం అంటారు, మరోవైపు అవిశ్వాసం అంటారు. ఈ డొంక తిరుగుడు ఏమిటి?'' అంటూ జగన్‌పై చంద్రబాబు ధ్వజమెత్తారు.

ప్రజల మనోభావాలు ప్రతిబింబించాలి

పార్లమెంటులో ఎంపీలు చేసే ప్రసంగాల్లో ప్రజల మనోభావాలు ప్రతిబింబించాలని చంద్రబాబు సూచించారు. సుజనా చౌదరి మాట్లాడుతూ.. రాజ్యసభలో నోటీసు ఇచ్చానని, సోమ, మంగళవారాల్లో సభలో ప్రకటన చేసే అవకాశం వస్తుందని, తమ రాజీనామాకు దారితీసిన పరిస్థితులను, రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి సభలో వివరించనున్నట్లు తెలిపారు. పార్లమెంటుకు సెలవు దినాలైన శని, ఆది వారాల్లో తిరుపతి, చిత్తూరు పర్యటనల్లో డప్పు ప్రచారం ద్వారా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజలను చైతన్యపరిచానని, ఢిల్లీలో తన నిరసనను ప్రతిరోజూ కళారూపాల ద్వారా ప్రదర్శిస్తుంటే మంచి స్పందన వస్తోందని చిత్తూరు ఎంపీ శివప్రసాద్ పేర్కొనగా.. ముఖ్యమంత్రి అభినందించారు. సభ లోపల, వెలుపల కేంద్రంపై ఒత్తిడి చేయడమే గాకుండా ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత టీడీపీ ఎంపీలపై, నాయకులపైన ఉందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కూడా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై, కేంద్రం నుంచి అరకొర సాయంపై మాట్లాడాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ లోక్‌సభ పక్ష నేత తోట నరసింహం, రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తదితరులు మాట్లాడారు.

స్వామిగౌడ్ త్వరగా కోలుకోవాలి

తెలంగాణ శాసనమండలిలో జరిగిన సంఘటనలను మీడియా ప్రతినిధులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. మైకు విరగొట్టి విసరివేయడంతో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలి గాయమైందని ఆయనకు తెలిపారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. కన్నుకు దెబ్బ తగిలిందని, స్వామిగౌడ్ త్వరగా కోలుకుంటారని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

బడి ఎగ్గొడితే ఫెయిలవుతారు!

జేసీపై చంద్రబాబు వ్యంగ్యాస్త్రం

'బడి ఎగ్గొడితే ఫెయిలవుతారు.. జాగ్రత్త' అంటూ సీఎం చంద్రబాబునాయుడు ఎంపీ జేసీ దివాకర్ రెడ్డిపై సెటైర్ వేశారు. ఈ ఆసక్తికర ఘటన అమరావతి అసెంబ్లీ లాబీలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే... ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలు వాడీవేడీగా జరుగుతున్నాయి. ఏపీకి చెందిన టీడీపీ ఎంపీలంతా ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో ఆందోళనను తీవ్రతరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, సీఎంను కలిసేందుకు సోమవారం అసెంబ్లీకి వచ్చారు. సీఎంను కలిసేందుకు ఆయన చాంబర్ వైపుకు వెళ్తుండగా, లాబీల్లో ఆయనే జేసీకి ఎదురయ్యారు. దీంతో చంద్రబాబు, జేసీని చూసి.. 'బడి ఎగ్గొడితే ఫెయిలవుతారు' అంటూ పార్లమెంట్ సమావేశాలకు హాజరుకాకపోవడంపై సెటైర్ వేశారు. ఈ మాట విన్న జేసీ నవ్వుతూ.. చంద్రబాబుతో మాట్లాడేందుకు లోపలికి వెళ్లారు. చంద్రబాబుతో సమావేశం ముగిసిన అనంతరం జేసీ లాబీలో ఉన్న విలేకరులతో మాట్లాడారు. తాను ఎప్పుడూ ఫెయిల్ కానని.. బడి ఎగ్గొట్టిన వారు, వెనుక బెంచీలో కూర్చున్న వారే ఉన్నత స్థానాలకి ఎదిగారని జేసీ అనడంతో లాబీల్లో ఉన్నవారంతా సరదాగా నవ్వుకున్నారు.



పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న టీడీపీ ఎంపీలు

టీడీపీకి అడ్వకేట్ కావాలనే.. రవీంద్రకు రాజ్యసభ సీటు


పార్లమెంటులో అన్ని పార్టీలకూ అడ్వకేట్లు ఉన్నారని.. ఒక్క తెలుగుదేశం పార్టీకే లేరని టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అడ్వకేట్ కావాలనే కనకమేడల రవీంద్రకుమార్‌కు రాజ్యసభ సీటు ఇచ్చామని చంద్రబాబు వివరించారు. సోమవారం ఆయన టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి వెళుతూ.. అసెంబ్లీ లాబీల్లో ఉన్న మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కనకమేడల రవీంద్రకుమార్ 20 ఏళ్ల నుంచి పార్టీకి సేవ చేస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. ఆయన సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పార్టీకి సంబంధించిన పలు కేసులు వాదిస్తున్నారని చెప్పారు. పార్టీ పట్ల విధేయత, అలాగే పార్టీకి చేసిన సేవ కారణంగానే రవీంద్రకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చామని వెల్లడించారు. విభజన హామీలపై న్యాయ పోరాటం చేసేందుకు కూడా రవీంద్రకుమార్ లాంటి వ్యక్తులు రాజ్యసభలో అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. మరో అభ్యర్థి సీఎం రమేష్ కూడా పార్టీ పట్ల విధేయుడేనని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజ్యసభలో సీఎం రమేష్ పోరాటం చేశారని గుర్తు చేశారు.

ఫేసియల్ రికగ్నేషన్ ద్వారా రేషన్

అమరావతి, మార్చి 12(మనం ప్రతినిధి): ఈ-పోస్, ఐరిష్ మిషన్లతో పాటు త్వరలో ఫేసియల్ రికగ్నేషన్(ముఖం గుర్తుపట్టే) మిషన్ ద్వారా పేదలకు రేషన్ పంపిణీ చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వృద్ధుల్లో వేలిముద్రలు పడక ఇబ్బంది పడేవారికి ఈ విధానం ఎంతో ఉపకరిస్తుందని ఆయన చెప్పారు. అసెంబ్లీలో సోమవారం చంద్రబాబు ఈ విషయాన్ని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని ఆయన చెప్పారు. చంద్రన్న విలేజ్ మాల్స్‌ను ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన సరుకులు అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా దాదాపు 50 లక్షల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. వాటన్నింటిని ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడంతో ఎలాంటి అవకతవకలు లేకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఉపకారవేతనాల్లో అక్రమాలు లేకుండా ఆన్‌లైన్ చేశామని, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

సినీ నటుడు వంకాయల ఇకలేరు

- శ్వాస పరమైన అనారోగ్యంతో మృతి
- సినీ, నాటక రంగ ప్రముఖుల నివాళి
- నేడు విశాఖపట్నంలో అంత్యక్రియలు



విశాఖపట్నం, మార్చి 12 (మనం న్యూస్‌బ్యూరో): విశాఖ నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు వంకాయల సత్యనారాయణ మూర్తి(78) సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నాలుగు రోజులుగా శ్వాసపరమైన సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సర్క్యూట్ హౌస్‌కు సమీపంలోని టీచర్స్ అపార్ట్‌మెంట్‌కు ఆయన పార్థివదేహాన్ని తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1940లో విశాఖలో జన్మించిన ఆయన రంగస్థల నటుడిగా మంచి గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలో ప్రవేశించి అక్కడ కూడా గొప్ప నటుడిగా పలు పాత్రల్లో మెప్పించారు. మొత్తం 184 సినిమాల్లో ఆయన నటించారు. నీడలేని ఆడది, సీతామహాలక్ష్మి, సూత్రధారులు, అత్తవారిల్లు, శ్రీనివాస కళ్యాణం, సాగరసంగమం తదితర చిత్రాల్లో నటించారు. చిత్ర పరిశ్రమ, రంగస్థలంపై తనదైన ముద్ర వేశారు. సినిమాల్లో మంచి అవకాశాలు లభించినప్పటికీ విశాఖపై మమకారంతో ఆయన ఇక్కడే స్థిరపడ్డారు. విశాఖ రంగస్థలానికి ఆయన ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. పది రోజుల క్రితం కూడా కళాభారతిలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇటీవలే కళాభారతిలో ఆయనకు ఘన సన్మానం జరిగింది. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తూ పలువురికి సినిమాల్లో అవకాశాలు చూపించారు. వంకాలయ మృతి పట్ల పలువురు సినీ, నాటక రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వంకాయల సత్యనారాయణ మూర్తి అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు. పలువురు ప్రముఖులు వంకాయల పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.

ప్రాజెక్టులు కట్టి తీరుతాం

- ఫ్లోరైడ్ భూతాన్ని తరిమిమేస్తాం
- కాంగ్రెస్ వల్లే ఈ దుస్థితి
- బాధితుల కన్నీళ్లు తుడుస్తాం
- ఫ్లోరైడ్‌కు శాశ్వత పరిష్కారం చూపుతాం
- మునుగోడు సభలో మంత్రి కేటీఆర్



చండూరు/నల్గొండ, మార్చి 12(మనం న్యూస్): మునుగోడు నియోజకవర్గాన్ని పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ భూతాన్ని తరిమేసి బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. మునుగోడు ప్రగతి సభను సోమవారం చండూరులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతగాని అసమర్థ కాంగ్రెస్ పార్టీ వల్లే ఫ్లోరైడ్ భూతం విజృంభించిందని ఆరోపించారు. ఆనాడే కేసీఆర్ సిద్ధిపేటలో ఇంటింటికి నీళ్లు ఇచ్చారన్నారు. రాష్ట్రమంతటా ఇంటింటికి కుళాయిల ద్వారా నీటిని అందిస్తామని, లేకుంటే ఓట్లు అడగనన్న దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ కొనియాడారు. మునుగోడులో ఉపరితలంలో నీరు పారించి ఫ్లోరైడ్‌కు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నేతలకు పిచ్చిలేచిందని, అధికారం కోసం దిగజారి ప్రవర్తిస్తున్నారన్నారని కేటీఆర్ మండిపడ్డారు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వనంటే ఎవ్వరూ మాట్లాడలేదన్నారు. తెలంగాణ వాళ్లకు పరిపాలన రాదని కిరణ్‌కుమార్ రెడ్డి అవహేళన చేస్తే సిగ్గులేకుండా నోరు మూసుకున్నారని కాంగ్రెస్ నేతలపై మంత్రి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ వాళ్లు రైతులను కాల్చి చంపారని, ఇప్పుడు నాటకాలు ఆడుతూ రైతు జపం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఏం చేయలేదో కాంగ్రెస్ నేతలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బస్సు యాత్ర తలపెట్టి కాంగ్రెస్ నేతలు సర్కస్ ఫీట్లు చేస్తున్నారని, ప్రజల్లో అభాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. చేనేతకు చేయూతను ఇస్తూ కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొస్తుంటే కాంగ్రెస్ నేతలకు కడుపు మండుతుందన్నారు. ప్రతి ఊరిలో అర్హులందరికి పెన్షన్‌లు అందిస్తున్నామని, రాష్ట్రంలో 42 లక్షల మందికి 5,500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. సర్కార్ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఘనత టీఆర్ఎస్‌దే అన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన దాడికి జానారెడ్డి ఏం సమాధానం చెబుతారని, ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దండు మల్కాపురంలో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని, చౌటుప్పల్‌ను మున్సిపాలిటీగా గుర్తించేందుకు కృషి చేస్తానన్నారు. మరికొద్ది రోజుల్లో గట్టుప్పల్ మండలంగా ఏర్పడుతుందన్నారు. విద్యుత్, షెడ్యూల్ కులాల అభివద్ది శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, తెలంగాణ యువతకు స్ఫూర్తి కేటీఆర్ అని మంత్రి కొనియాడారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరువుకాటకాలతో వెనుకబడిన మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి సహకరిస్తుందన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు.



రాజ్యసభకు టీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): రాజ్యసభ ఎన్నికలకు టీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. జోగినపల్లి సంతోష్ కుమార్ రావు, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాష్ ముదిరాజ్‌ను రాజ్యసభ అభ్యర్థులుగా సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించారు. నామినేషన్ దాఖలుకు ముందు సోమవారం ఉదయం అసెంబ్లీ నుంచి గన్‌పార్కు వరకు ర్యాలీ చేశారు. అక్కడ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి తిరిగి అసెంబ్లీకి వచ్చారు. అక్కడ శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులకు మూడు సెట్ల నామినేషన్ దరఖాస్తు పత్రాలను వారు సమర్పించారు.

బలరాం నాయక్ నామినేషన్ దాఖలు

కాంగ్రెస్ తరపున రాజ్యసభకు కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుడైన తనకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వటం అభినందనీయమన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలకతీతంగా తనను బలపర్చాలని కోరారు.

నిజాయితీ నిరూపించుకోండి: చాడ

హైదరాబాద్, మార్చి 12(మనం ప్రతినిధి): పార్టీ ఫిరాయింపుదారుల రాజీనామాలను నెలలు, ఏళ్ల తరబడి స్పీకర్ అట్టిపెట్టుకోవడం స్పీకర్ పదవికే కళంకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ఫిరాయింపుదారుల సభ్యత్వాలను రద్దు చేసి, తన నిజాయితీని నిరూపించుకోవాలని సీఎం కేసీఆర్‌కు చాడ హితవు పలికారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ దండును తయారు చేసుకుంటున్న కేసీఆర్, రాజకీయాల్లో నీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.



10 రోజుల్లో వెబ్‌సైట్లపై నివేదిక ఇవ్వండి

- ప్రధాన కార్యదర్శి జోషి ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 12, (మనం ప్రతినిధి): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల వెబ్‌సైట్లపై 10 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ వెబ్‌సైట్లు, పోర్టల్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ శాఖలకు సంబంధించి 265 వెబ్‌సైట్లు (పోర్టల్) ఉన్నాయని వాటి నిర్వహణ, సమాచార ఆధునీకరణ, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మేర నిబంధనల అమలు, అధునాతన టెక్నాలజీ వినియోగం, మొబైల్ ఫ్రెండ్లీ విధానం తదితర అంశాలతో నివేదికను రూపొందించాలని జోషి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఐటీ శాఖ ఐటీ సర్వీస్ ప్రొవైడర్‌గా పనిచేయాలన్నారు. అవసరమైతే ఇందుకు సీజీజీ సహకారాన్ని తీసుకోవాలన్నారు. వెబ్‌సైట్ల నిర్వహణ, సమాచారం అప్‌డేషన్‌కు సంబంధించి ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలు ప్రతి వెబ్‌సైట్లలో ఉండవలసిన అంశాల టెంప్‌లేట్, వివిధ శాఖల సర్వీసుల వివరాలు, అవసరమైన సిబ్బంది, బడ్జెట్, వెండర్ ఎంపిక తదితర అంశాలు నివేదికలో ఉండాలన్నారు.

హోదా కోసం మోదీని నిలదీయలేని దద్దమ్మ పార్టీ.. వైసీపీ


- ఆస్తులు, కేసులపైనే వైఎస్ జగన్ దృష్టి
- నవ్యాంధ్రను విడగొట్టేందుకు బీజేపీ కుట్ర
- మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



అమరావతి, మార్చి 12 (మనం ప్రతినిధి): ఏపీకి ప్రత్యేక హోదా కావాలని ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయలేని చేతకాని, దద్దమ్మ పార్టీ వైసీపీ అని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. జగన్‌కు కేసులు, తన కుటుంబం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయాలను నవ్వులపాలు చేస్తోందని అన్నారు. వేర్పాటువాదంతో బీజేపీ మరోసారి నవ్యాంధ్రను విడగొట్టడానికి కుట్ర పన్నుతోందని మంత్రి ఆరోపించారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే సిగ్గేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ రాష్ట్రాభివృద్ధికి తపనపడుతుంటే.. జగన్ తాను, తన కేసులు, ఆస్తులు అంటూ రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. ఢిల్లీలో పైరవీలు, లాభీయింగ్ చేసే బాధ్యత ఎంపి విజయసాయిరెడ్డికి జగన్ అప్పగించారని మంత్రి ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారని చెప్పారు. హోదా ఇవ్వబోమని కేంద్ర ప్రభుత్వం ఖరాకండీగా చెబుతుంటే, మోదీని నిలదీయలేని చేతగాని, దద్దమ్మ పార్టీ వైసీపీ.. చంద్రబాబును టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడమేమిటని సోమిరెడ్డి ప్రశ్నించారు. బీజేపీ-టీడీపీ బంధం తెగిపోతే, కమలం పార్టీతో తాము జతకడతామని వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ నిసిగ్గుగా ప్రకటించారన్నారు. ఒక ఓటుకు రెండు రాష్ట్రాలంటూ బీజేపీ మరోసారి ఏపీని విడగొట్టడానికి కుట్ర పన్నుతోందని మంత్రి మండిపడ్డారు. రాయలసీమకు అన్యాయం జరిగిందంటూ బీజేపీ నేతలు మొసలి కన్నీరుకారుస్తున్నారని విమర్శించారు.

సెన్సెక్స్ మార్చి 12 2018

33,917.94



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతీ ఎయిర్‌టెల్	4.68	కోల్ ఇండియా	-2.26
ఎన్‌టీపీసీ	4.33	ఎస్‌బిఐ	-0.12
ఐటీసీ	4.09		
టాటా మోటార్స్	3.07		
టాటా స్టీల్	2.82		

నిఫ్టీ మార్చి 12 2018

10421.40




పెరిగినవి	%	తగ్గినవి	%
భారతీ ఎయిర్‌టెల్	4.82	కోల్ ఇండియా	-2.10
వేదాంత	4.36	అరబిందో	-1.62
ఐటీసీ	4.19	ఐడియా సెల్యులర్	-0.44
ఎన్‌టీపీసీ	4.11	ఎస్‌బిఐ	-0.16
హిందాల్కో	3.38		

టాప్ గైనర్స్ 12 మార్చి


33,917.94
610.80 బి.ఎస్.ఇ సెన్సెక్స్

పాయింట్లు		%
420.75	భారతీ ఎయిర్‌టెల్	4.68%
171.00	ఎన్‌టీపీసీ	4.33%
270.00	ఐటీసీ	4.09%
352.20	టాటా మోటార్స్	3.07%
622.70	టాటా స్టీల్	2.82%
3685.80	హీరో మోటోకార్ప్	2.75%
519.20	యాక్సిస్ బ్యాంకు	2.74%
300.70	ఐసీఐసీఐ బ్యాంకు	2.73%
311.45	యస్ బ్యాంకు	2.64%
386.05	అదానీ పోర్ట్స్	2.32%

బులియన్ | గత 7 రోజులు




రూపాయి వర్సెస్ డాలర్



కాలరెగరేసిన సూచీలు

ఒక్కరోజులో 611 లాభపడిన సెన్సెక్స్



సెన్సెక్స్ 33,900 పాయింట్ల స్థాయిని అందుకోగా, నిఫ్టీ 10,400 పాయింట్లకు ఎగసింది

ముంబయి: అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఆశావాదంతో, వాణిజ్య యుద్ధ భయాలు తగ్గుముఖం పట్టగా, గ్లోబల్ రిలీఫ్ ర్యాలీ ఇచ్చిన ఊతంతో బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజి (బి.ఎస్.ఇ) సున్నిత సూచి సోమవారం ఏకంగా 611 పాయింట్లు లాభపడి 33,917.94 పాయింట్ల వద్ద ముగిసింది. రెండేళ్ళ కాలంలో 'సెన్సెక్స్' ఒకే రోజులో ఇన్ని పాయింట్లను కూడగట్టుకోవడం ఇదే మొదటిసారి. మదుపరులు ఇటీవల ఘోరంగా దెబ్బతిన్న లోహాలు, ఆయిల్, గ్యాస్, ఎఫ్.ఎం.సి.జి, బ్యాంకింగ్, విద్యుచ్ఛక్తి, మౌలిక వసతులు, ఐ.టి. ఆటో, మూలధన వస్తువుల రంగ షేర్లను ఉత్సాహంగా కొనుగోలు చేశారు. విదేశీ ఫండ్లు స్టాక్ మార్కెట్లలోకి కొత్తగా నిధులు ప్రవహింపజేశాయి. 'సెన్సెక్స్' సోమవారం పటిష్టమైన స్థితిలో మొదలై దేశీయ పండ్లు, రిటైల్ ఇన్వెస్టర్లు జరిపిన తాజా కొనుగోళ్ళతో 33,962.48 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసింది. అయితే, తర్వాత కొన్ని పాయింట్లను వదులుకున్నప్పటికీ, మొత్తానికి 610.55 పాయింట్ల లాభంతో ఒక వారం అత్యధిక స్థాయి 33,917.94 పాయింట్ల వద్ద ముగిసింది. 'సెన్సెక్స్' ఒక దశలో 777.35 పాయింట్లు పెరిగి, 2016 మార్చి 1 తర్వాత, ఒకే రోజులో అత్యధిక లాభ స్థితిని నమోదు చేసింది.

దూసుకెళ్ళిన కంపెనీలు

రూ. 16,500 కోట్ల రుణ రీఫైనాన్సింగ్‌కి, స్పెక్ట్రమ్ భారాల చెల్లింపునకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలుపడంతో భారతీ ఎయిర్‌టెల్ 'సెన్సెక్స్' కంపెనీల్లో అన్నింటికన్నా అత్యధికంగా 4.68 శాతం లాభపడింది. జి.ఎస్.టి కౌన్సిల్ సమావేశంలో సిగరెట్లపై రేట్లను మార్చకుండా అలానే ఉంచడంతో ఇండెక్స్‌లోని మరో అగ్ర కంపెనీ ఐ.టి.సి 4.09 శాతం పెరుగుదలను చూసింది. ఎన్.టి.పి.సి 4.33 శాతం లాభపడింది. ఎన్.టి.పి.సి లిమిటెడ్ ప్రతిపాదిత సీనియర్ అన్‌సెక్యూర్డ్ అమెరికన్ డాలర్ల నోట్‌లకు మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ బిఏఏ2 రేటింగ్ ఇవ్వడంతో దాని షేర్ ధర చకచక పెరిగింది. దేశీయ పాసింజర్ వాహనాల అమ్మకాలు 7.77 శాతం పెరిగి ఫిబ్రవరిలో 2,75,329 యూనిట్లుగా నమోదవడంతో మోటారు వాహనాల రంగ షేర్ల ధరలు పెరిగాయి.

నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజి (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా సోమవారం 194 పాయింట్లు పుంజుకుని 10,421.40 పాయింట్ల వద్ద ముగిసింది. యాభై కంపెనీల షేర్ల హెచ్చు తగ్గులను ప్రతిబింబించే 'నిఫ్టీ'లో 47 కంపెనీల షేర్ల ధరలు లాభాలతో ముగిసాయి. ఇంట్రా-డేలో అది 10,433.65 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ''దృఢమైన గ్లోబల్ సంకేతాలు, దేశీయ ద్రవ్యోల్బణం సడలి 4.74 శాతంగా ఉండగలదనే ఊహలు మదుపరులను ఉత్తేజపరచి బేరం జరపడానికి ఉన్న అవకాశాన్ని వినియోగించుకునేట్లు చేశాయి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయం కూడా కొద్దిగా ప్రభావం చూపినా, అమెరికా పేరోల్ డాటాలో పెరుగుదల అక్కడి ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని సూచించింది. అది గ్లోబల్ ట్రేడ్‌ను పెంపొందించింది'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లో పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. అమెరికా ఉద్యోగాల నివేదిక సానుకూలంగా ఉండడంతో ఆసియన్, యూరోపియన్ మార్కెట్లు గత వారాంతపు ర్యాలీని కొనసాగించాయి.

తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: చౌకధరకు ఆహార వస్తువులు, తగ్గిన ఇంధన వ్యయంతో రిటైల్ ద్రవ్యోల్బణం 2018 ఫిబ్రవరిలో 4 నెలల కనిష్ఠ స్థాయి 4.44 శాతానికి తగ్గింది. వినియోగ వస్తువుల ధరల సూచిపై ఆధారపడిన రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది జనవరిలో 5.07 శాతంగా ఉంది. అది 2017 ఫిబ్రవరిలో 3.65 శాతంగా ఉంది.

ఐ.ఐ.పి వృద్ధి 7.5 శాతం



న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 2018 జనవరిలో అత్యధిక రేటులో 7.5 శాతంగా ఉంది. అది 2017 జనవరిలో 3.5 శాతంగా మాత్రమే ఉంది. వస్తూత్పత్తి రంగం చక్కని పనితీరు కనబరచడంతోపాటు, వినియోగ, మూలధన వస్తువుల కొనుగోళ్ళు అధికంగా ఉండడంతో పారిశ్రామిక ఉత్పత్తిలో వృద్ధి కనిపించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐ.ఐ.పి) 2017 డిసెంబరులో 7.1 శాతం వృద్ధి చెందిందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సి.ఎస్.ఓ) సోమవారం విడుదల చేసిన డాటా వెల్లడించింది. సూచిలో 77.63 శాతం ఆక్రమిస్తున్న వస్తూత్పత్తి రంగం ఉత్తేజం వల్ల ఈ ఏడాది జనవరిలో ఐ.ఐ.పి వృద్ధి సాధ్యపడింది. అది 2017 జనవరిలో 2.5 శాతం ఉండగా 2018 జనవరిలో 8.7 శాతానికి పెరిగింది. దీన్ని ఆర్థిక వ్యవస్థలోని రికవరీకి సూచనగా భావిస్తున్నారు. పెట్టుబడుల నాడిని తెలిపే యంత్రాలు, యంత్ర పరికరాల ఉత్పత్తిలో 2018 జనవరిలో ఏకంగా 14.6 శాతం వృద్ధి కనిపించింది. అది 2017 జనవరిలో 0.6 శాతంగా మాత్రమే ఉంది. వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల ఉత్పత్తి కూడా 9.6 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. మన్నికైన వినియోగ వస్తువుల ఉత్పత్తి వృద్ధి రేటు ఏడాది క్రితం ఉన్న 2 శాతం నుంచి 2018 జనవరిలో 8 శాతంగా నమోదెంది. గనుల తవ్వక రంగంలో వృద్ధి మాత్రం 8.6 శాతం నుంచి 0.1 శాతానికి తగ్గింది. వస్తూత్పత్తి రంగంలోని 23 పరిశ్రమల గ్రూపులలో 16 గ్రూపులు సానుకూల వృద్ధిని కనబరచాయి. ఐ.ఐ.పి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి కాలంలో 4.1 శాతం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అది 5 శాతంగా ఉంది.

JSW Steel
Bringing alive a billion dreams

వంద కోట్ల డాలర్ల సేకరణకు సిద్ధమవుతున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్

న్యూఢిల్లీ: డాలర్ డినామినేటెడ్ సీనియర్ నోట్‌లు జారీ చేయడం ద్వారా నిధులు సమీకరించాలని భావిస్తున్నట్లు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సోమవారం వెల్లడించింది. ''మార్కెట్ పరిస్థితులను బట్టి, అమెరికన్ డాలర్ డినామినేటెడ్ సీనియర్ నోట్‌ల రూపంలో రుణ సాధనాలు జారీ చేయాలని కంపెనీ ఆలోచిస్తోంది'' అని బి.ఎస్.ఇకి జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తెలిపింది. రుణ సెక్యూరిటీలు లేదా బాండ్లను సీనియర్ నోట్లు అంటారు. ఒకవేళ కంపెనీ దివాలా తీస్తే, ముందు సీనియర్ నోట్‌లకు చెల్లించి, ఆ తర్వాతే ఇతర అన్‌సెక్యూర్డ్ నోట్‌ల చెల్లింపు జరుపుతారు. ప్రాథమిక ఆఫరింగ్ సర్క్యులర్ తయారు చేశామని, ఈ ఇష్యూ లేదా నోట్‌లలో మదుపు చేసేందుకు అవకాశం ఉన్నవారికి దాన్ని అందుబాటులో ఉంచుతామని కంపెనీ తెలిపింది. ఈ నోట్‌లను ఇండియాలో ఆఫరు చేయడంకానీ, అమ్మడంకానీ చేయబోవడం లేదని వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్లో ఒకే విడతలో లేదా నాలుగైదు విడతల్లో వంద కోట్ల అమెరికన్ డాలర్ల దీర్ఘకాలిక నిధులను నాన్-కన్వర్టిబుల్ విదేశీ కరెన్సీ/రూపాయి డినామినేటెడ్ సీనియర్ అన్‌సెక్యూర్డ్ ఫిక్సెడ్ రేట్ బాండ్ల ద్వారా సేకరించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు గత ఏడాది మే నెలలో ఆమోదం తెలిపింది.

ప్రతి చర్యలతో వృద్ధికి విఘాతమే



న్యూఢిల్లీ: ఉక్కు, అల్యూమినియంపై సుంకాలు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం, యూరోపియన్ యూనియన్ (ఇ.యు), చైనాల నుంచి ప్రతి చర్యలకు దారితీసి, వాణిజ్య యుద్ధాన్ని రేకెత్తించి, ప్రపంచ ఆర్థిక వృద్ధిని దెబ్బతీసే అవకాశం ఉందని ఎస్ అండ్ పి గ్లోబల్ రేటింగ్స్ సోమవారం పేర్కొంది. మొత్తంమీద, అమెరికా విధించిన సుంకాల ఆర్థిక ప్రభావం సమీప కాలంలో పరిమితంగా ఉండవచ్చని, కార్పొరేట్ రంగాలపై మిశ్రమ ప్రభావం పడవచ్చని వెల్లడించింది. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను వరుసగా 25 శాతం, 10 శాతం పెంచుతూ అమెరికా గత వారం నిర్ణయం తీసుకుంది. వర్తక నిపుణుల ప్రకారం, అమెరికాకు ఈ వస్తువుల ఎగుమతులపై ఆ నిర్ణయం ప్రభావం చూపకపోవచ్చు. అయితే, అటువంటి సంరక్షణవాద చర్యలు ప్రపంచ వర్తకంపై ప్రభావం చూపవచ్చని వారు భయాలు వ్యక్తం చేశారు. 'నాలుగు రోడ్ల కూడలిలో అంతర్జాతీయ వర్తకం: పెరిగిన ప్రతీకార చర్యల రిస్కు' పేరుతో ఆ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. ఈ సుంకాల ప్రత్యక్ష లేదా మొదటి విడత స్థూల ఆర్థిక ప్రభావం ఉపేక్షించ దగినదిగానే ఉండవచ్చని, మొత్తంమీద ప్రభావం అంత కచ్చితంగా ఉంటుందని చెప్పలేమని ఆ నివేదిక పేర్కొంది. అయితే, ఇ.యు, చైనా, దక్షిణ కొరియా లాంటి అమెరికాకు చెందిన ఇతర ప్రధాన వాణిజ్య భాగస్వాములు ఎలా స్పందిస్తాయనే దానిపైనే అదంతా ఆధారపడి ఉంటుందని నివేదిక తెలిపింది. అనేక అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలు ట్రంప్ ప్రకటన పట్ల తమ ఆందోళనపై ఇప్పటికే సంకేతాలిచ్చాయి. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై స్వీయ టారిఫ్‌లు విధించడం ద్వారా ఎదురు దాడికి సిద్ధంగా ఉన్నామని కూడా అవి ప్రకటించాయని రేటింగ్ ఏజన్సీ గుర్తు చేసింది. ''వినియోగదార్లు, వ్యాపార సంస్థల విశ్వాసంపై పడడానికి అవకాశం ఉన్న రెండవ విడత ప్రభావాల సామర్థ్యం ఎక్కువ ముఖ్యమైంది. అంతిమంగా అది జి.డి.పిని వెనక్కి లాగవచ్చు'' అని ఎస్ అండ్ పి పేర్కొంది. ''పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధం సంభవిస్తుందని మేమూ అనుకోవడం లేదు. కానీ, అటువంటి అవకాశాన్ని తోసిపుచ్చలేం కూడా. అమెరికా సుంకాలు, దాని వాణిజ్య భాగస్వాములు దండన, ప్రతీకారేచ్ఛతో విధించే ప్రతి సుంకాలకు దారితీయవచ్చు. దానివల్ల సంక్షేమం దెబ్బతింటుందని తెలిసినా, అవి ప్రతి చర్యలకు ఉపక్రమించవచ్చు'' అని ఎస్ అండ్ పి రేటింగ్స్ ఆర్థికవేత్త పాల్ గ్రుయెన్‌వాల్ చెప్పారు. ఈ సుంకాల హెచ్చింపు అమెరికాలో ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తిని, వినియోగ స్థాయిలను పెంచవచ్చు. దేశీయంగా ధరలు వచ్చే 2-3 ఏళ్ళలో హెచ్చు స్థాయిల్లో ఉండేట్లు చేయవచ్చు.

దశ తిరిగిన రిఫ్రాక్టరీ పరిశ్రమ



న్యూఢిల్లీ: ఇటీవలి కాలం వరకు 'చనిపోతున్న పరిశ్రమ'గా పరిగణన పొందిన, దేశీయ రిఫ్రాక్టరీ తయారీదార్లకు, చైనా దిగుమతుల ధరలు ఒక్కసారిగా పెరగడం వల్ల, హఠాత్తుగా దశ ఎత్తుకుంది. ఎంతో వేడికి కాని కరగని పదార్థం రిఫ్రాక్టరీ. ఇంతకుముందు, పూర్తయిన ఉత్పత్తులతోపాటు, రిఫ్రాక్టరీ ఇటుకలకు అవసరమైన ముడి పదార్థాలలో దాదాపు 40 శాతం (మాగ్నసైట్, గ్రాఫైట్, ఫ్యూజ్డ్, కాల్సినెడ్ అల్యూమినా, హైగ్రేడ్ క్లేలు వంటివి) ముడి పదార్థాలను చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అయితే, చైనా గనుల తవ్వకంపై విరుచుకుపడి, కఠినమైన కాలుష్య నియంత్రణ నిబంధనలు ప్రవేశపెట్టడంతో, ముడి పదార్థాల సరఫరాపై ప్రభావం పడింది. దీంతో దేశీయ రిఫ్రాక్టరీ మేకర్లపైకి ఫోకస్ మళ్ళిందని ఇండియా ఇంటర్నేషనల్ రిఫ్రాక్టరీస్ కాంగ్రెస్ (ఐరెఫ్‌కాన్) చైర్మన్ పర్మోద్ సాగర్ చెప్పారు.

లోహాలు, సిమెంటు, గాజు, సిరమిక్స్ తయారీలో అత్యధిక ఉష్ణోగ్రతతో కూడిన ప్రక్రియలన్నింటికీ రిఫ్రాక్టరీ ఉత్పత్తులు చాలా కీలకం. రిఫ్రాక్టరీ ఉత్పత్తులకున్న పెద్ద వినియోగదార్లలో ఉక్కు పరిశ్రమ ఒకటి. మొత్తం రిఫ్రాక్టరీ ఉత్పత్తుల్లో దాదాపు 60-70 శాతం ఉక్కు పరిశ్రమకే వెళతాయి. ''ఒక ఏడాది క్రితం వరకు కూడా రిఫ్రాక్టరీని చనిపోతున్న పరిశ్రమగానే పరిగణించారు. ప్రతి ఒక్కరూ దాన్ని ఉపేక్షిస్తూ వచ్చారు. కానీ, ఈ చైనా అంశంతో, ఉక్కు, సిమెంటు తయారీకి అవసరమైన ఉత్పత్తిగా రిఫ్రాక్టరీని చూసే దృక్పథంలో మార్పు వచ్చింది'' అని సాగర్ చెప్పారు. ఉక్కు పరిశ్రమలో రిఫ్రాక్టరీ కీలకమైన భాగం అయినప్పటికీ, ప్రభుత్వ ఉక్కు విధానంలో దాని ప్రస్తావన ఎప్పుడోగానీ కనిపించదని ఆయన అన్నారు.

రేగిన ధరలు


రిఫ్రాక్టరీ ఉత్పత్తుల ధరలు 30-50 శాతం పెరుగుదలను చేస్తే, వివిధ కేటగిరీలకు చెందిన ముడి పదార్థాల ధరలు 10-150 శాతం పెరిగాయి. రూ. 6,500 కోట్ల దేశీయ రిఫ్రాక్టరీ పరిశ్రమ గత మూడు నుంచి ఐదేళ్ళ కాలంలో ధరలను 'గణనీయంగా' పెంచిన సందర్భాలు లేవు. కొద్దో గొప్పో ధరలను పెంచినా, దాన్ని ఇంతవరకు వినియోగదార్లకు విజయవంతంగా బదలీ చేయగలుగుతూ వచ్చింది. అయితే, ధరలు ఇక ఏమాత్రం పెరిగినా నిర్వహణ కష్టమే అవుతుందని సాగర్ చెప్పారు.

గనుల తవ్వక విధానం అవసరం

భారతదేశంలో ప్లాంట్‌లు నెలకొల్పేట్లుగా ప్రోత్సహించేందుకు, మెరుగైన గనుల తవ్వక విధానంతో కేంద్రం రిఫ్రాక్టరీ పరిశ్రమపై దృష్టి కేంద్రీకరించవలసి ఉంది. దేశంలో ముడి పదార్థాల పరిశోధన, అభివృద్ధికి నిధులు కేటాయించాలని సాగర్ కోరారు. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు రిఫ్రాక్టరీకి అవసరమైన ముడి పదార్థాలపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

ఓర్పు వహించకపోతే ఇబ్బందులే

సవరించిన ఎన్.పి.ఎ పరిష్కార నిబంధనావళిని సడలించాలని ఆర్.బి.ఐకి విజ్ఞప్తి చేసిన బ్యాంకులు



ముంబయి: 'స్ట్రెస్సడ్ ఎసెట్ల' పరిష్కారానికి సవరించిన నిబంధనావళిని సడలించవలసిందిగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ)కి ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. రుణం తిరిగి చెల్లించడంలో ఒక్క రోజు జాప్యం చేసినా సహించకపోవడమనే బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థ వైఖరి, ప్రభుత్వానికి ప్రాధాన్యతా రంగంగా ఉన్న మౌలిక వసతుల రంగానికి రుణాల మంజూరుకు తీవ్ర భంగం కలిగించవచ్చని పేర్కొంది. రుణాన్ని తిరిగి చెల్లించడంలో ఒక్క రోజు జాప్యం జరిగినా భారీ రుణాల కేంద్ర సమాచార భాండాగారం (సి.ఆర్.ఐ.ఎల్.సి)కి ఆ రుణ ఎగవేత ఖాతా గురించి నివేదించడంలో బ్యాంకులకు ఎలాంటి అభ్యంతరం లేదని అసోసియేషన్ వెల్లడించింది. (ఎగవేత చోటుచేసుకున్న మొదటి రోజున కాకుండా) రుణ పునర్నిర్మాణంతో ముడిపడిన ఖాతా పరిష్కార ప్రక్రియ 60 రోజుల తర్వాత మొదలు కావాలని మాత్రమే తాము కోరుతున్నామని అసోసియేషన్ స్పష్టం చేసింది. 'స్ట్రెస్సడ్ ఎసెట్ల' పరిష్కారానికి సవరించిన నిబంధనావళిని ఫిబ్రవరి 12న ప్రకటించారు. దానిలో ఎగువ పేర్కొన్న సడలింపును తీసుకురావలసిందని కోరడానికి కారణం మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు విచిత్రంగా నగదు ప్రవాహ సమస్యలను ఎదుర్కొంటూండడమేనని లేదా వాటికి రావలసిన బకాయిలలో జాప్యాలు చోటుచేసుకుంటూండడమేనని అసోసియేషన్ వివరించింది. ''సాధారణంగా కొన్ని కంపెనీలు (అసలు లేదా వడ్డీ చెల్లింపులో) 3-40 రోజుల జాప్యం చేస్తూంటాయి. కానీ, తర్వాత, రుణ ఖాతాను క్రమబద్ధం చేస్తాయి. కనుక, అవి 'నయం' కావడానికి 60 రోజుల గడువు ఇవ్వాలి. అవి 60వ రోజున కూడా ఏమీ చెల్లించలేక, ఖాతాను క్రమబద్ధం చేసుకోకపోతే, అప్పుడు పునర్నిర్మాణాన్ని ప్రారంభించవచ్చు'' అని ఉన్నత స్థాయి ప్రభుత్వ రంగ బ్యాంకర్ ఒకరు చెప్పారు.

ఎగవేసిన మొదటి రోజునే పునర్నిర్మాణ ప్రక్రియను మొదలెడితే, ఖాతా స్థాయిని వెంటనే తగ్గించి, నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) కేటగిరీలోకి

సహనం చూపండి

తొలుతటి స్ట్రెస్సడ్ ఎసెట్ రిజల్యూషన్ స్కీముల కింద ఇప్పటికే చేపట్టిన ఖాతాల పునర్నిర్మాణ విషయంలో, పునర్నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసేందుకు 180 రోజులు సహనం చూపవలసిందిగా అసోసియేషన్ కోరింది. స్ట్రెస్సడ్ ఆస్తుల పరిష్కార సవరించిన నిబంధనావళి కింద ఒక ఖాతా ఎన్.పి.ఏగా పరిణమిస్తే, దాన్ని అప్‌గ్రేడ్ చేయడం దాదాపు అసాధ్యం కనుక మేం ఓర్పు వహించవలసిందని కోరుతున్నాం. నూతన మార్గదర్శక సూత్రాల కింద, అసలులో కనీసం 20 శాతం తిరిగి చెల్లిస్తే తప్పించి ఖాతాను అప్‌గ్రేడ్ చేయడానికి లేదు. దానికి కనీసం 3-4 ఏళ్ళు పడుతుంది. కనుక ఖాతా అప్‌గ్రేడింగ్ కుదరని అంశంగానే మిగిలిపోతుంది'' అని ఆ బ్యాంకర్ పేర్కొన్నారు.

చేర్పాల్సి ఉంటుందని, దానివల్ల ప్రొవిజనింగ్ పర్యవసానాలు ఏర్పడతాయని అసోసియేషన్ తెలిపింది. 'స్ట్రెస్సడ్ ఎసెట్ల' పరిష్కారానికి సంబంధించి పూర్వపు ఆదేశాలన్నింటినీ ఆర్.బి.ఐ రద్దు చేసి, వాటి స్థానంలో సవరించిన నిబంధనావళిని తెచ్చింది. ఓర్పు ముఖ్యంగా ఒకప్పటి వ్యూహాత్మక రుణ పునర్నిర్మాణ (ఎస్.డి.ఆర్) పథకం కింద చేపట్టే పునర్నిర్మాణ ఖాతాల విషయంలో అవసరమని బాంయకర్లు అభిప్రాయపడుతున్నారు.

''ఉదాహరణకు, ఎస్.డి.ఆర్ పథకం కింద, స్ట్రెస్సడ్ కంపెనీ రుణాన్ని రుణ దాతలు ఈక్విటీగా మార్చేశారనుకుందాం. ఇంతకుముందైతే, అలా మార్చిన తర్వాత, ఆ పథకం కింద మేనేజ్‌మెంట్ మారడానికి 12 నెలల వ్యవధి ఉండేది. కానీ, స్ట్రెస్సడ్ ఆస్తుల పరిష్కారానికి సంబంధించి అన్ని పథకాలను మార్చి 1 నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్.బి.ఐ హఠాత్తుగా ప్రకటించింది. ఆ ఖాతాలు ఎన్.పి.ఏలుగా పరిణమిస్తాయని పేర్కొంది'' అని మరో బ్యాంకర్ చెప్పారు.

ఆర్థిక వృద్ధి అంచనాలు

ఆర్థిక సర్వే 2018-19 ఆర్థిక సంవత్సరంలో జి.డి.పి వృద్ధి 7-7.5 శాతంగా ఉండగలదని అంచనా వేసింది. దేశం 8 శాతంపైనే వృద్ధి సాధించే బాటలో దేశం ఇప్పుడు స్థిరంగా సాగుతోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రంగంలో కూడా పేర్కొన్నారు. బ్యాంకులు మౌలిక వసతుల కల్పన రంగానికి చేయూత నిస్తేనే, ఆ అంచనాలు వాస్తవ రూపం ధరిస్తాయని బ్యాంకర్లు అంటున్నారు. దీని కోసం, నియంత్రణదారు దాని మార్గదర్శక సూత్రాల విషయంలో కొంత సడలింపు నివ్వాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు. ''మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు అంతర్గతంగా జాప్యాల రిస్కును ఎదుర్కొంటూ ఉంటాయి. ఎందుకంటే, వాటి ఫలాలు రావడానికి చాలా కాలం పడుతుంది. ఈలోగా ఏమైనా జరగవచ్చు. చాలా సందర్భాల్లో, ఈ జాప్యం (చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వడంలో జాప్యాల వంటివి) ప్రభుత్వం వైపు నుంచే ఉంటోంది తప్ప, ప్రమోటర్ వైపు నుంచి కాదు. కనుక, ఈమాత్రమైనా ఆర్.బి.ఐ సహనం చూపకపోతే, మౌలిక వసతుల కల్పన రంగానికి రుణా లివ్వడం బ్యాంకులకు కొద్ది రిస్కుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుంది. మౌలిక వసతుల కల్పన రంగానికి రుణాలు సమకూర్చడంలో ప్రభుత్వం తీవ్ర సమస్యను ఎదుర్కోవచ్చు'' అని ఆ ఉన్నత స్థాయి ప్రభుత్వ రంగ బ్యాంకర్ వివరించారు.

ఆర్థిక వృద్ధిని, సమాజ సంక్షేమాన్ని మెరుగుపరచేందుకు మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి భారతదేశానికి 2040 వరకు దాదాపు 4.5 ట్రిలియన్ల డాలర్ల విలువైన పెట్టుబడి అవసరమవుతుందని ఆర్థిక సర్వేలో తెలిపారు. ప్రస్తుత ధోరణి ఆ 4.5 ట్రిలియన్ల డాలర్లలో దాదాపు 3.9 ట్రిలియన్ల డాలర్లు మాత్రమే సమకూరవచ్చని సూచిస్తోంది.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 13 మార్చి 2018



వసుధపై వసంతం వికసించిన తొలిరోజు ఉగాది. ఆరు రుచుల్లోని అంతరార్థాన్ని జీవితానికి అన్వయించుకుంటూ జరుపుకునే విశిష్ట పండుగ ఇది. కాలాన్ని గణిస్తూ మారుతున్న రుతువులకు అనుగుణంగా ఆరోగ్యాన్ని రక్షించుకోవడమే పండుగ పరమార్థం.

అచ్చతెలుగు ఉగాది

వర్షాదౌ నింబకుసుమం శర్క రామ్ల
ఘృతైరుత్యం
భక్షితం సర్వయామేచ తద్వరం
సౌఖ్యదాయకం
శతాయుర్వజ్ర దేహాయ సర్వసంపత్కరాయచ
సర్వారిష్ట వినాశాయ నింబకుసుమ భక్షణం

అని జీవితానికి పనికి వచ్చే సందేశాన్ని తెలియజేస్తూ ఆశీర్వదిస్తోంది ఉగాది. ఈ రోజున మనం చేసే అన్ని పండుగ కృత్యాల్లో ఆరోగ్య నియమాలు దాగివున్నాయి. ఆ నియమాలు పాటించడం వల్ల మనస్సు, బుద్ధి, ఇంద్రియాలకు ఆహ్లాదం, చైతన్యం కలుగుతాయి.

ఉగాది వచ్చే సమయాన్ని ఆయుర్వేదంలో ఆదాన కాలంగా పరిగణిస్తారు. రుతు సంధిషు వ్యాధిర్జాయతే... అన్నట్లు రుతువుల మధ్య సంధి కాలాలు ఎప్పుడూ అనారోగ్యాల్ని కలిగిస్తాయి. ఆ అనారోగ్యం నుంచి రక్షించుకునేందుకు ఈకాలంలో వసంత నవరాత్ర దీక్షలు వస్తాయి. పండుగనాటి ఉదయం చేసే అభ్యంగన స్నానంలోనూ ఆరోగ్య రహస్యాలు దాగివున్నాయి. ఆరురుచుల సమ్మేళనంతో తయారుచేసే ఉగాది పచ్చడి విశిష్టత చర్విత చర్వణమే. అయినా కొత్త సంవత్సరంలా ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది.

ఔషధ గుణాల సమ్మేళనం



ఉగాది పచ్చడిలో వాడే ముఖ్యమైన పదార్థాలన్నీ శరీరంలో సమతూకాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందింపజేస్తాయి. రుతువులు మారినప్పుడల్లా ఆహారంలో కొన్ని నియమాలు పాటించాలి.. అది కూడా ఉగాది నుంచే మొదలుపెట్టాలని మన పెద్దలు సూచించారు.

ఉగాది పచ్చడికి నింబకుసుమ భక్షణం, అశోక కళికా ప్రాశనం అని పేర్లు. ప్రాచీన కాలం నుంచి ఉగాది పచ్చడిని సేవించే ఆచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఉగాది పచ్చడి తయారీలో వైద్య విజ్ఞానం దాగివుంది. ఉగాది పచ్చడిని కేవలం సంప్రదాయ దృష్టితో కాకుండా ఆరోగ్య రక్షణ కోసం అందరూ సేవించాలి.

ఉగాది పచ్చడిలో ప్రధానంగా ఆరు రుచులకు ఆరు పదార్థాలు చేరుస్తారు. బెల్లం, మిరియాలు, ఉప్పు, చింతపండు, వేపపువ్వు, మామిడి ప్రధానమైనవి. ఇవి వరుసగా తీపి, కారం, ఉప్పు, పులుపు, చేదు, వగరులు అనే ఆరురుచులకు ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆహార ధాన్యాలన్నీ అప్పుడే కొత్తగా వస్తాయి కాబట్టి వాటిని ఉగాది పచ్చడిలో వేసిన తర్వాత వాటిని వాడుకోవడం తెలుగువారి ఆచారం.

తినేముందు...

త్వామష్టశోక నరాభీష్ఠ మధుమాస సముద్భవ
నిచామిశోక సంతప్తాం మమశోకం సదాకురు

ఉగాది పచ్చడి సేవించేటప్పుడు ఈ శ్లోకం పఠించాలని శాస్త్రవచనం. చైత్రశుద్ధ పాడ్యమి అంటే ఉగాది నుంచి పౌర్ణమి వరకు పదిహేనురోజుల పాటు ఉగాది పచ్చడిని సేవిస్తే వివిధ వ్యాధులనుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. సంవత్సరం పొడవునా జీవితంలో ఏర్పడే కష్టనష్టాలు, సుఖసంతోషాలను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలనే తాత్త్విక సందేశం ఉగాది పచ్చడిలో ఉంది. ఆరురుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలో బెల్లాన్ని ఆనందానికి సంకేతంగా భావిస్తారు. ఉప్పు ఉత్సాహానికి, చేదు సహన గుణం అలవరుచుకోవడానికి, పులుపు నేర్పును నేర్పడానికి, వగరు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, కారం ధైర్యానికి చిహ్నాలని మనవారు చెబుతారు.





మానవుడు నిప్పు తెలుసుకున్నాక నాలుకకు రుచులు అలవాటు చేశాడు. అయితే పచనం చేయని ఆహారం నిప్పుపై ఉడికించని, వేయించని ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. పచ్చికూరగాయల వంటివి ఏడాదిపొడవునా తినలేనివారికి ప్రకృతి వైద్యవిధానాన్ని అలవాటు చేసేందుకు ఉగాది పచ్చడి ఉపయోగపడుతుంది. అయితే ఉగాది పచ్చడిని ఎప్పుడూ పరగడుపున సేవించాలి. అంటే పండుగపూట ముందుగా తలస్నానం పూర్తిచేయాలి. ఇష్టదేవతా పూజచేసి పచ్చడిని నివేదన చేయాలి. అప్పుడు ఇంటిలోని వారంతా ఉగాది పచ్చడిని సేవించాలి. అప్పటివరకూ మంచినీరు తప్ప మరేదీ తినకూడదు. తాకకూడదు అని నియమం. ఉగాది పచ్చడిని అలా సేవించడం వల్ల అది ఔషధ ప్రాయంగా పనిచేస్తుంది.

– డాక్టర్ కె. పూర్ణప్రజ్ఞాభారతి

క్రీస్తు సందేశం

ధవళ సింహాసనం



ప్రియ శిష్యులు యెరూషలేం దేవాలయాన్ని చూచి ఆ ఆలయ నిర్మాణాన్ని అభినందింపగా యేసు రాయిపై రాయి నిలువని దినాలు వస్తాయి. ఈ దేవాలయం నేల కొరుగుతుంది అని పలికాడు. అందుకు శిష్యులు ఇవన్నీ ఎప్పుడు జరుగుతాయి? ముందుగా కనిపించే సూచనలేంటి? అని అడిగారు. వారితో ప్రభువు ఇలా చెప్పాడు. రాజ్యం మీదికి రాజ్యం లేస్తుంది. కరువు కాటకాలు కలుగుతాయి. అకాలాలు సంభవిస్తాయి. అశుభాలు కలుగుతాయి. గొఱ్ఱె చర్మం ధరించే మాయా ప్రవక్తలుంటారు. మోసపు భక్త పరులుంటారు. వారు క్రూరమైన తోడేళ్ళ వంటివారు. యూదులు రొమ్ముకొట్టుకుంటూ పరుగెడ్తారు. ఆకాశంలో మరింకెన్నో వింతలు కనబడతాయి. అవి కష్టదినాలు.

ఒక చోట ఇద్దరుండగా ఒకడు కనపింపడు. ఒకడు రక్షింపబడతాడు. ఒకడు శిక్షింపబడతాడు. తూర్పున మెరుపు పుట్టి పశ్చిమానికి వేగంగా పాకినట్లు త్రుటిలో మనుష్య కుమారుని రాకడ ఉంటుంది. నక్షత్రాలు రాలతాయి. భూమి నెరపిస్తుంది. దట్టపు చీకట్లు సూర్య చంద్రులను కప్పుతాయి. ప్రళయం సంభవిస్తుంది. గర్భిణులకు శ్రమ. భూమి పుట్టింది మొదలు చరిత్రలో ఎప్పుడూ ఇలాంటివి సంభవించ లేదు. పరిశుద్ధాత్మ గాని, దూతలు గాని, కుమారుడు గాని ఆ గడియ నెరుగరు. దేవుని కొక్కడికే తెలుసు. ఆకాశం, భూమి నశిస్తుంది. కానీ సత్యాలైన నా మాటలు చావవు. దేవుని దూత ప్రకాశమానంగా బాకానాదం చేయగా నేను ఆకాశ మార్గాన వస్తాను. ధవళ సింహాసనంపై నుండి దూతలను పంపి సర్వమానవ కోటిని పిలువనంపుతాను.

ఇంకా యేసు తన భక్తకోటితో ఇలా పలికాడు. నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా! నేను చెరసాలలో నున్నప్పుడు మీరు నన్ను చూడవచ్చారు. ఆకలి గొంటిని. నాకాహార మిచ్చారు. వేదనైనపుడు నాకై కన్నీరు నింపారు. పరదేశినైన నాకు ఆశ్రయమిచ్చారు. సృష్టి మొదలుగా మీకు సిద్ధం చేయబడిన రాజ్యమేలుకోండి.

– మత్తయి 24వ అధ్యాయం, మార్కు 13వ అధ్యాయం, లూకా 21:5-36

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

ధర్మసందేహం

ఉగాదినాడు పంచాంగ శ్రవణం ఎందుకు చేయాలి?



చాంద్రమానం అనుసరించే వారందరికీ ఉగాది పండుగరోజు సంవత్సర ప్రారంభం. ఆరోజున సంవత్సరంలో జరగబోయే మంచి చెడులను పంచాంగకర్తలు వినిపిస్తారు. గ్రహగతుల ఆధారంగా దేశానికి సంభవించే శుభాశుభాలు, దేశ గతులు, ప్రకృతి వైపరీత్యాలు, పాడిపంటల గురించి జ్యోతిష్య విజ్ఞానం అందించే ఫలితాలు తెలియచేస్తారు. ద్వాదశ రాశులవారికీ ఈ సంవత్సరం ఎలా ఉండబోతోందో చెబుతారు. పండుగ రోజున పంచాంగ శ్రవణం చేయడం సకల శ్రేయోదాయకం.

శ్రీమత్కామితదాయి, కల్మషహారం, దుర్దోషశాంతి ప్రదం
నానాయజ్ఞ విశేషభ్యఫదం, భూదాన త్యంన్నృణామ్
ఆరోగ్యాయురభీష్టదం, శుచికరం సంతాన సౌఖ్యోదయం
పుణ్యం కర్మసుసాధనం శ్రుతిహితం పంచాంగ మాకర్ణ్యతామ్

శోభాయుక్తమయినది, కోరికలు తీర్చేది, పాపాలను హరించేది, దోషాలు పోగొట్టేది, అనేక యజ్ఞముల చేతకానీ పొందలేని విశేష ఫలాలను విన్నంత మాత్రం చేత ఇచ్చేది పంచాంగ శ్రవణం. ఉగాదినాడు పంచాంగ శ్రవణం చేయడం వల్ల భూదానం చేసిన ఫలితం వస్తుంది. ఆయురారోగ్యాలు వృద్ధి పొందుతాయి. అన్నింటినీ మించి పవిత్ర కర్మలు ఆచరించే విధానాలు తెలిసివస్తాయి.

సమాధానం : డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి

దైవవాణి

దైవం మెచ్చే గుణాలు



అల్లాహ్ అమితంగా ప్రేమించే 8 గుణాలివే.

1. తౌబా : పశ్చాత్తాపం. నిశ్చయంగా దైవం పశ్చాత్తాప పడేవారిని ప్రేమిస్తాడు. (ఖురాన్ 2 : 222)

2. తహరత్ : పరిశుభ్రత. దైవం పారిశుద్ధ్యం అవలంబించే వారిని చేరదీస్తాడు. (ఖురాన్ 2 : 222)

3. తఖ్వా : భయభక్తులు. నిశ్చయంగా దైవం భయభక్తులున్నవారినే దీవిస్తాడు. (ఖురాన్ 9 : 4)

4. ఇహ్ సాస్ : మంచి అలవాట్లు కలిగి ఉండాలి. మంచి పనులనే ఎల్లప్పుడూ చేయాలి. (ఖురాన్ 3 : 134)

5. తవక్కుల్ : దైవంపై నమ్మకం సడలకుండా ఉండాలి. (ఖురాన్ 3 : 159)

6. అద్ ల్ : న్యాయశీలతను కలిగి ఉండాలి. ఏ పరిస్థితులలోనైనా న్యాయజీవనాన్ని విడిచిపెట్టకూడదు. (ఖురాన్ 5 : 42)

7. మసాబి : సమాజంలోని అందరినీ తనకు వలెనే సమభావంతో చూడాలి. (ఖురాన్ 49 : 9)

8. సబ్ ర్ : సహనం కలిగి ఉండాలి. అసహన పరులు దైవానికి దగ్గర కాలేరు. (ఖురాన్ 3 : 146)

అల్లాహ్ ప్రేమను పొందాలంటే ఈ ఎనిమిది గుణాలను పెంపొందించుకోవాలి.


– ముహమ్మద్ లియాఖత్ ఉద్దీన్

మారేడుదళం

తస్మైశ్రీ గురుమూర్తయే నమః

దక్షిణదిక్కుగా తిరిగి కూర్చున్న ఈశ్వరుడే దక్షిణామూర్తి. అధ్యాత్మ విద్యకు ఆయనే గురువు. ఆయనే మేధానిధి కనుక మేధాదక్షిణామూర్తిగా, జ్ఞానస్వరూపంగా ఆరాధిస్తారు. బ్రహ్మసత్యం జగన్మిథ్య అంటూ అద్వైతబోధ చేసిన ఆదిశంకరాచార్యులు దక్షిణామూర్తిని కీర్తిస్తూ చేసిన స్తోత్రం సుప్రసిద్ధం. అద్వైత సిద్ధాంతానికి దక్షిణామూర్తి స్తోత్రం పట్టుకొమ్మ. దక్షిణామూర్తి తత్త్వాన్ని తెలుసుకుంటే మాయవిడిపోతుందంటూ మొదలవుతుందీ స్తోత్రం. అనేక రంధ్రాలు కలిగిన కుండలో ఉన్న దీపపు కాంతిలాగా ప్రకాశించే జ్ఞానాన్ని కన్నుల మొదలు చేతుల దాకా సర్వరూప విశేషాలతో జగతికి పంచుతున్న గురువుకు వందనం చెబుతుంది. శివోహం అనే అద్వైతసిద్ధి కలగాలంటే దక్షిణామూర్తి స్తోత్రాన్ని శ్రవణ, మనన, ధ్యాన, సంకీర్తనల ద్వారా పదేపదే గుర్తుచేసుకోవాలని ఫలశ్రుతి. పదిశోక్లాల దక్షిణామూర్తి స్తోత్రానికి స్వామి పరమానందనాథ ఉపనిషత్తుల ఆధారంగా చక్కని వ్యాఖ్యను అందించారు.

శ్రీదక్షిణామూర్తి స్తోత్రమ్
రచన : స్వామి పరమానందనాథ, పేజీలు : 80 (1/8 డెమ్మీ), వెల : రూ. 45/-, ప్రచురణ : శివకామేశ్వరి గ్రంథమాల, 41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక, విజయవాడ - 13 ఫోన్ నెం. 9866820574



గీతరామాయణం - 3

అరణ్యకాండ

అభినవపోతన వానమామలై వరదాచార్యులు రచించిన గీతరామాయణంలోని మెచ్చుతునకలు.......

శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతంగా గంగాతీరానికి చేరుకున్నాడు. శృంగబేరిపుర రాజైన గుహుని ప్రేమార పలకరించాడు.

అమలము గంగా విమలుడు రాముడు /
రాముని పావన నామమె దరినిడు / దివ్య
ప్రవాసము త్రిదోషనాశము / గంగా నీకిది
మంగళయోగము / పొంగును గని
వెనుదిరుగకు నౌకా / గంగా
నీవుప్పొంగకుమా

– అని పాడుకుంటూ గుహుడు ముప్వురినీ గంగ దాటించాడు. అక్కడ అయోధ్యాపురిలో పుత్రవియోగంతో దశదిశల అంధకారం కమ్ముకొనగా దశరథుడు నాడు శ్రవణకుమారుని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. కైకేయిని తిట్టిపోశాడు.

అంత్యమందు నీ నామోచ్చారణ పెదవుల
గంగానీరము శ్రీరామా శ్రీరామ శ్రీరామ
రామ

– అంటూ తనువు చాలించాడు. తండ్రి మరణవార్త విని హుటాహుటిన నగరు చేరిన భరతుడు తల్లిని శత్రువులా చూశాడు. 'ఎచటనున్న నచ్చటనె రాము తలనిడవలయు కిరీటమ్ము' అనుకుంటూ రాముణ్ణి వెతుకుతూ వనాలకు బయలుదేరాడు. రాముని మ్రోలవాలి తన తల్లి తప్పును క్షమించమన్నాడు. రాముడు తమ్ముణ్ణి ఓదార్చాడు.


రాము బదులుగ పాదుకాద్వయి రంజిలుత
మందిరమున
నగరసీమను వీడి యందెందైన నే
నాదరమున
సవిత్ృ కరరేఖలకు బదులుగ
సంజదీపము వెలుగుచుండు

– అంటూ భరతుడు రామపాదుకలను శిరస్సున ధరించి వెళ్లిపోయాడు.

జనస్థానమున క్షోభము
రేగెను చచ్చిరి ఖరదూషణుల్
చచ్చిరిపో పదునాల్గువేల
రాక్షసులు నీ భూషణుల్
జనస్థానమున దేవసముడుగా
పూజ్యుడయ్యె నా యతి

– అన్నా రావణా! నీ ఇరవై కన్నులూ పూర్తిగా విప్పార్చి చూడు. ఆ రఘువంశీయుని వల్ల నీ చెల్లెలు శూర్పణఖ విరూప అయింది. పురుషసింహుడైన రాముడు దండకారణ్యాన్ని పూర్తిగా గెలుచుకున్నాడు. నీ రాజ్యంలోనే అతడు నీ కంటె పూజ్యుడయ్యాడు. అతని చేతుల్లోనుంచి వెలువడే ఒక్కో బాణం ఒక్కో విద్యుల్లత. నువ్విలాగే కూర్చుంటే రేపీపాటికి నీ పీఠాన్ని కూడా అతడు కదిలించివేస్తాడు. అన్నా! చెప్పడం మరిచిపోయాను. ఆ రాముడు భూలోక మన్మథుడు. అతని వెంట రతీదేవి వంటి సౌందర్యరాశి జానకి ఉన్నది. ఆ సుందరిని నీకోసం తీసుకురావాలని వారి కుటీరం వద్దకు వెళ్లాను. చూడు వాళ్లు నా ముక్కుచెవులు చెక్కి పంపించేశారు. నీకా సుందరి కావాలంటే తొందరగా వెళ్లు – అంటూ శూర్పణఖ రావణుణ్ణి తొందరపెట్టింది.

మారీచుడు బంగారు లేడిగా మారి పంచవటి సమీపంలో తిరుగాడ జొచ్చాడు. సీతాదేవి హఠంచేసి రాముణ్ణి లేడివెంట తరిమింది. రావణుడి పాచిక పారింది. సీతాపహరణం జరిగింది. ఆశ్రమానికి తిరిగి చేరుకున్న రామునికి సీత కనబడక కలత చెందాడు. ఎవరో రాక్షసుడు సీతాదేవిని అపహరించాడని అక్కడి పాదముద్రలను బట్టి అంచనా వేశాడు.



కొంతదూరంలో రావణ ధనువు విరిగి పడివుంది. అది మణిరత్న ఖచితమై ఉండడాన్ని గమనించాడు. వైఢూర్యాలు పొదిగిన కవచం తెగిపడివుంది. అంటే సీతను అపహరించిన రాక్షసుణ్ణి ఎవరో ఎదరించి వానితో యుద్ధం చేశారు. అదుగో దండం. ఛత్రం కూడా విరిగిపడి ఉన్నాయి. లక్ష్మణా! చూడు సీతను అపహరించిన వాని రథం నొగలు విరిగాయి. చక్రం ఇరుసులు చెక్కలయిపోయాయి. కానీ ఇది సామాన్య రథంలా లేదు. ఆకాశంలో చూశావా మబ్బులన్నింటినీ ఎవరో వెనక్కు తోసుకుంటూ వెళ్లిపోయినట్లు ఆకాశంలో చీకటి కమ్ముకుంది. ఈ అసామాన్య రథం ఎవరిది? వాడెందుకు వచ్చినట్లు? సీతను ఎత్తుకుపోయాడా? ఆమెను చంపి తినేశాడా? అతడితో యుద్ధం చేసినవారెవ్వరు? వారిలో ఆమెను గెల్చుకున్నవారెవ్వరు? రాముడు సందిగ్ధంలో పడిపోయాడు.

ఎపుడేదో యార్తిని నేవింటి,
నీవినా సీత నేగంటి
మరిదియును లేడు
తన నంటి బలము పుంజుకుని ఎగిరితిని
రథపథ మడ్డగించితిని నేతా!
ఖలునడ్డగించి కూలితిని
రావణు కరమున బడె నీ సీతా

– అని సమాచారమిచ్చి జటాయువు ప్రాణాలు విడిచిపెట్టాడు. జటాయువు చూపిన దిక్కుగా రామలక్ష్మణులు సీతాన్వేషణ కొనసాగించారు.

– ముకుందప్రియ



ఇక కోహ్లీకి మహర్దశ

నాగ్‌పూర్ జ్యోతిష్యుడి జోస్యం

న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఇప్పటికే జాతీయ, ప్రపంచ క్రికెట్‌పై తిరుగులేని ముద్ర వేసుకున్నాడు. దూకుడైన బ్యాటింగ్‌తో, అద్భుతమైన కెప్టెన్సీతో ఈ రన్ మెషీన్ ఇప్పటికే లెక్క లేనన్ని ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టాడు. అయితే త్వరలోనే విరాట్ కోహ్లీ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డులు తిరగరాస్తాడని నాగ్‌పూర్‌కు చెందిన క్రికెట్ జ్యోతిష్యుడు నరేంద్ర బుందే పేర్కొన్నాడు. గతంలో టీం ఇండియా మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీకి జట్టులో స్థానం కల్పించడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో అతను 2019 ప్రపంచకప్ వరకూ జట్టులో కొనసాగుతాడని నరేంద్ర బుందే జోస్యం చెప్పాడు. తాజాగా విరాట్ 2025కల్లా టీ-20, వన్డే ప్రపంచకప్‌లు గెలుస్తాడని, అంతేకాక సచిన్ టెండూల్కర్ 100 సెంచరీల రికార్డునూ బద్దలుకొడతాడని పేర్కొన్నాడు. ''నేను గతంలో చెప్పిన జాతకాలన్ని నిజమయ్యాయి. ఇప్పుడు చెప్పినవి కూడా అక్షర సత్యాలు. త్వరలో విరాట్.. సచిన్ రికార్డులతో పాటు అతను మార్క్ మాస్కరెనాస్‌తో కుదుర్చుకున్న.. భారీ వ్యాపార ఒప్పందం లాంటి ఒప్పందాన్ని విరాట్ 2018లో కుదుర్చుకుంటాడు. అది క్రికెట్ చరిత్రలోనే అత్యంత ధనిక ఒప్పందం అవుతుంది'' అని నరేంద్ర తెలిపాడు. ''కోహ్లీకి శుక్రుడు ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఉన్నాడు. అందుకే అతను విదేశాల్లోనూ రాణిస్తున్నాడు. రానున్న ఆస్ట్రేలియా సిరీస్ కూడా టీం ఇండియాకు బాగా కలిసొస్తుంది'' అని బుందే తెలిపాడు. గతంలో నగలదుకాణానికి యుజమాని అయిన బుందే 2006 నుంచి క్రికెటర్ల జాతకాలు చెప్పడం ప్రారంభించాడు. అతని వద్ద గంగూలీ, మురళీ కార్తీక్, శ్రీశాంత్, జహీర్‌ఖాన్, గౌతమ్ గంభీర్, సురేష్ రైనా తదితరులు జాతకం చెప్పించుకున్నారు. అంతేకాక.. ఐపీఎల్‌లో ప్రీతి జింతా ఫ్రాంచైజీ గడ్డుకాలాన్ని ఎదురుకుంటున్న సమయంలోనూ బుందే వద్ద సలహా తీసుకుంది.



భారత్ టార్గెట్ 153

శ్రీలంకతో టి 20 ట్రైసిరీస్ కీలక మ్యాచ్

కొలంబో :నిదహాస్ కప్ ముక్కోణపు టి20 సిరీస్‌లో శ్రీలంక జట్టు కీలక మ్యాచ్‌లో భారత జట్టు ముంగిట 153 రన్స్ లక్ష్యాన్ని ఉంచింది. ఫైనల్ స్థానం పదిలం చేసుకోవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి శ్రీలంకకు బ్యాటింగ్ అప్పగించింది. 34 పరుగులకే శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ ధనుష్క గుణతిలక 17 రన్స్‌కు ఔటవ్వగా, డేంజరస్ బ్యాట్స్‌మెన్ కుశాల్ పెరీరా వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత మెండిస్, తరంగ మూడో వికెట్‌కు 60 రన్స్ జోడించారు. ఇద్దరూ ధాటిగా ఆడుతూ ఎడా పెడా ఫోర్లు కొట్టడంతో లంక స్కోరు 11 ఓవర్లకే వంద పరుగులు చేరువైంది. 96 పరుగుల వద్ద తరంగ అవుటవడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. వెంటవెంటనే వికెట్లు నష్టపోయిన లంక నిర్ణీత 19 ఓవర్లకు 9 వికెట్లు నష్టపోయి 152 రన్స్ చేసింది. మెండిస్ 38 బాల్స్‌లో 3 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 55 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



వర్షంతో ఆలస్యం

కీలకమైన ఈ మ్యాచ్‌లో భారత్ రిషబ్ పంత్ స్థానంలో కేఎల్‌రాహుల్‌కు అవకాశమిచ్చింది. మ్యాచ్ ప్రారంభానికి చిరుజల్లులు ఆటంకం కలిగించాయి. మెల్లగా వర్షం పెద్దదవడంతో ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. దీంతో నిర్ణీత సమయానికి దాదాపు గంటన్నర ఆలస్యంగా మొదలైంది. 19 ఓవర్లకు మ్యాచ్‌ను కుదించారు.

శ్రీలంక ఇన్నింగ్స్ : గుణతిలక (సి) రైనా (బి) ఠాకూర్ 17, మెండిస్ (సి) శర్మ (బి) చాహల్ 55, కుశాల్ పెరీరా (బి) సుందర్ 3, తరంగ (బి) శంకర్ 22, సి. పెరీరా (సి) చాహల్ (బి) ఠాకూర్ 15, జె.మెండిస్ (బి)సుందర్ 1, షణక (సి) కార్తీక్ (బి) ఠాకూర్ 19, ధనుంజయ (సి) రాహుల్ (బి) ఉనద్కత్ 5, లక్మల్ (నాటౌట్) 5, చమీర(సి) ఉనద్కత్ (బి) ఠాకూర్ 0, ఫెర్నాండో (నాటౌట్)0, ఎక్స్‌ట్రాలు 10, మొత్తం 19 ఓవర్లలో 152/9. వికెట్ల పతనం 1-25, 2-34, 3-96.4-113,5-118, 6-120, 7-146, 8-151, 9-151.

బౌలింగ్: ఉనద్కత్ 3-0-33-1, సుందర్ 4-0-21-2, శార్దూల్ ఠాకూర్ 4-0-27-4, చాహల్ 4-0-34-1, విజయ్ శంకర్ 3-0-30-1, రైనా 1-0-6-0.

పాకిస్తాన్‌లో వెస్టిండీస్ టూర్

కరాచీ : పాకిస్తాన్‌లో మళ్లీ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకుంటున్నాయి. వచ్చే ఏప్రిల్‌లో వెస్టిండీస్ జట్టు పాకిస్తాన్‌లో పర్యటించే అవకాశముంది. ఈ పర్యటనలో మూడు టి 20 మ్యాచ్‌లు కరాచీలో ఆడుతుందని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తెలిపింది. ఏప్రిల్ 1,2,4 తేదీల్లో ఈ టి20 మ్యాచ్‌లు కరాచీలో జరుగుతాయి. 2008లో శ్రీలంక జట్టు పర్యటన సంరద్భంగా లాహోర్‌లో జరిగిన దాడి తర్వాత పాకిస్తాన్ అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు దూరమైంది. ప్రస్తుతం పాకిస్తాన్‌లో జరుతున్న సూపర్ లీగ్ టోర్నీ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను ఐసీసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 25న జరిగే పాకిస్తాన్ క్రికెట్ లీగ్ ఫైనల్ సందర్భంగా ఐసీసీ సెక్యూరిటీ బృందం పాకిస్తాన్‌లో పర్యటిస్తుంది. ఆ తర్వాత ఐసీసీకి నివేధిక ఇస్తుందని పాకిస్తాన్ క్రికెట బోర్డు చైర్మన్ నజామ్ సేథి తెలిపారు. 2009లో శ్రీలంక క్రికెట్ల బస్‌పై దాడి తర్వాత పాకిస్తాన్ జట్టు చాలా మ్యాచ్‌లను యూఏఈలో ఆడింది. తమదేశంలో పర్యటించేందుకు వెస్టిండీస్ జట్టు అంగీకరించిందని అయన తెలిపారు.

థిసారా పెరీరాకు కెప్టెన్సీ



కొలంబో : శ్రీలంకకు తాత్కాలిక కెప్టెన్‌గా తిసారా పెరీరా ఎంపికయ్యాడు. ప్రస్తుతం కొలంబోలో జరుగుతున్న ముక్కోణపు ట్రై సిరీస్‌లోలంక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న చండీమాల్ దూరమవడంతో ఆ జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి శ్రీలంక జట్టు నాలుగు ఓవర్లు తక్కువ వేసింది. ఈ కారణంగా మ్యాచ్ రెఫరీ చండీమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాడు. ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజులో 60 శాతం కోత విధించాడు. ఈ కారణంగా కెప్టెన్సీకి దూరమైన చండీమాల్ స్థానంలో పెరీరాకు సారథ్య బాధ్యతలు అప్పగిస్తున్నట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు తెలిపింది.

క్యూట్ కపుల్!

న్యూఢిల్లీ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మల తాజా ఫోటోలు ఇప్పుడు నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. శ్రీలంకలో జరుగుతున్న టి20 ట్రై సిరీస్‌కు దూరంగా ఉన్న కోహ్లీ , సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న అనుష్క కొంత విరామం తీసుకొని ఇప్పుడు సరదాగా గడుపుతున్నారు. వారు తమ కొన్ని ఫోటోలను అభిమానులకు సోషల్ మీడియాలో పంచుకున్నారు. భర్తపై తనకున్న ప్రేమను తెలుపుతూ కోహ్లీకి ముద్దుపెడుతున్న ఫోటోను తాజాగా అనుష్క ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ జంట కొత్త ఫోటో చూసి అభిమానులు సంబరపడి పోతున్నారు. రకరకాల కామెంట్లు పెడుతున్నారు. 'లవ్లీ కపుల్, ఇంటర్నెట్‌లో ఇవాళ ఇదే బెస్ట్ ఫోటో' అని కొందరంటే, మిమ్మల్ని చూస్తే అసూయగా ఉందని ఇంకొందరు వ్యాఖ్యానించారు. ఇద్దరికీ ఆల్‌ది బెస్ట్... క్యూట్ కపుల్ అంటూ మరికొందరు కామెంట్ పెట్టారు. అలాగే కోహ్లీ కూడా తన భార్యతో దిగిన ఓఫోటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ఇది కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది.



రాజీ..!

రోజుకో మలుపుతిరుగుతున్న షమీ ఎపిసోడ్

కోల్‌కతా : టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ, అతని భార్య షహీన్ జహాన్ మధ్య వివాదం కొలిక్కి వచ్చేలా కనిపిస్తోంది. ఇద్దరూ కలసి పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన భర్త మోసగాడని, చాలా మందితో సంబంధాలున్నాయని భార్య జహాన్ సంచలన ఆరోపణలతో చిక్కుల్లో పడ్డ షమీ చివరకు మెట్టుదిగాడు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కోల్‌కతా పోలీసులు కేసులు పెట్టడంతో షమీ రాజీకొచ్చాడు. తన కాపురాన్ని చక్కదిద్దుకునే పనిలో పడ్డాడు. రెండు కుటుంబాలు రాజీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇద్దరి మధ్యా వివాదం సమసిపోయేలా కనిపిస్తోంది. భార్య ఆరోపణలతో అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయి, మళ్లీ మీడియా ముందు ప్రత్యక్షమైన షమీ పూర్తి స్థాయిలో విచారిస్తే అన్ని ఆరోపణలు బయటపడతాయని చెప్పిన షమీ చర్చల ద్వారా పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నానని చెప్పాడు. న్యాయపరంగానూ ముందుకెళ్లేందుకు సిద్ధమని చెప్పినప్పటికీ అంతా సర్దుకుపోతాయని ఆశిస్తున్నానని చెప్పాడు. ఈ వివాదం నేపథ్యంలో షమి - జహాన్‌ల మూడేళ్ల కూతురు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కుటుంబ సభ్యులు ఇద్దరి మధ్యా వివాదానికి ఇంతటితో ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయానికొచ్చారు. కోల్‌కతాకే కాదు ఆమె ఎక్కడికి రమ్మన్నా వస్తానంటూ ప్రకటించిన షమీ న్యాయవాదులు కోల్‌కతాకు వెళ్లారు. షమీ బంధువులు, అత్తామామలు నాతో చర్చలు జరిపారని హసిన తరపు న్యాయవాది జకిర్ హుస్సేన్ తెలిపారు. రెండు వర్గాల వారూకోర్టు బయటే వివాదాన్ని సెటిల్ చేసుకు నేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించాడు. త్వరలోనే ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడుతుందని ఆశిస్తున్నాని తెలిపాడు. ఇక కేసుపై ఇప్పటికే విచారణ ప్రారంభించిన కోల్‌కతా పోలీసులు హసీన్ న్యాయవాది చెప్పిన వివరాలను రికార్డు చేశారు. హసీన్ తండ్రి కూడా షమీకి మద్దతుగా నిలవటం ఈ వివాదంలో కీలక పరిణామంగా చెబుతున్నారు. చేసిన తప్పు ఒప్పుకుంటే కలసి ఉండే విషయం ఆలోచిస్తానని జహాన్ చెప్పటంతో వివాదానికి ఫుల్‌స్టాప్ పడే అవకాశముంది.

దుబాయ్ ఎందుకు వెళ్లాడు..!

షమీ భార్య ఫిర్యాదు వ్యవహారాన్ని విచారించేందుకు కోల్‌కతా పోలీసులు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులను ఆశ్రయించారు. షమీ దక్షిణాఫ్రికా పర్యటన వివరాలను ఇవ్వాలని బీసీసీఐని కోరారు. డిసెంబర్ చివర్లో భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. అయితే ఈ టూర్ మొత్తం షమీ దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడా.. మరెక్కడికైనా వెళ్లాడా అన్న వివరాలను కోల్‌కతా పోలీసులు సేకరించను న్నారు. దక్షిణాఫ్రికా నుంచి భారత జట్టు తిరిగొచ్చినా షమీ మాత్రం దుబాయ్‌లోనే ఉన్నాడని ఫిబ్రవరి 18న పాకిస్తాన్ మహిళతో ఓహోటల్‌లో గడిపాడని భార్య హసీన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో బోర్డు ఇచ్చే సమాచారం కేసు విచారణలో కీలకమవుతుందని కోల్‌కతా పోలీసులు చెబుతున్నారు.

లార్డ్స్ టెస్ట్‌కు బెన్‌స్టోక్స్ దూరం



న్యూఢిల్లీ: వచ్చే జూన్‌లో ఇంగ్లండ్-భారత్‌ల మధ్య లార్డ్స్‌లో జరిగే టెస్ట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ దూరమయ్యాడు. ఈ జూన్ నుంచి భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్‌లో ఐదు టెస్ట్‌లు, మూడు వన్డేలు, మూడు టి ట్వంటీలు ఆడుతుంది. బ్రిస్టల్ నైట్‌క్లబ్‌లో సెప్టెంబర్‌లో జరిగిన గొడవ వివాదంలో విచారణ ఆగస్టు ఆరుకు వాయిదా పడింది. అదే సమయంలో లార్డ్స్ టెస్ట్ జరగనుంది.

మేరీకోమ్ బాక్సింగ్ అకాడమీని ప్రారంభించనున్న మోదీ

న్యూఢిల్లీ : ఇంఫాల్‌లో భారత స్టార్ బాక్సర్ మేరీ కోమ్ ప్రారంభించనున్న అకాడమీని ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. మూడున్నర ఎకరాల్లో నిర్మించిన ఈ అకాడమీ ఇంఫాల్‌కు 45 కిలో మీటర్ల దూరంలో ఉంది. 2103లో మణిపూర్ ప్రభుత్వం మేరీకోమ్‌కు అకాడమీ కట్టుకునేందుకు స్థలం కేటాయించింది. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులతో ఈ అకాడమీని నిర్మించారు. 20 మంది బాలికలతో పాటు మొత్తం 45 మంది ఈ అకాడమీలో శిక్షణ పొందుతారు.



బాంబ్రీ సంచలనం



ఇండియన్ వెల్స్ : భారత డేవిస్‌కప్ ఆటగాడు యూకీ బాంబ్రీ అంతర్జాతీయ టెన్నిస్ పోటీల్లో సంచలన విజయం సాధించాడు. ఇండియానా వెల్స్‌లో జరుగుతున్న మాస్టర్స్ టోర్నీలో బాంబ్రీ ప్రపంచ 12వ ర్యాంక్ ఆటగాడు లూకాస్ పొల్లీని చిత్తు చేసి కెరీర్‌లో అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసుకున్నాడు. ఈ విజయంతో బాంబ్రీ ఈ టోర్నీలో మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు.

దక్షిణాఫ్రికా ప్రతీకారం



పోర్ట్ ఎలిజబెత్: నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు నాలుగు వికెట్లు నష్టపోయి సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 180/5 పరుగుల స్కోరుతో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా మరో 59 రన్స్‌కే మిగతా ఐదు వికెట్లు చేజార్చుకుంది. దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ రబాడా రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి ఆసీస్‌కు చుక్కలు చూపెట్టిన రబాడా రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిపోయాడు. మ్యాచ్ మొత్తంలో 11 వికెట్లు పడగొట్టాడు. ఒకే టెస్ట్‌లో ఇన్ని వికెట్లు పడగొట్టిన మూడో దక్షిణాఫ్రికా బౌలర్‌గా రికార్డుల్లోకెక్కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. **సంక్షిప్త స్కోర్లు :** ఆస్ట్రేలియా ఫస్ట్ ఇన్నింగ్స్ : 243 (వార్నర్ 63, రబాడా 5/96), దక్షిణాఫ్రికా ఫస్ట్ ఇన్నింగ్స్ :382, డివిలియర్స్ (126 నాటౌట్), కమిన్స్ (3/79), ఆస్ట్రేలియా సెకండ్ ఇన్నింగ్స్ :239 (ఖాజా 75, రబాడా 6/54), దక్షిణాఫ్రికా సెకండ్ ఇన్నింగ్స్ : 102 /4 (డివిలియర్స్ 28, లయన్ 2/44).



భారత్‌కు అగ్రస్థానం

ప్రపంచ షూటింగ్ చాంపియన్ షిప్

న్యూఢిల్లీ : ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు జయకేతనం ఎగరేవేసి భారత్‌ను పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిపారు. భారత షూటింగ్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా నాలుగు స్వర్ణ, ఒక రజత, మూడు కాంస్య పతకాలు గెలుచుకుని అంతర్జాతీయ షూటింగ్ పోటీల్లో త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. ఇలా ఓ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్ ఇన్ని పతకాలు సాధించటం షూటింగ్ చరిత్రలోనే ప్రథమం. మొత్తం తొమ్మిది పతకాలు కొల్లగొట్టిన భారత్ మెక్సికోలో ముగిసిన పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో చివరి రోజు జరిగిన మెన్స్ స్కీట్ పోటీల్లో అమెరికా షూటర్ రెండు సార్లు ఒలింపిక్ చాంపిన్ విన్సెంట్ హాన్‌కాక్ స్వర్ణం సాధించాడు. ఈ విభాగంలో పోటీపడ్డ భారత షూటర్లు సమిత్ సింగ్ 15వ స్థానం ఆంగద్ బజ్వా 18వ స్థానం, షరీజ్ షేక 30వ స్థానంలో నిలిచి నిరుత్సాహపరచినప్పటికీ మొత్తంగా ఈ టోర్నమెంట్‌లో భారత షూటర్లు కనబరిచిన ప్రతిభ క్రీడారంగంలో చిరస్మరణీయం. రిజ్వి, మను బక్తర్, అఖిల్, ఓంప్రకాశ్‌లు ఈ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించగా, అంజుమ్ రతజం గెలుచుకుంది. ఇక జితూరాయ్, రవికుమార్‌లు రెండు కాంస్య పతకాలు భారత్‌కు అందించారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.